
Website : www.saisadguruvani.org

"విజయదశమి" ప్రత్యేక సంచిక



# శ్రీ భరద్వాజ సద్గురువాణి




అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2021

సంపుటి-21

సంచిక-4



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

శ్రీ భరద్వాజ
# సద్గురువాణి

సంపుటి - 21 అక్టోబర్, నవంబర్, డిశెంబర్ - 2021 సంచిక - 4

**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'విజయదశమి' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**



"నా సమాధి నుంచియే నేను సర్వ కార్యములు నిర్వహింతును"
- శ్రీ శిరిడీ సాయిబాబా

## చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | - రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**


**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224

E-mail : poorna.sai09@gmail.com
Website : **www.saisadguruvani.org**
Facebook : **Sri Shiridi Sai Seva Trust**
Co-Ordinator at USA : **Sri K. KARUNAREDDY**

## విషయ సూచిక

1. విషయసూచిక ....... 1
2. మా మాట ....... 2
3. విజయదశమి ....... 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ....... 5
5. సద్బ్రాహ్మణుడు శ్రీ శిరిడీ సాయి ....... 8
6. శ్రీగురు చరితామృతము ....... 9
7. పండుగలు - పర్వదినాలు ....... 11
8. తమసోమాజ్యోతిర్గమయ ....... 12
9. ఒక్క క్షణం ....... 13
10. కష్టోద్ధర స్తోత్రం ....... 14
11. జిజ్ఞాస ....... 15
12. మన సంప్రదాయాలు-కార్తీకపౌర్ణమి ....... 16
13. పూర్ణ అంతరంగాలు ....... 17
14. సాధన ....... 20
15. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ....... 21
16. ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక ....... 22
17. మేము సహితం ....... 24
18. జన్మదిన శుభాకాంక్షలు ....... 25
19. పుస్తక పరిచయం ....... 28
20. స్ఫూర్తి ప్రధాత (బి.వి. నర్సింహస్వామి) ....... 29
21. ఆదర్శమూర్తి ఆచార్య శ్రీ భరద్వాజ ....... 31
22. బాలవికాశం ....... 33
23. దత్త జయంతి మహోత్సవం ....... 34
24. తెలుసుకుందాము ....... 35
25. అనఘా వ్రతం ....... 36
26. శ్రీ దత్తాత్రేయుడు ....... 37
27. సింధునది పుష్కరాలు ....... 38
28. సత్సంగమము ....... 39
29. ఏరిన ముత్యాలు ....... 40



# మా మాట

## పాఠకులకు, ప్రకటన కర్తలందరికి విజయదశమి, దీపావళి శుభాకాంక్షలు

కలియుగము ప్రారంభించమని బ్రహ్మదేవుడు కలిపురుషున్ని ఆదేశించగా, ఒక చేతితో మర్మావయవాన్ని, మరొక చేతితో నాలుకను పట్టుకొని వచ్చిన కలిపురుషుడిని చూసి బ్రహ్మదేవుడు "అతని వికృత చేష్టకు కారణమేమిటి" అని అడుగగా, "కలియుగములోని మానవులందరినీ కాముకులుగాను, (మర్మావయనాన్ని పట్టుకోవడం), జిహ్వాచాపల్యం కలవారిగాను (నాలుక పట్టుకొని ఉండటము) మారుస్తాను అని ప్రతిజ్ఞ పూనేను అదే ఈనా చేష్టకు అర్ధమని" చెప్పేడు. అప్పుడు కలితో బ్రహ్మ "నీవు భూలోకానికి వెళ్ళి, అక్కడ 4 లక్షల 32 వేల సంవత్సరాలు నీ ధర్మాన్ని ప్రవర్తింపచేయి, అయితే నీవు భూలోకంలో ధర్మమాచరించేవారిని విడిచిపెట్టి తదితరులలోని అధర్మాన్ని ఆసరాచేసుకొని, వారిని లోబరుచుకొని, నీ ధర్మాన్ని ప్రవర్తింపచేయి. శివకేశవులు ఒక్కరే అని తెలిసి పూజించేవారిని, తల్లి, తండ్రి, గురువులను సేవించేవారిని, గోవు, తులసి మొదలైన వాటిని పూజించేవారిని, వేద-శాస్త్ర, పురాణ, స్మృతులను ఆశక్తితో విని, వివేకం పొంది ధర్మమాచరించేవారిని నీవు బాధించవద్దు, ప్రత్యేకించి గురుసేవయందు దీక్షవహించిన వారిని, గురుభక్తులను నీవేమీ చేయలేవు. నీవు వారి సమీపానికి కూడ వెళ్ళవద్దు" అన్నారు బ్రహ్మదేవుడు. ఆ మాట విన్న కలిపురుషుడు "స్వామీ! నేను నిద్ర, కలహము, దుఃఖములంటే ఇష్టపడేవాడిని. స్త్రీ, పుత్ర, ధన వ్యామోహాలలో చిక్కినవారు, అధర్మపరులు, దొంగ సన్యాసులు, నమ్మినవారికి ద్రోహంచేసేవారు నాకిష్టులు. పుణ్యకార్యాలు చేసేవారు, ధర్మపరులు బ్రహ్మజ్ఞానులు, నిత్యఅనుష్టానపరులను చూస్తే భయం, పైగా గురుసేవయందు నిమగ్నమైన వారిని, గురుభక్తుల దగ్గరకు అసలు వెళ్ళవద్దు అంటున్నారు, మరి నా ధర్మాన్ని ప్రవర్తింపచేసేది ఎట్లా" అన్నాడు కలిపురుషుడు. అందుకు బ్రహ్మదేవుడు "భూలోకంలో ప్రవేశించగానే మిగిలిన వారందరూ నీకు లోబడి ప్రవర్తించగలరు "వారిని ఆధారము, ఆసరా చేసుకొని నీ ధర్మాన్ని ప్రవర్తింపజేయమని" కలిపురుషున్ని ఆదేశించారు బ్రహ్మదేవుడు. కలిపురుషుడికి హెచ్చరిక చేస్తూనే, మానవులకు కలిప్రభానికి లొంగక జన్మసార్ధకం చేసుకోవటానికి అత్యుత్తమమైన మార్గం కూడ తెలియజేశాడు బ్రహ్మదేవుడు. మోక్షమార్గానికి ముఖద్వారమైన మానవ జన్మ లభించాలని దేవతలు సహితం ఎదురుచూస్తారు. పుణ్యం ఎక్కువచేస్తే స్వర్గానికి, పాపం ఎక్కువచేస్తే నరకానికి వెళ్ళి, అవి క్షయము అవగానే గతజన్మ సంస్కారాన్ని అనుసరించి అనేక విధాలుగా జన్మించవలసి వస్తుంది. అయితే అత్యుత్తమమైన మానవజన్మలో మాత్రమే పాప, పుణ్యాలను రెండింటిని క్షయం చేసుకొని, మోక్షపదగామి అయ్యి, జన్మరాహిత్యం పొందే అవకాశం కలదు. ఆ యా యుగాలలో దుష్టశిక్షణ, శిష్ట సంరక్షణార్ధమై అవతరించిన భగవంతుడు, ఈయుగములో మానవులు కలి బారినపడి నశించకుండా ఉండటానికి, మానవులలోని దుష్టత్వాన్ని రూపుమాపి, సన్మార్గులుగా మార్చి, రక్షించి, తనంతటి వారిగా తయారుచేయటానికి గురురూపియై, శ్రీదత్తాత్రేయుడిగా అవతరించటము జరిగింది. శ్రీ దత్తాత్రేయుడు దేశ కాలమాన పరిస్థితులను అనుసరించి శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీ నృసింహ సరస్వతి, శ్రీ మాణిక్యప్రభువు, శ్రీ అక్కల్‌కోటస్వామిగా అవతరించి, చివరగా నేటి పరిస్థితులకు అనుగుణముగా, ప్రపంచమంతా వసుదైక కుటుంబముగా, కుల, మత, జాతి భేదాలు, వైషమ్యాలు వీడి, సోదర భావంతో కలసి మెలసి జీవించమని తన ఆచరణ ద్వారా బోధిస్తూ, సన్మార్గములో నడిపించటానికి శ్రీ శిరిడీసాయిబాబాగా అవతరించటము జరిగింది. "మానవులందరినీ జిహ్వాచాపల్యము కలవారుగాను, కాముకులు (కోరికల ప్రతిరూపము) గాను మారుస్తాను" అన్న కలి ప్రతిజ్ఞకు దాసోహులు కాకుండా, "రుచులకు పోవద్దు, ఒకటి రెండు పదార్థాలతో తృప్తిపడు", "కావాలనే కోరిక విడచి సర్వగతుడైన భగవంతుడి మీద మనస్సు నిలుపు గమ్యం చేరుతావు" అని బోధించి, ఒక్క అడుగు నావైపువేస్తే, వెంటనుండి పదిఅడుగులు నడిపిస్తాను అని అభయమిచ్చి, నడిపిస్తూ, మనలను తరింపచేయటానికి అవతరించిన జగద్గురువు శ్రీ శిరిడీసాయి. ఇక జన్మసార్ధకతకై ప్రయత్నం ప్రారంభించాల్సింది మనమే. జన్మసార్ధకతకు నాలుగు సమకూడాలి, మార్గనిర్దేశకత్వం చేసే ఉత్తముడైన గురువు లభించాలి, ఆ గురువును సేవించుకునే అవకాశము కలగాలి, ఆ సేవకు గురువు సంప్రీతుడవ్వాలి, సంప్రీతుడు అయిన గురువు మన పూర్వజన్మ సంస్కారాన్ని అనుసరించి ఒక ఉత్తమమైన సాధనా మార్గం బోధించాలి. పూర్వజన్మ సుకృతం వలన ఆధ్యాత్మిక చక్రవర్తి అయిన శ్రీ శిరిడీసాయినాధుడు గురువుగా మనకు లభించారు. బాబా సంప్రీతుడయ్యే విధముగా సేవిస్తూ జీవించగలిగితే, కలిపురుషుడు మన దగ్గరకు కూడ రాలేడు. అయితే అసలు వచ్చిన చిక్కంతా సేవచేయటం లోనే ఉంది. సేవచేయటం అంటే మనము అనుకున్నప్పుడో, మనకు అవసరమైనప్పుడో, బుద్ధికలిగి, వీలు కలిగినప్పుడు మాత్రమే చేసేది సేవ కాదు. సేవ అంటే స్వాతిచినుకు కొరకై ఆలుచిప్ప ఎదురుచూస్తున్నట్లుగా ఎదురుచూసి, కురిసిన మొదటి నీటిబిందువును తనలో ఒడిసి పట్టుకొని తనలో ఇముడ్చుకొని ముత్యముగా మార్చుకున్నట్లు, ఎప్పుడు గురువుకు మన అవసరం కలుగుతుందో, ఎప్పుడు వారి పిలుపు వినబడుతుందో, అని గురువు నోటినుండి


వెలువడే స్వాతిజల్లు వాక్కుకై ఎదురు చూసి, లభించిన అవకాశాన్ని గురువు సంప్రీతుడయ్యేలా నిర్వహించటమే శిష్యుని ప్రథమ కర్తవ్యం. అవసరం లేనప్పుడు ఎంతో చేసినా, అవసరములేని సమయములో కురిసిన జడివాన మురికికాలువలలో ప్రవహించిన చందమవుతుంది. "సరియైన సమయములో, సరియైన విధముగా, సరియైన పనిచేయటమే యోగము". "క్షణ క్షణమూ ఆత్మవికాసానికై కృషి చేయటం ఒక్కటే మానవజీవిత లక్ష్యం కావాలి" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. అప్పుడు మాత్రమే గురువును సేవించి తగురీతిన జీవించగలుగుతాము. తాను ఈ స్థితిలో ఉండటానికి తనకు లభించిన గురుసేవాభాగ్యమే కారణమని బాబా తన గురుసేవా వృత్తాంతములో తెలియజేసింది మనకొరకే. "గురువు అని నమ్మి వెంటవెళితే బావిలో తల్లక్రిందులుగా తనను వ్రేలాడదీసినా ఆనందం అనుభవించారు సాయి, జ్ఞానబోధకై ఒక గుహలోనికి తీసుకొని వెళ్ళి, పన్నెండు సంవత్సరాలు తన గురువు ధ్యానస్థులై ఉండిపోతే, వారి నోటికి ఆహారం అందించి , వారు విసర్జించిన మలమూత్రాలను తీసి శుభ్రంచేసి, ఏక్షణాన ఏమి ఆదేశిస్తారో అని, తన యావశ్శక్తిని తన కళ్ళలో నింపుకొని, నిరంతరం తన గురువుపై దృష్టి నిలిపి 12 సంవత్సరాలు అహర్నిశలు సేవచేసి, సర్వసమర్పణ చేసి, నిష్ఠ-సబూరి అనే రెండు పైసల దక్షిణ సమర్పించిన తరువాత, గురువు అనుగ్రహముతో ఈనాటి నాఈస్థితి నాకు లభించింది" అని సాయి తనపరం చేసుకొని గురుసేవ ఎట్లా చేయాలో బోధించారు మనకు. అదీ సేవచేయటము అంటే, అంతేగాని గుడికట్టి, శాలువాలు కప్పి, ఆభరణాలు చేయించి, ఆడంబరముగా పర్వదినాలు జరపటము కాదు. "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి, శిరిడీలోనే ఉన్నాడు అని అనుకునే వాడు నన్నసలు చూడనట్లే నీవు చూసేదంతా కలసి నేను" అని సజీవముగా శిరిడీలో సంచరించిన సమయములోనే బాబా బోధిస్తే, అది మరచి, ఒక రూపానికో, ఒక విధానానికో సాయిని పరిమితం చేస్తూ, పోటీలు, వంతులతో ఆదిపత్యానికై పాటుపడేవారిని చూసే, తన భౌతిక సీమనుదాటి 1918 అక్టోబరు 15వతేదీ విజయదశమి పర్వదినాన విశ్వవ్యాపకుడైన సాయి "నా నామం పలుకుతుంది, నా మట్టి సమాధానమిస్తుంది, నా సమాధి మీకు జవాబిస్తుంది" అని చెప్పటమే కాక "నా సమాధి నుంచి నేను సర్వకార్యములు నిర్వహిస్తా"నని ఇచ్చిన అభయం ద్వారా సమాధి చెంది నేటికి 103 సంవత్సరాలు అవుతున్నా నిత్యసత్యులై తన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నారు. సాయి సంపూర్ణమైన అనుగ్రహాన్ని పొందటానికి మనలో అవరోధాలైన అరిషడ్వర్గాలనే రాక్షసులను గుర్తించి తొలగించుకొని 'కలి'పై విజయం సాధించమని శ్రీసాయి బోధిస్తుంటే, అది మరచి విజయదశమి అంటే సరదాలు తెచ్చే దసరా అంటూ, కలిసివచ్చే సెలవు దినాలు, విలాస యాత్రలు, బంధుమిత్రులతో కాలక్షేపాలు, విందువినోదాలు కొరకై సంహరించే, జంతువుల గురించి ముందునుంచే ప్రణాళికలు వేసుకునే వారలము సాయిభక్తులమవుతామా! కలిప్రభావానికి లోనయ్యి, కాలగర్భంలో కలసిపోకుండా, ఆలోచించి, ఆచరణకు ఉపక్రమిస్తూ, అందుకు అవరోధముగా నిలచిన మన శరీరమునే సత్రంలోని భావాలనే దొంగలను గుర్తించి తొలగించుకొనటమే నిజమైన "విజయదశమి". అరిషడ్వర్గాలు అనే అపరిశుభ్రమైన భావాలతో నిండిన హృదయమనే ప్రమిదను శుభ్రంచేసి, సిద్ధంచేసి, భక్తి, శ్రద్ధలనే రెండు వత్తులు వేసి, నేను అనే అహంకారమనే నూనెను అందులో పోసి, జ్ఞానస్వరూపుడయిన సద్గురు జ్యోతితో దానిని వెలిగించుకోవటమే "దీపావళి" పండుగ. అజ్ఞానమనే కారుచీకటిని మన హృదయమనే కుహరంలో వెలిగిన జగద్గురుజ్యోతి సహాయముతో పారద్రోలి, జీవిత గమ్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనంచేసి, సద్గురు సంప్రీతుడయ్యేలా జీవించిన నాడు "కదలిరాదా తనే వసంతం తన దరికిరాని వనాలకోసం" అన్నట్లుగా, జ్ఞాన స్వరూపియై, జనోద్ధరణే లక్ష్యంగా కలిగిన శ్రీదత్తప్రభువు కదలి వచ్చి మన ఎదుట నిలబడి, మనతో ఉండి, మనల్ని నడిపిస్తారు, అదే దత్తజయంతి.

కలి ప్రభావాలకు లొంగకుండా, సద్గురువును తెలుసుకుంటూ మానవజన్మ సార్థకతకై శ్రీసాయి బోధించిన బోధలకు ప్రత్యక్ష నిరూపణగా మారి సామాన్యుడు అసమాన్యుడై, సాయి అనుంగు బిడ్డడుగా మారవచ్చని రుజువుచేసి, ఎందరో మహాత్ములచే తమకంటే ఉన్నతుడని కీర్తించబడి, 'సాయిమాస్టర్'గా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి అనుగ్రహ ఆశీస్సులతో, వారందించిన స్ఫూర్తితో శ్రీ శిరిడీసాయి బోధనలలోని, సూక్తులలోని, చర్యలలోని, చివరకు మాట, చూపు, మందహాసములోని అంతరార్ధాన్ని అర్ధంచేసుకోవటానికి ప్రయత్నంచేస్తూ, నలుగురితో కలసి పంచుకోవటానికి చేసే, బృహత్తర జ్ఞాన సత్సంగ, అక్షరయజ్ఞ ప్రతిరూపమే "శ్రీ భరద్వాజ సద్గురువాణి". అందుకు ఆలంబనగా సాయి స్వరూపులైన అనేకమంది దత్తావతారుల, అవధూతల, మహాత్ముల పరిచయం, వారి బోధలను సమయానుకూలము, స్థలాభావాన్ని అనుసరించి మీతో పంచుకోవటానికి చేసే చిరుప్రయత్నమే "శ్రీ భరద్వాజ సద్గురువాణి" పత్రిక. ఆదిశగా తమవంతు బాధ్యతను నెరవేర్చటానికి శ్రీ భరద్వాజ సద్గురువాణి తన ప్రయత్నం కొనసాగిస్తున్నది. శ్రీ శిరిడీసాయి 1918 అక్టోబరు 15వ తేదీ విజయదశమి పర్వదినాన తన భౌతికదేహం వీడి సృష్టి చైతన్యంలో నిలిచారు. 2021 అక్టోబరు, 15వ తేదీ శుక్రవారము విజయదశమి నాటికి శ్రీసాయి సమాధి చెంది 103 సంవత్సరాలు అవుతుంది. ఈ సంవత్సరము తిథి, తేదీ రెండు కలసి రావటముతో ఈసంచికను "విజయదశమి" ప్రత్యేక సంచికగా రూపొందించి, అందించటానికి ప్రయత్నించాము, ఆ యా వ్యాసాలు మిమ్ములను అలరించి, ఆలోచింపచేస్తాయని ఆశిస్తాము. ప్రయత్నం మాది, సహకారము మీది, ఫలితం ప్రతిఒక్కరికి.

"శ్రీ భరద్వాజ సద్గురువాణి" అందరి 'హృదయవాణి'గా తీర్చి దిద్దటానికి రాసి, వాసిలో ఉన్నతముగా తీర్చిదిద్దటానికి అహర్నిశలు మాకృషి కొనసాగించగలమని, అందుకు నిరంతరం మీ సహాయ సహకారములు కొనసాగించగలరని కోరుకుంటూ..

**మీ పబ్లిషర్**

**"శ్రీ దత్తజయంతి" శుభాకాంక్షలతో...** **శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**



# బాబా సీమోల్లంఘనము - విజయదశమి

బాబా మహా సమాధి (విజయదశమి) పండుగను జరుపుకోబోతున్నాము. బాబా సమాధి మానవాళికి ఒక మేలుకొలుపు. ఒక నూతన యుగానికి అంకురార్పణ, ఒక క్రొత్త సంప్రదాయానికి శ్రీకారము చుట్టబడిన రోజు. పై వివరణ జనుల హృదయాలలో హత్తుకునేలా చేయటానికి అవతరించిన యుగకర్త శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారు.



ఈ విజయదశమి పండుగ మహారాష్ట్ర దేశంలో ఒక ప్రత్యేకతను సంతరించుకొని వుంది. ఈరోజు గ్రామ ప్రజలు ఊరి పొలిమేర దాటి శమీవృక్షపు ఆకులు ఒకరికొకరు యిచ్చి పుచ్చుకొని సోదరభావంతో కలిసి తిరిగి వస్తారు. పై కార్యక్రమాన్ని "సీమోల్లంఘనము" అని పిలుస్తారు. కాని 1916వ సంవత్సరములో జరిగిన సీమోల్లంఘనములో బాబా మనల్ని హెచ్చరించారు అనేకంటే మందలించారు అని చెప్పుకోవచ్చు. 60 సంవత్సరాల కాలము బాబాతో సన్నిహితముగా గడిపినా ఆయన పరబ్రహ్మ స్వరూపుడని అనుభవముల నిచ్చినా, ఐహికమయిన కోర్కెలతో ఆయనను ఆశ్రయించి నెరవేర్చుకున్నా, ఆయన హిందువా, ముస్లిమా అని విచికిత్స భక్తులు మానలేదు. సాయి ఆచరణ సద్ధర్మాచరణకాదు అని నిరశించిన మత చాంధసులు ఉన్నారు. గాలికి, నీటికి, అగ్నికి, ఏది కులము? ఏది మతము? అదే ఆయన కులము, అదే ఆయన మతము. అందుకనే బాబా ధులియాకోర్టు న్యాయవాదితో తమది "దైవకులము"అని చెప్పినారు. యీ విచికిత్స మానక తమకుతెలిసిన శాస్త్ర పరిజ్ఞానంతో, పాండిత్య ప్రకర్షతో ఆయనను కొలచాలని తలచినవారు ఉన్నారు. పై వాటికి సమాధానంగా శ్రీసాయి సీమోల్లంఘనమును వేదిక చేసుకున్నారు. సీమోల్లంఘనము రోజున, వస్త్రాలు విడిచేసి, నగ్నంగా ధునిముందర ఎఱ్ఱని కళ్ళతో ఉగ్రులై నిలుచుని, మూఢులారా! ఇప్పుడు నన్ను చూచి తేల్చుకోండి నేను హిందువునో, ముస్లిమునో అని కేకవేశారు. బడేబాబా సాయితో "బాబా! ఎందుకు భక్తులను భయపెడ్తారు? శాంతించమని" కోరగా "ఈ దినమే నా సీమోల్లంఘనము" అన్నారు సాయి. చిత్రం ఆ సమయంలో బాబాను చూచిన భక్తులు కూడా కొందరు ఆయనకు సుస్తి జరిగిందని, కొందరు జరగలేదని చెప్పటం గమనార్హం. అంటే సంకుచిత మత ద్వేషాలను ఉల్లంఘించి, మత ఆచ్ఛాధనలను విసర్జించి అట్టి సీమను దాటి నేను " పరబ్రహ్మను" అని ఎరుకపరచారు. మనలను కూడా మీరు గిరిగీసుకొని కూర్చున్న సీమలను దాటి మనమంతా మానవులం, సోదరులం, అనే భావన పెంపొందించుకోండి అని బోధిస్తున్నారో ఏమో!

ఆయన, సకల దేవతా స్వరూపము. అంటే ఏయే భక్తుడు ఏయే దేవతల నారాధించిన వారికి ఆ దేవతారూపంగానే దర్శనమిచ్చారు. ఆయన ఏ మత చిహ్నాన్ని తగిలించుకొని ప్రకటమవలేదు. ఆయన పరబ్రహ్మ స్వరూపుడు గనుక ఏ పేరుతో పిలిచినా పలుకుతారు. ఎలా కొలచినా సమ్మతిస్తారు. బాబా సర్వమత మనన్వయాన్ని సాధించటానికి అవతరించిన యుగపురుషుడు. ఆయన సర్వమతాల ఆరాధ్య దైవము, భక్తులు తన పటానికి, తన విగ్రహానికి చేసిన పూజలు, నివేదనలు, వారివారి ఇష్టదేవతలకే అందినట్లు అనుభవ నిదర్శనాలను ప్రసాదించారు. అందుకనే తనకు తన పటానికి భేదమే లేదని ఆయన చెప్పారు. గురువే సకల దేవతా స్వరూపమని "గురుగీత", గురువు దేవతలకంటే అధికుడు అని "శ్రీగురుచరిత్ర" చెప్పటము, అన్ని యిష్టదేవతా ఉపాసనాలు, సద్గురు అనుగ్రహానికి త్రోవ చూపించేవే అని అర్థము.

1916 విజయదశమి దాటిన కొద్దికాలానికి సాయి భక్తుడు రామచంద్ర పాటిల్‌కు జబ్బు చేసింది. ఎన్ని వైద్యాలకు లొంగలేదు. భయంతో శ్రీ సాయిబాబాను నిరంతరం స్మరిస్తున్నాడు. ఒకనాటి రాత్రి అతనికి సాయిబాబా సాక్షాత్కరించారు. పాటిల్ ఆయన పాదాలపై పడి, తన అంతిమ ఘడియ తెల్పమని కోరాడు. "భయంలేదు, మృత్యుదేవత ఉత్తర్వురద్దయింది, త్వరలో నీ జబ్బు తగ్గుతుంది. అయితే తాత్యా గురించే నాకు ఆందోళనగా ఉంది, అతడు 1918 విజయదశమి రోజున మరణించవలసియున్నది. ఈ సంగతి ఎవరికీ చెప్పవద్దు" అన్నారు బాబా. రామచంద్రపాటిల్ కొద్దిరోజుల్లో కోలుకున్నాడు. తాత్యా గురించి బాబా చెప్పిన విషయం బాలాషింపేకి మాత్రం చెప్పాడు.

పెరుగుతున్న శిరిడీ వైభవంతో పాటు పారవశ్యంతో రోజులు గడుస్తున్నాయి. 1918 అక్టోబరు నెల రానే వచ్చింది. నవరాత్రులు ఆరంభమవుతూనే తాత్యాకు జబ్బు చేసింది. అతడు మసీదుకు కూడా వెళ్ళలేకపోతున్నాడు. ఒకవైపు బాబాకు కూడ తీవ్రంగా జ్వరమొచ్చి క్రమంగా వారి ఆరోగ్యం క్షీణిస్తోంది. అయినా ఆయన భక్తులను ఆదరిస్తూనే ఉన్నారు. నిత్యము వారు తాత్యాకు ఊదీ పంపుతున్నారు. ఒకరోజు మసీదుకు రమ్మని కబురుచేసి అతనిచేత పాయసం తినిపించారు. తర్వాత అతని నొసట విభూతిపెట్టి, "తాత్యా, మొదట మనిద్దరి కోసం రెండు ఊయలలు తెప్పించాను. కాని మరలా మనసు మార్చుకున్నాను. నేనొక్కడినే వెళుతున్నాను. నువ్వింటికి వెళ్ళు" అని అతనిని పంపేశారు.

1918 అక్టోబరు 15వ తారీఖు మంగళవారం, విజయదశమి పర్వదినాన, దశమి గడిచి ఏకాదశి ఘడియలు ప్రవేశించాక మధ్యాహ్నం గం॥02.35ని.లకు సాయిబాబా మహాసమాధి చెందారు. తాత్యా ఆరోగ్యవంతుడయ్యాడు.

(అక్టోబరు 15వ తేదీ శుక్రవారము విజయదశమి శ్రీ శిరిడీసాయి బాబా 103వ మహాసమాధి సందర్భముగా సమర్పణ.)

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

శ్రద్ధ – గురువుపట్ల అచంచలమైన విశ్వాసం, సబూరి – సర్వకాల సర్వావస్థలయందు అది చెదరిపోని దృఢమైన నమ్మకం. ఈ రెండే శ్రీసాయి మనలను అడిగే దక్షిణ. "ఆరెండింటిని తన గురువుకు సమర్పించటమే తన నేటి ఈ స్థితికి కారణమని" శ్రీసాయి తన గురుసేవావృత్తాంతములో తెలియజేశారు. గురువుకు దక్షిణ సమర్పించటమంటే, వస్త్రాభరణాలు, భూషణాలు, ప్రభుత్వం వారు ముద్రించిన లోహపు కాసులు కాదు, తనువు, మనస్సు గురుప్రసాదమని, అది వారి సేవకే వినియోగించటము ద్వారా సార్థకత చెందుతున్నదని తెలిసి, తగురీతిన జీవితాన్ని మలచుకోవటం. తద్వారా మన సర్వబాధ్యతలు తానే వహించి, గురువు వెన్నంటి నడిపించి అవసరమైన వాటిని నెరవేరుస్తూ గమ్యం చేరుస్తారు. నిజానికి సద్గురువుకు కావలసింది, మనము అత్యంత విలువైనవిగా భావించే ధనం కాదు, మన మనస్సు, కాలము. అది గురువు పరంచేసినప్పుడు "నీవు నిశ్చింతగా కూర్చో అవసరమైనదంతా నేను చేస్తాను" అన్న సాయి సూక్తి అనుభవంలోకి వస్తుంది. దానికి అద్భుతమైన నిదర్శనం, శ్రీరఘువీర పురందరే జీవితం. అతని జీవితంలో జరిగిన ఘటనలద్వారా, శ్రీసాయికి శ్రద్ధ–సబూరి అనే రెండు రూపాయల దక్షిణ ఎట్లా సమర్పించాలో తేటతెల్లమవుతుంది. అందుకు నిదర్శనంగా నిలచే అతని జీవితంలోని కొన్ని సంఘటనలను పరిశీలిద్దాము.



అలనాటి బ్రిటీషు గవర్నమెంటుకు సంబంధించిన ఒక భవన నిర్మాణసంస్థలో నెలకు 35 రూపాయలు జీతానికి పనిచేసేవాడు పురందరే. చిన్ననాటి నుండి విష్ణుభక్తుడైన పురందరేకు ఒకసారి కలలో బాబా కనిపించి శిరిడీ రమ్మని పిలవటంతో, సాటివారి ద్వారా బాబా గురించి తెలుసుకోవటమే కాకుండా, దాసగణు హరికథలద్వారా శ్రీసాయి ఔన్నత్యాన్ని తెలుసుకొని వీలయినంత త్వరగా శిరిడీ వెళ్ళాలని తపన పడేవాడు పురందరే. తను, భార్య, తల్లి, చిన్న బిడ్డ, సోదరుడు అందరిని తన సంపాదనతోనే పోషించాల్సి రావటంతో తీవ్రమయిన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవాడు పురందరే. వీలయినంత త్వరగా శిరిడీ వెళ్ళి బాబాను దర్శించాలనే కోరికతో పైసా పైసా కూడబెట్టి, శిరిడీ బయలుదేరే సమయానికి, అతని చంటిబిడ్డకు తీవ్రమయిన జ్వరంరాగా, తల్లి వద్దని వారిస్తున్నా వినకుండా బాబాపై భారంవేసి తన తల్లి, భార్య, బిడ్డతో కలసి శిరిడీ బయలుదేరి వెళ్ళి, ద్వారకామాయిలో శ్రీసాయిని దర్శించి ఆనందపరవశుడైనాడు శ్రీ రఘువీర పురందరే. బాబా ప్రథమ దర్శనంలోనే తన ఆర్థిక బాధలు, లౌకిక విషయాలు మరచి, సాయి సన్నిధిలో పరమానందాన్ని పొందేడు పురందరే. "శాలకు వెళ్ళి సేదతీరి రమ్మన్న" బాబా ఆజ్ఞతో, అక్కడే ఉన్న దీక్షిత్ ద్వారా, శాల అని పిలువబడే రాధాకృష్ణమాయి ఇంటికి దారి తెలుసుకొని, కుటుంబ సమేతముగా అక్కడకు చేరి, మూసిన తలుపులు తట్టగా, తలుపు తీయకుండానే, వివరాలు అడిగి పంపివేసింది రాధాకృష్ణమాయి. మశీదుకు తిరిగి వచ్చిన పురందరే ద్వారా విషయం తెలుసుకున్న బాబా, ఒక్కక్షణం మౌనం వహించి, తిరిగి శాలకు వెళ్ళమనడంతో, బాబా మాటపై తిరిగి రాధాకృష్ణమాయి ఇంటికి చేరిన పురందరే తలుపులు తీసి ఉండటము చూసి, గుమ్మం దగ్గరకు చేరగానే, రాధాకృష్ణమాయి పురందరే కాళ్ళమీద పడి భోరున విలపించి, తేరుకొని, వారిని సాదరంగా లోనికి ఆహ్వానించి, వారికి తగిన ఏర్పాట్లుచేసింది. ఆమె స్వభావం అర్థంకాక తికమక పడ్డాడు పురందరే.

శ్రీసాయి స్వప్నంలో కనిపించి శిరిడీ రమ్మని చెప్పటంతో అంతర్లీనముగా పురందరే మనస్సులో దాగిన అహంకారాన్ని తొలగింపచేయటానికి, బాబా సన్నిధిలో ఏమి జరుగుతున్నదో పరోక్షంగా తెలుసుకుంటూ తగురీతిన వ్యవహరించే రాధాకృష్ణమాయిలో మాయను తొలగించటానికి, బాబా కల్పించిన సన్నివేశం అది.

"నాకు బాబా నుంచి రమ్మని ప్రత్యేక అహ్వానం వచ్చింది, నాకు బాబాపై అపారమైన విశ్వాసముంది, అందుకే బిడ్డ ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని, తల్లిమాటను కూడ లెక్క చేయకుండా శిరిడీ వచ్చాను, అందుకే నాకు ఇంతటి ఆదరణ" అనే భావం కలలో కూడ పురందరేకు రాకుండా ఇలలో సాయి చేసిన చమత్కారం అది. దాని పర్యవసానం శ్రీసాయి సన్నిధిలో అత్యంత వైభవంగా జరిగే చావడి ఉత్సవానికి శ్రీ రఘువీరపురందరే నిమిత్త మాత్రుడైనాడు. తెలియపరిస్తే, తెలుసుకోవటం కాకుండా, నిరంతరం ఎరుక గలిగి జీవించమని, మాయికి తన వద్ద నుండి వచ్చే ప్రతివారిలోనూ తననే దర్శిస్తూ పరిపూర్ణత్వం సాధించమని, పరోక్షంగా రాధాకృష్ణమాయికి శ్రీసాయి చేసిన బోధ అది, ఎంతగా పుటం పెడితే బంగారం అంతగా మెరుస్తుంది, ఎంతగా సాగదీస్తే అంతటి అద్భుతమైన నగగా మారి, ఉన్నతస్థానాన్ని అలంకరిస్తుంది, అది బంగారమైన, మనస్సైనా. లౌకిక ధనం, ఆభరణాలు, బాహ్యాలంకరణకు తోడ్పడి, తాత్కాలికంగా సుఖమిచ్చి ఇతరులకు ఆకర్షణగా నిలుస్తాయి. కాని మనస్సేబంగారమైన నాడు, అది

శాశ్వత అలంకారమై, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. అట్లా తయారు కమ్మనే, ఆ సంఘటన ద్వారా రాధాకృష్ణమాయికి, పురందరేకు, బాబా చేసిన బోధ. బరోడా రాణి ఒక బిందెనిండా బంగారపు కాసులు తెచ్చి బాబా ముందర ఉంచితే, "బాబా! బంగారం" అని ఆశ్చర్యంతో పలికిన మహల్సాపతితో, "భగత్ నిజమైన బంగారం ఏది? ఇది" అంటూ తన హృదయాన్ని శ్రీసాయిచూపటం, శ్రీ ఉపాసనీ బాబాతో, కులకర్ణి అనే మహాత్ముడు "నీ లోపల శరీరమంతా బంగారపు పూత పూయబడి ఉన్నది, నిన్ను ఉద్ధరించగలిగినవాడు శ్రీ శిరిడీసాయినాధుడు మాత్రమే" అంటూ, ఉపాసనీ బాబాను శిరిడీ వెళ్ళమని తెలపటం ఇక్కడ గమనార్హం.

పురందరే ఇంటిలో అడుగిడిన మరుక్షణం నుంచి, ఆ కుటుంబానికి అంతటికి సపర్యలు చేయటమే కాకుండా, పురందరేని తల్లిలా ఆదరించటం మొదలుపెట్టింది రాధాకృష్ణమాయి. శ్రీసాయి లీలావిలాసాలకు అచ్చెరువొందిన పురందరే, రాధాకృష్ణమాయి చెప్పిన విధంగా, తాను అక్కడ ఉన్నన్ని రోజులు బాబాకు తగిన సేవచేసేవాడు, శ్రీసాయి కూడ అతని సేవను అంగీకరించేవారు, శిరిడీ వెళ్ళిన మూడవరోజుకల్లా పురందరే కుమార్తె ఆరోగ్యం ఎటువంటి మందులు వాడకుండానే కుదుటపడింది. దానితో బాబాపై విశ్వాసం మరింత పెరిగింది పురందరేకు. అటుపిమ్మట, "ఇంటికి వెళ్ళటానికి అనుమతి ఇవ్వమని" పురందరే తల్లి బాబాను అడుగగా, "అతనికి నాకు ఏడు శతాబ్దాలుగా సంబంధం ఉన్నది, వాడు రెండువేల మైళ్ళ దూరంలో ఉన్న వాడితో సంబంధం కలిగి, మరువకుండా చూసుకుంటున్నాను. అతడు లేకుండా నేనేమి తినను కూడా, అటువంటప్పుడు ఇప్పుడే వచ్చి అప్పుడే వెళ్ళిపోతానంటే ఎట్లా, వాడు చేసే ఉపాసనే ఇంతదూరం తీసుకువచ్చింది. అదే కొనసాగించమని నీ బిడ్డతో చెప్పు, కొన్ని రోజులు ఆగి వెళుదురు గాని" అని బాబా చెప్పిన మాటలు నాతో చెబుతూ, అంతటి అదృష్టం పొందిన నన్ను చూసి మా అమ్మ ఆనందభాష్పాలు కార్చింది, ఆ మాటలు ఇప్పటికీ నా హృదయంలో మారుమోగుతున్నాయి" అంటారు శ్రీ పురందరే. బాబా అన్న మాటతో తన గమ్య స్థానం శిరిడీనే అని పురందరే నిర్ణయించుకున్నాడు. తిరిగి 13వ రోజున బాబా అనుమతి ఇవ్వటముతో, తిరిగి బొంబాయి వచ్చి, తనకు ఇష్టమైన విష్ణుపూజ కొనసాగించాడు పురందరే. అప్పటినుంచి తరచూ శిరిడీ వస్తూఉండేవాడు పురందరే. తనను దర్శించిన ప్రతిసారి పురందరేను రెండు రూపాయలు దక్షిణ అడిగేవారు బాబా. ప్రతి సారి అంత సమర్పించలేనని, దానికి తన ఆర్థిక పరిస్థితి సహకరించదని పురందరే అనటంతో "నేను అడిగేవి లౌకికమైన రెండు రూపాయల ధనం కాదు, శ్రద్ధ-సబూరి, ఎల్లప్పుడు, సంపూర్ణమైన విశ్వాసము, ఓరిమి ఆత్మవికాసముతో వేచిఉండు, ఇచ్చినమాటను నిలబెట్టుకో, నీవెప్పుడు సత్యాన్ని అంటిపెట్టుకొని ఉంటే, నీవెక్కడ ఉన్నా ,ఎల్లప్పుడు నీతోనే నేనుంటాను" అన్నారు సాయి. బాబా అభయానికి పొంగిపోయిన పురందరే, "బాబా చెప్పినది తప్పకుండా పాటిస్తానని చెప్పటమే కాకుండా, అందుకు వారి సంపూర్ణ అనుగ్రహముతో కూడిన సహకారం కావాలి" అని బాబాను వేడుకోగా, అందుకు శ్రీసాయిబాబా చిరునవ్వుతో అంగీకరించారు. మరుక్షణం నుంచి పురందరే తగురీతిన జీవించటానికి తనవంతు ప్రయత్నం ప్రారంభించాడు.

బొంబాయిలో తన వృత్తిలో ఎన్ని ఆటంకాలు, సమస్యలు, ఆర్థిక పరిస్థితులు ఎదురైనా, ఏనాడు పురందరే బాబాకు ఇచ్చిన మాట తప్పలేదు. తగురీతిన జీవించటానికే ప్రయత్నం చేశారు. అంతర్లీనముగా, బాబా అదృశ్య హస్తం ఆ యా సమయాలలో, ఆదుకునేది. అందుకు ఒక ఉదాహరణ – ఒకసారి పురందరే భార్యకి కలరావ్యాధి వచ్చి, అది తీవ్రమవ్వగా, వైద్యులు కూడ ఆశవదలివేశారు, గాని బాబాపై పూర్తి విశ్వాసముంచిన పురందరే బాబానే ధ్యానిస్తూ ధైర్యంగా ఉండిపోయాడు. ఆ సమయములో అతని ఇంటి ఎదురుగా ఉన్న దత్తమందిరము దగ్గర బాబా దర్శనమిచ్చి, పురందరేతో, అతని భార్యకు ఊదీ-తీర్థము ఇవ్వమని చెప్పేరు. అది అతని భ్రాంతి అని, వైద్యులు ఎంతచెప్పినా వినకుండా ఆమెకు ఊదీ తీర్థము ఇచ్చాడు పురందరే. ఆశలు వదులుకున్న, ఆమె త్వరితగతిన కోలుకొని, ఆరోగ్యవంతురాలైంది. ఆ సంఘటనతో నిరంతరం తన కుటుంబాన్ని కాపాడుతున్న బాబాపై మరింత విశ్వాసం పెంచుకున్నాడు పురందరే. తరచుగా శిరిడీ వెళ్ళి బాబా దర్శనం చేసుకోసాగేడు. శ్రీసాయి కూడ, దీక్షిత్ చేత పురందరేకు శిరిడీ రమ్మని జాబు వ్రాయించేవారు, బాబాకు తనపైగల ప్రేమకు పొంగిపోయేవాడు పురందరే.

పురందరే బొంబాయిలోని అద్దె ఇంట్లో, చాలీచాలని జీతంతో ఎన్నో ఇబ్బందులు పడుతూ ఉండేవాడు. ఒకసారి శిరిడీ వెళ్ళినప్పుడు బాబా అతనితో "బావూ, ఒక స్థలం కొని, ఇల్లు కట్టుకో" అన్నారు. "గుండెల్లో రాయి పడ్డట్టు అయింది పురందరేకు, ఇంటి పోషణకే వచ్చే ఆదాయం సరిపోక ఇబ్బందులు పడుతున్న నేను స్థలంకొని, ఇల్లు కట్టుకోవటం సాధ్యమయ్యేపనేనా" అని తీవ్రమైన ఆలోచనలో పడ్డాడు పురందరే. అయినా, బాబా మాటకు ఎదురుచెప్పే సాహసం చేయలేక, బాబా మాటకు సరేనన్నట్లు తలఊపేడు పురందరే. అప్పటి నుండి పురందరే ఎప్పుడు శిరిడీ వచ్చినా బాబా వేసే మొదటి ప్రశ్న "స్థలం కొన్నావా, ఇల్లు ఎప్పుడు కడుతున్నావు" అని. కొన్నిసార్లు మౌనమే సమాధాన మయ్యేది పురందరేకు. సర్వాంతర్యామి అయిన బాబాకు తన స్థితి తెలియదా! అని భావించేవాడు అయినా సమాధానమివ్వలేక, తననుతిడుతూ, ఒక్కొక్కసారి కోపంతో తనపై రాళ్ళు విసిరే బాబాకు నమస్కారం చేస్తూ ఉండిపోయేవాడే కాని, మనసులో బాధపడటం కాని, బాబాపై కినుక వహించటంకాని చేయలేదు పురందరే. ఎప్పుడైనా తాను బాధ పడితే, బాబా చెప్పిన మాటను నెరవేర్చలేకపోయే తన దౌర్భాగ్య స్థితికి చింతించేవాడే కాని, బాబా తనకు సంపద ప్రసాదించలేదని, ఎక్కడా పల్లెత్తుమాట కూడ మనసా వాచా అనలేదు పురందరే. అది, దక్షిణ సమర్పించటమంటే, గొంతెమ్మ కోరికలు కోరి, అవి

నెరవేరిస్తే అందులో వాటా ఇస్తాము, హుండీలో దక్షిణవేస్తామని, బాబాతో ఆర్థిక వ్యాపార బేరసారాలాడే వారికి, పురందరేకు ఎంతటి వ్యత్యాసం. "పురందరే నన్ను మనిషి అనుకొంటున్నాడా! పశువు అనుకొంటున్నాడా! నేను ఎన్నిసార్లు చెప్పినా, నే చెప్పిన పని చేయదేమిటి" అని ఒకసారి బడేబాబాతో కోపంగా అన్నారు బాబా. పురందరే ఆర్థిక పరిస్థితిని, అతని నిస్సహాయతను అర్థంచేసుకున్న బడేబాబా కూడ మౌనంగా ఊరకుండిపోయాడు, అప్పుడు నానాసాహెబ్ చందోర్కర్‌ను, కాకాసాహెబ్ దీక్షిత్‌లను పిలిచి వారితో కూడ అదే నిష్ఠూరమాడేరు బాబా. అంతా విని "బాబా అది అతని శక్తికి మించిన పని, అందుకే మీ మాటకు ఎదురుచెప్పలేక, చెప్పిన పనిచేయలేక తనలో తానే మథనపడుతున్నాడు, మీరు అనుమతి ఇస్తే మేమంతా కలసి అతనికి స్థలంకొని ఇల్లు కట్టి ఇస్తాము" అన్న నానాసాహెబ్‌తో "మీరెవరో ఆఖర్చు భరించటం నాకిష్టం లేదు, పురందరేకు మా ప్రభుత్వం వద్ద చాలా డబ్బుంది. వాడికి ఇల్లుకట్టుకునే శక్తిని నేనే ఇస్తాను" అన్నారు సాయి. "బాబా అంతర్యం తెలియని నానాసాహెబ్ మిన్నకుండిపోయాడు. ఈ సంఘటన ద్వారా పురందరే బాబాకు ఇచ్చిన మాటకు కట్టుబడి జీవించటం ద్వారా, భౌతిక ధనం కూడబెట్టలేకపోయాడేమో గాని, హృదయభాండాగారములో ఆధ్యాత్మిక ధనాన్ని పెంచుకోగలిగేడు. పురందరే శిరిడీ వచ్చిన ప్రతిసారి, స్థలము, ఇల్లు విషయమై బాబా వత్తిడితీవ్రం కాసాగింది. అయినా, పురందరే శిరిడీ వచ్చి బాబాను దర్శించటము మానలేదు. (ఆ సందర్భములో మనమైతే ఏమి చేస్తాం?) చివరకు స్థలం అయినా కొంటే బాబా శాంతిస్తారేమోనని తలచి బాంద్రాకు సమీపంలో ఊరిబయట, తన స్థితి తెలిసిన ఒక మిత్రుడు తనపైగల విశ్వాసంతో నోటిమాటగా ఇచ్చిన ఋణంతో, అతి తక్కువ వెలకు ఒక స్థలం కొనగలిగేడు పురందరే. అంతకు మించి ఏమి చేయలేకపోయాడు పురందరే. అయితే బాబా శాంతించలేదు. అప్పటినుంచి "ఇల్లు ఎప్పుడు కడతావు" అని నిలదీసేవారు, అతనిపట్ల బాబా ప్రవర్తన అర్థంకాక ఉండిపోయేవారు ఇతర భక్తులు. ఒక శ్రీరామనవమినాడు బాబా దర్శనార్థమై తండోప తండాలుగా వచ్చే భక్తులను ఒక వరుస క్రమంలో పంపే పనిని, తన శక్తివంచన లేకుండా చేస్తున్నాడు పురందరే. అయినా బాబా తీవ్రస్వరంతో "ఒరేయ్ నేనెక్కడ ఉన్నా కొంచెం కూడ ప్రశాంతముగా ఉండనియ్యవు కదా! ఆజనమంతా నామీదపడి శాంతి లేకుండా చేస్తుంటే ఊరికనే స్థంభంలా నిల్చేకపోతే, వారిని వారించవచ్చుకదా, నీకు మాటలతో సరిపోదు, రకరకాల శిక్షలు వేస్తేగాని, తెలిసిరాదు, నేను చెప్పినది చేయలేదో నిన్ను ఇక్కడే ఈమశీదులోనే నా పాదాలచెంతనే పాతేస్తాను జాగ్రత్త" అన్నారు బాబా తీవ్రమయిన స్వరంతో. అంతమందిలోనూ తనని అన్నిమాటలు అంటున్నా పురందరే పల్లెత్తు మాట అనలేదు. తనలో ఎక్కడ లోపం ఉందో అని తెలుసుకోవటానికి ప్రయత్నం చేశాడు. అంతేకాదు ఎక్కడ స్థలం ఉన్నా లేకున్నా, సాయి పాదాలచెంత శాశ్వత విశ్రాంతికి చోటు దొరికింది కదా" అని బాబా తిట్టును కూడా ఆశీర్వాదంగా భావించి మౌనంగా ఉండిపోయాడు పురందరే. ఇక ఏవిధంగా తిట్టినా, బెదిరించినా పురందరే ఆశీర్వాదముగా తీసుకుంటున్నాడని భావించిన బాబా, అతనికి ఒక వింతైన శిక్షను విధించారు. అతని తలలో, విపరీతమైన నరాలపోటు ప్రారంభమయింది. రాత్రింబవళ్ళు తెరిపి ఇవ్వకుండా బాధించే ఆ నరాలపోటును భరించలేకపోయేవాడు పురందరే, నిద్రాహారాలు కరువైనాయి, ఎంతమంది వైద్యులకు చూపినా, అతని వ్యాధి నయం చేయలేకపోయేవారు. అయినా శిరిడీకి రావటం మానలేదు పురందరే. అతని బాధను చూడలేకపోయిన బడేబాబా "పురందరే వ్యాధి తగ్గించమని" బాబాను కోరేడు. అందుకు "వాడు నామాటవింటేగా తగ్గించటానికి" అన్నారు బాబా. చేసేది ఏమి లేక ఊరకుండిపోయాడు బడేబాబా. తీవ్రమయిన బాధను భరించలేని పురందరే "ఇక నేనీ బాధను భరించలేకుండా ఉన్నాను, శ్రీరామనవమినాడు మశీదులో తన పాదాలచెంత పాతేస్తానన్నారు కదా బాబా, ఆపని చేసి నన్నీ బాధనుండి విముక్తుడిని చేయమని ద్వారకామాయి వాసుడైన ఆ శ్రీసాయిమాతకు చెప్పు" అని రాధాకృష్ణమాయికి జాబు వ్రాసేడు పురందరే. అటుపిమ్మట శిరిడీవచ్చి, సాయి సన్నిధిలో కూడ తలలోని నరాలబాధకు గిలగిలలాడిపోయేవాడు పురందరే. "తన యావత్‌శక్తినంతా ఉపయోగించి మీ సేవలో పాల్గొంటున్న పురందరే బాధను మీచేతి స్పర్శతో కొంతయినా ఉపశమనం కలిగించమని" మరొక్కసారి బడేబాబా శ్రీసాయిని వేడుకున్నాడు. "అతను ఇక్కడకు రానవసరంలేదు, ఇంటికి వెళ్ళి తన పనిని చూసుకోమని చెప్పు, ఇల్లు కట్టుకున్న తరువాతే అతనా బాధనుండి విముక్తుడయ్యేది" అన్నారు బాబా. ఆ మాటలు ఆలకించిన పురందరే బాబాకు నమస్కరించి వారి అనుమతితో తన ఊరికి బయలుదేరేడు.

"నాన్హేఘాట్ అనే లోయను దున్నపోతుమీద ఎక్కి దాటటం కంటే చాల కఠినమైనది ఆధ్యాత్మిక మార్గం, ఆధ్యాత్మిక విద్య పదునైన కత్తిమీద నడకలాంటిది, తన యావశ్శక్తినంతా ఉపయోగించి అత్యంత జాగురూకతతో అడుగేస్తేగాని గమ్యం చేరలేము" అన్న బాబా బోధకు ప్రత్యక్ష నిదర్శనం పురందరే జీవితం.

పారాయణ చేశాం బాబా కనిపించారు, నామజపం చేశాం వరాలిచ్చారు, ప్రదక్షిణలు చేశాము, ఫలితం దక్కింది, ప్రతిగా గుడి కట్టేం, బాబాకు బంగారు నగలు, పట్టువస్త్రాలు ఇచ్చాం, బాబా పేరిట అన్నదానం చేసేశాం అనేవారి ఆధ్యాత్మిక పయనానికి పురందరే జీవితానికి ఎంత వ్యత్యాసమో కదా. తలలో తీవ్రమయిన నరాలపోటుతో తిరిగి బొంబాయి వచ్చిన పురందరే ఏమి చేశాడు? పురందరే పట్ల సాయి శాంతించారా, అటుపిమ్మట ఏమి జరిగింది? శ్రీ సాయిబాబాకు నిజమైన దక్షిణ సమర్పించటమేమిటో ప్రస్ఫుటముగా తెలియజేసే పురందరే జీవితంలోని మరికొన్ని సంఘటనలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.


# సద్బ్రాహ్మణుడు - శ్రీ శిరిడీసాయి



"ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమైన మార్గంలో పయనింప చేస్తాడు" అన్నారు శ్రీ సాయి. తన కులమేమిటో, జాతి ఏమిటో తెలియజేయకుండా 16 సంవత్సరాల బాలుడిగా శిరిడీ అనే కుగ్రామములోని వేపచెట్టు కింద ప్రకటమైన సాయి, పాడుబడ్డ మశీదులో నివసించి, దానికి 'ద్వారకామాయి' అని పేరు పెట్టి, పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు లక్షలాదిమందిని తన వద్దకు చేర్చుకున్న సాయి రూపం చూస్తే ముస్లిం లాగా కనిపిస్తారు, అయన సన్నిధిలో జరిగే ఆరాధన అంతా హిందూ సంప్రదాయం, బోధలు క్రీస్తుపరంగా ఉంటాయి. అంతేకాక అన్ని సంప్రదాయాలు, తనలో మేళవించుకుని మూర్తీభవించిన రూపంగా కనిపించే సాయి, తాను సద్బ్రాహ్మణుడు అని అనటంలో ఆంతర్యం బ్రాహ్మణుడు అంటే బ్రహ్మ తత్త్వము ఎరిగిన వాడు అని అర్థం. సద్బ్రాహ్మణుడు, నిత్యం త్రికాలాలలో సంధ్యావందనంచేసి, అగ్నిహోత్రం నిర్వహించి, భగవంతుని సేవలోనిమగ్నమవ్వాలి, నేటి యాంత్రిక, ఆధునిక యుగంలో వేషభాషలు, ఆచార వ్యవహారాలు అడుగంటుతూ, మనిషి తన ఉనికినే మరుస్తున్న తరుణంలోశాస్త్రాల పరమార్థాన్ని తెలియజేస్తూ, తన దరి చేరిన ప్రతి జీవిని భగవంతునికి అప్పగిస్తానని పరబ్రహ్మ స్వరూపుడైన సాయి, తాను చేసిన వాగ్దానాన్ని నెరవేర్చే దిశగా సర్వులకు బ్రహ్మతత్వాన్ని బోధపడే విధంగా, సాయి తన భక్తులను నడిపించిన విధానము పరిశీలించి చూస్తే పరబ్రహ్మ స్వరూపుడయిన సాయి తాను సద్బ్రాహ్మణుడని చెప్పటమేకాక తనను ఆశ్రయించినవారిని కూడ బ్రహ్మతత్వం ఎరిగిన వారిగా ఎలా మారుస్తున్నది తేటతెల్లమవుతుంది. త్రికాల సంధ్యలలో సాయికి మనంచేసే వందనాలే హారతులు. ప్రాతః సంధ్యా సమయంలో కాకడ హారతి, మధ్యాహ్న సంధ్యాసమయంలో మధ్యాహ్న హారతి, సాయంసంధ్యా సమయంలో ధూప్‌హారతి, ఈ త్రికాలాలలో సద్గురుకృపచే మన దైనందిన కార్యక్రమాలు సక్రమముగా, సజావుగా నిర్వహించుకొని, క్షేమముగా ఉండే అవకాశం కలిగించిన సద్గురుమూర్తికి కృతజ్ఞతా పూర్వక వందనము శేజహారతి. హారతులు సాయిని కీర్తించే పాటలు కాదు, వాటిని గానంచేయటము ద్వారా మనలో ప్రజ్ఞ మేల్కొలిపే జ్ఞాన దీపికలు. నిత్యము నిరంతరము ప్రజ్వలించే అగ్నిహోత్రమే ధుని. మన పాపాలను దహింప చేసి, జ్ఞాన స్వరూపులుగా మార్చటానికి, జ్ఞానాగ్ని స్వరూపుడయిన శ్రీసాయి ప్రజ్వలింపచేసిన అగ్నిహోత్రమే ధుని. మనలోని అరిషడ్వర్గాలు అనే సమిధలను సమర్పించడము ద్వారా, కర్మ భస్మీపటలము చేసి, సర్వులను పవిత్రంచేసే మహాయజ్ఞ స్వరూపం ధుని. ఇక మూడవది సద్గురు సేవ, "సాయి అంటే ఐదున్నర అడుగుల మనిషి శిరిడీలోనే ఉన్నారు అని అనుకునే వాడు నన్నసలు చూడనట్లే, మీరు చూసేదంతా కలసినేను" అన్నారు సాయి. మన కళ్ళ ఎదుట కనిపించే సకల చరాచర దృశ్యమానము అంతా సాయిస్వరూపమే, అది ఎరుకగా గలిగి నిరంతరము జీవించటమే మానవజన్మ పరమావధి. అయితే అది మరచి స్వార్థంతో జీవిస్తూ, సర్వమూ ప్రసాదిస్తున్న ప్రకృతి పట్ల కూడా కృతఘ్నులై జీవిస్తున్న వారిని కూడా ఉద్ధరించడం సాయి అవతార లక్ష్యంలో భాగము. తనకు సహకరించిన వారి పట్ల కృతజ్ఞత కలిగి ఉండటము కనీస మానవ లక్షణం, లేకుంటే రాక్షసులవుతాము. తనకు వరము ఇచ్చిన శివుడి నెత్తిన చెయ్యి పెట్ట చూసిన భస్మాసురుడు తానే నశించాడు. మన జీవనానికి ఆధారభూతమైన ప్రకృతి పట్ల కృతజ్ఞత కలిగి ఉంటున్నామా లేక కృతఘ్నతతో మన వినాశనానికి మనమే కారణమవుతున్నామా? వరాలు అందుకున్న చేయి భస్మాసుర హస్తం కాకూడదని సాయం అందించే చేయి కావాలని, జీవనాధారమైన ప్రకృతికి, అంతటా వ్యాపించి చైతన్య స్వరూపుడయిన గురువు పట్ల కృతజ్ఞత కలిగి ఉండటానికి ఒక చక్కటి మార్గము చూపేరు సాయి. "అతిథి అంటే ఐదున్నర అడుగుల మనిషి, బ్రాహ్మణుడేనని నీ భావన, ఆకలి గొన్నవన్నీ ఆహారం కోసం అన్వేషిస్తాయి. కాకబలికి సమృద్ధిగా అన్నం బయట విడచి పెట్టిరా, దేనినీ పిలువ వద్దు, తరమవద్దు. అట్లా చేస్తే లక్షలాది మందిని సత్కరించినట్లే" అని బోధించారు బాబా. సృష్టిలో భగవంతుడు ప్రసాదించంది ఏదీ లేదు. సర్వమూ ఆయన సృష్టించి, స్పృశించినవే. వాటిలో భాగమైన పూలు, పండ్లు, కాయలు మొదలైనవి తిరిగి ఏకొద్ది పాటో ఆయనకు సమర్పించి, నేను నీకు ఇవి సమర్పించాను కనుక నాకు వరాలు ప్రసాదించమనటం న్యాయమేనా? అయితే ప్రకృతి ప్రసాదించిన వాటిని ఉపయోగించుకుంటున్న మనము ప్రతిగా ఏమి చేస్తున్నాము? ప్రతి రోజు ఉదయం నిద్ర లేచిన దగ్గర నుండి రాత్రి పడుకోబోయేవరకు అనేక విధాలుగా అనేక రూపాలలో ప్రకృతి సంపదను వినియోగించు కుంటున్న మనము వాటి పట్ల కృతజ్ఞత కలిగి ఉంటున్నామా లేక వినాశకారులుగామారుతున్నామా, అట్లా మారకూడదనే ఏదైనా తినే ముందు మన హృదయమంత పిడికిలితో, ఒక ముద్ద తీసుకుని "నేను ఈ రోజు ఈ ఆహారం తీసుకో గలుగుతున్నానంటే అనేక రూపాలలో అనేక విధాలుగా ప్రకృతి రూపంలో ఉన్న సాయి! నీవు ప్రసాదించటము వల్లనే నేనీ ఆహారము తీసుకోగలుగుతున్నాను, అందుకు కృతజ్ఞతాపూర్వకంగా పిడికిలంత నా హృదయాన్ని ఈ ముద్దరూపంలో నీకు అర్పిస్తున్నాను. అది నీవు స్వీకరించి, మిగిలినది నీ ప్రసాదముగా తీసుకునే నన్ను కృతార్థుడిని చెయ్యి" అని భావిస్తూ అన్నం తినే ముందు ఒక ముద్ద పక్కన ఉంచి, దానిని ఆరు బయట వదిలి పెట్టి రావటం ద్వారా అన్ని జీవులలో నిండి ఉన్న సాయి, ఏదోఒక రూపంలో దానిని స్వీకరిస్తారు, తద్వారా సర్వమూ ప్రసాదించిన ప్రకృతి పట్ల కృతజ్ఞత కలిగి ఉండటమేకాకుండా లక్షలాదిమందిని సత్కరించినట్లు అవుతుంది.

నిరంతరం అనేక రూపాలలో అనేక విధాలుగా మనము అర్పించిన దానిని, తిరిగి పదింతలుగా మనకు ప్రసాదించి మన జీవితాన్ని సార్థకమొనరించి, మానవత్వం మూర్తీభవించిన మనిషిగా రూపొందించి, బ్రహ్మజ్ఞానము కలిగించి, సన్మార్గములో నడిపిస్తారు సాయి. కుల, మత, జాతి, స్త్రీ, పురుష, వయోభేదము లేకుండా సర్వులూ ఆచరించి తరించే విధముగా బ్రహ్మతత్వమెరిగి, మనిషిగా జీవించేరీతిగా సాయి ప్రవేశపెట్టిన హారతులు, వేల్చిన ధుని, మనము అర్పించే ఆహారముల మర్మమెరిగి ప్రవర్తించే వారందరు బ్రహ్మతత్వ మెరిగిన వారే, బ్రాహ్మణులే, "ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాదిమందిని శుభ్రమార్గంలో నడిపిస్తాడు, మీరు తండ్రికి తగ్గ బిడ్డలు కండి మీ భాండాగారాలను నింపుకోండి" అని అన్నారు శ్రీ శిరిడీసాయిబాబా. సాయి బోధనలను అర్థం చేసుకుని ఆచరణ చేసేవారందరు, పరబ్రహ్మ స్వరూపమయిన సాయి అనుంగు బిడ్డలే. (అక్టోబరు 15వ తేదీ శుక్రవారము విజయదశమి సందర్భముగా సమర్పణ)

మీ... వి.వి. పూర్ణచంద్రరావు



# శ్రీ గురు చరిత్రామృతము

వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు

"గురుమధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః
గురుర్విశ్వం న చోన్యాస్మి తస్మై శ్రీ గురవే నమః

"ఎవరి యందైతే ఈ విశ్వమంతా నిండి ఉన్నదో, ఎవరైతే ఈ విశ్వమంతా నిండి ఉన్నారో, అటువంటి గురుమూర్తికి నమస్కారం" అని గురుగీతా వాక్యం. అజ్ఞానమనే చీకటినుండి జ్ఞానమనే వెలుగువైపుకు నడిపించేవాడు గురువు. "గుణానికి" "రూపానికి" అతీతమయి ఉన్నవాడు "గురువు" సామాన్యులను ముందుగా సత్వగుణ సంపన్నులుగా మార్చి, చివరకు తన స్థితిని – ఆత్మ స్థితిలో నిలిపేవాడు గురువు. జన్మతః మానవులందరూ జ్ఞానస్వరూపులే, ఆత్మ స్వరూపులే, అయితే మకిలి పట్టిన అద్దంలో ప్రతిబింబం ఎట్లయితే కనిపించదో, అదేవిధముగా, గత జన్మ సంస్కారము, మరియు ఈ జన్మ సంస్కారముల వలన రాగ, ద్వేష, అసూయ, మమకారాల జాలంలో చిక్కి కామ, క్రోధ, లోభ, మధ, మత్సరాలకు లోనయ్యి, నేను, నాది అనే భావనతో శరీరమే తానని భావిస్తూ, దాని పరిరక్షణ కొరకై పడరాని పాట్లు పడుతూ, మరింతగా అజ్ఞాన కూపంలోకి జారిపోవటం జరుగుతుంది. అటువంటి వారిని, తిరిగి జ్ఞాన స్వరూపులుగా మార్చటానికే త్రిమూర్తులు, త్రిగుణరహితుడైన అత్రిమహర్షి, అసూయలేనటువంటి అనసూయ దంపతులకు పుత్రులుగా జన్మించి, శ్రీ దత్తాత్రేయుడై, జగద్గురువై బాసించాడు. ఆయనయే మరల కలియుగంలో సకల జనావళిని ఉద్ధరించాలనే భావనతో 13వ శతాబ్దంలో ఆంధ్రదేశములోని, తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో అప్పలరాజు శర్మ, సుమతి దంపతులకు, శ్రీపాద శ్రీవల్లభుడుగాను, 15వ శతాబ్దములో మహారాష్ట్ర దేశంలోని కరంజాలో మాధవశర్మ, అంబ దంపతులకు శ్రీ నృసింహ సరస్వతి స్వామిగా జన్మించటం జరిగింది. వీరిరువురి చరిత్ర "శ్రీగురుచరిత్ర"గా ప్రసిద్ధికెక్కింది. ఆ గ్రంథపారాయణ వలన గురువులేని వారు గురువుచెంతకు చేరటమే కాకుండా, గురుసన్నిధిలో ఉన్నవారు గురువును మరింతగా గుర్తెరిగి సేవించుకొనే విధము తెలియపరచటమే కాకుండా, జన్మ సాఫల్యం చెందించటముతోపాటు, లౌకిక, పారలౌకికమైన కోరికలు తీరుస్తూ, జీవిత పరమార్థాన్ని ఒనగూర్చే అద్భుత గ్రంథరాజం "శ్రీగురుచరిత్ర". సత్వగుణ సంపన్నులైనవారు చేసే యజ్ఞ దాన తపః కర్మలు సఫలీకృతమవుతాయని గీతావాక్యం. రజో, తమో గుణాలతో కూడిన జ్ఞానము తనకు, తనసాటివారికి మేలు కంటే హాని చేసే అవకాశము ఎక్కువ, తమోగుణ సంపన్నులైన రాక్షసులు ఎంతో తపస్సుచేసి పొందిన వరాల వలన లోకకంటకులై, చివరికి వారి వినాశనానికి వారే కారకులయినారు.

జన్మతః జ్ఞాన స్వరూపులై, అజ్ఞాన వలయంలో చిక్కిన వారిని జ్ఞానమార్గంవైపు నడిపించే దిశగా అలనాటి గురువులు తమ ఆశ్రమములలో చేరిన వారిలోని రాజస, తామస గుణాలు తొలగించే విధముగా అనేక విధాలుగా పరీక్షించి, సత్వగుణ సంపన్నులుగా మార్చి, వారి వారి సంస్కారాలను అనుసరించి తగురీతిన అనుగ్రహించేవారు.

మకిలి పట్టిన అద్దంపైన మురికి తొలగించగానే ప్రతిబింబము స్పష్టముగా కనిపించినట్లు, జన్మతః జ్ఞానస్వరూపుడైన శిష్యుడిలో అనేక రూపాలలో, అనేక విధాలుగా దాగి ఉన్న అజ్ఞానాన్ని గురువు తొలగించగానే తన స్వస్థితిని పొందుతాడు శిష్యుడు. దానికి గురువు కృపతోడైతే మరింతగా బాసిస్తాడు. ఈ విషయం శ్రీ గంగాధర సరస్వతి విరచిత శ్రీ సిద్ధనామధారక సంవాదాత్మకమై, పరమ కథా కల్పతరువగు 'శ్రీగురుచరిత్ర' అంతర్గతమైన జ్ఞానకాండలోని శ్రీ నృసింహసరస్వతీస్వామి బ్రాహ్మణ మునికి తెలిపిన "గురుశుశ్రూషణ మహత్య వర్ణణ" అనే షోడశ (16వ) అధ్యాయము చాలా ప్రస్ఫుటముగా తెలియజేస్తుంది.

వేదాధ్యాయనము కొరకు గురువును ఆశ్రయించిన ఒక బ్రాహ్మణుడు, తనకు గురువు జ్ఞానబోధ చేయకుండా, తనకు ఇష్టములేని పనులు చెప్పటముతో ఆయనను దూషించి, వదిలివేసి, వైద్యనాధములో ఏకాంతముగా ఉన్న శ్రీనృసింహసరస్వతీ స్వామి (శ్రీగురుడు) పాదాలపై వాలి తనకు జ్ఞానబోధచేయమని అడుగగా, అతని గత వృత్తాంతము తెలిసిన శ్రీగురుడు "శిష్యుడిలోని దోషాలను తొలగించి, క్షణకాలములో తన హస్త మస్తక సంయోగ దృక్కులతో తనంతటి వాడిగా తీర్చిదిద్దే గురువును సేవించి తరించాల్సింది పోయి, వారిని దూషించి వచ్చిన వారికి ఇహపరాలు రెండు ఉండవు. నీవంటి వారి ముఖము చూడటం కూడ మహాపాతకమని" తీవ్రముగా పలుకగా, శ్రీగురుడి పాదాలపై పడి భోరున విలపిస్తున్న ఆ బ్రాహ్మణమునికి, జ్ఞానోదయానికై, శ్రీగురుడు మహాభారత మందలి ఆదిపర్వములోని ధౌమ్యమహర్షి శిష్యుల వృత్తాంతము

విశదపరచారు..

ధౌమ్యమహర్షి ఆశ్రమంలో అరుణి, బైదుడు, ఉపమన్యువు అనే ముగ్గురు శిష్యులు ఉండేవారు. ఒకసారి ధౌమ్యమహర్షి అరుణిని చేరబిలచి, ఆశ్రమానికి దూరముగా ఉన్న తమ పొలంలో నీరుపెట్టి, పైరును తడిపి రమ్మని చెప్పగా, బావినుండి ఎంతనీరు తోడిపోసినా పొలం నిండక ఒకచోట గండిపడి నీరు వృథా అవ్వటం చూసి, గురువు చెప్పిన పని చేసి తీరాలని ఆ గండికి అడ్డుగా అరుణి పడుకొని ఉండిపోగా, ధౌమ్యమహర్షి వచ్చి శిష్యుడి సాహసమును, భక్తి శ్రద్ధలను మెచ్చుకొని, ఆలింగనము చేసుకొని, తక్షణమే వేదశాస్త్రాది విద్యాపారంగతుడువు అగుదువని ఆశీర్వదించి పంపేరు..

కొంతకాలం తరువాత రెండవ శిష్యుడయిన బైదుడిని పిలచి, పక్వానికి వచ్చిన పైరును జాగ్రత్తగా పరిరక్షించి ధాన్యము ఇంటికి జేర్చమని, రెండు కాడెద్దుల బండిని, ఒక ఎద్దును ఇచ్చి పంపగా, తగురీతిన చేసి, ధాన్యపు బస్తాలతో నిండిన బండి కాడికి ఒకవైపు ఎద్దును కట్టి, కాడి మరొకవైపు తన మెడపై వేసుకొని ధాన్యము తీసుకువస్తుండగా దారిలో బురదలో బండి కూరుకుపోగా, లాగలేక స్పృహ తప్పిపోగా, గురువు ఆజ్ఞపై అతనికి గల భక్తిశ్రద్ధలకు సంతసించి, అతని ధైన్యస్థితికి హృదయము ద్రవించిన ధౌమ్యులవారు, అతనిని లేవదీసి వేదశాస్త్రములతో పాటుగా సమస్త విద్యా పారంగతుడవు అయ్యెదవని ఆశీర్వదించి పంపెను.

మూడవ శిష్యుడైన ఉపమన్యువును చేరబిలచి ఆశ్రమములోని గోవులను సమీప అడవిలోనికి తీసుకొనిపోయి సాయంత్రం వరకు మేపి, తిరిగి రావలసింది అని ఆజ్ఞాపించెను. భోజన ప్రియుడగు ఉపమన్యువు ఆకలి బాధకు తాలలేక మధ్యాహ్నమే గోవులను ఆశ్రమానికి తీసుకొని రాగా, గురుకోపానికి గురియై, మరునాడు మధ్యాహ్న సమయములో సమీప గ్రామానికి వెళ్ళి భిక్షతెచ్చుకొని తినసాగేడు. గురువుకు అర్పించకుండా తినటం దోషమని ధౌమ్యులవారు చెప్పగా అది గురువుకు సమర్పించి తిరిగి వెళ్ళి మరొక గ్రామములో రెండవసారి భిక్ష తీసుకొని భుజించుచుండగా, దానిని కూడ ఆశ్రమములో ఇవ్వమని గురువుతెల్పగా, అట్లే చేసి, దూడలు త్రాగగా మిగిలిన పాలు త్రాగుతుండగా, పశువుల ఉచ్చిష్టము త్రాగినచో మతిహీనుడవయ్యెదవని ధౌమ్యులవారు అగ్రహించగా, ఇక ఆకలి బాధకు తట్టుకోలేక జిల్లేడు పాలు ఎంగిలి కావని తలచి, వాటిని ఒక దొన్నెలో పట్టుకొని త్రాగబోగా అవి కళ్ళలో పడి చూపుపోగా, గోవుల వెంట ఆశ్రమానికి తిరిగివస్తూ దారితప్పి ఒక దిగుడు బావిలో పడిపోయాడు. గోవులతోపాటు ఉపమన్యువు తిరిగి రాకపోవటంతో శిష్యుడిని వెతుక్కుంటూ అడవికి వచ్చిన ధౌమ్యులవారు పాడుబడిన బావిలో శిష్యుని మూలుగు విని, అతనిని బయటకు తీసి, అశ్వని దేవతలను ప్రార్థించమని చెప్పగా, తగురీతిన స్తుతించిన ఉపమన్యువుకు అశ్వనీ దేవతలు దృష్టిని ప్రసాదించారు. తన పాదాలపై పడి ఎన్నో విధాలుగా స్తుతించిన ఉపమన్యువును ధౌమ్యమహర్షి లేవదీసి "శిషోత్తమా! నీయందు నేనెంతో సంతుష్టుడిని అయితిని" అని తన హస్త మస్తక స్పర్శతో తృటిలో శిష్యుడిని సకల వేదశాస్త్ర పారంగతుడిని చేయటమే కాకుండా, స్వగృహమునకేగి, తల్లితండ్రులను ఆనందింపచేసి, తగిన కన్యను వివాహము చేసుకొని, దీర్ఘాయుష్మంతుడవై సుఖముగా జీవించు అని ఆశీర్వదించటముతోపాటు నీవు సాటిలేని కీర్తిని పొందెదవు. నీకు ఎంతో మంది శిష్యులై సేవించెదరు. అందులో ఉదంకుడనే శిష్యుడు ఆదిశేషుడిని జయించి నీకు నాగకుండలాలు తెచ్చి ఇస్తాడు" అని ఆశీర్వదించారు.

గురువాజ్ఞను శిరసావహించి, ఎటువంటి కష్టములకైనా తలవొగ్గిన అరుణి, బైదులకు తక్షణమే సకల విద్యాపారంగతులను చేసిన ధౌమ్యమహర్షి, ఉపమన్యువును మాత్రం అనేక రీతుల ఆశీర్వదించటానికి కారణం..

భోజన ప్రియుడైన ఉపమన్యువు ఒకటి కాదు రెండు సార్లు, మూడు సార్లు గురువు పరీక్ష పెట్టినా ఏమాత్రం గురువును దూషించకపోగా, గురువాజ్ఞ పాలన చేశాడు. అంతేకాదు, చివరకు ఆకలిబాధకు తాళలేక జిల్లేడు పాలు త్రాగపోగా దృష్టిని కోల్పోయినా, గురువు అనుమతి లేకుండా తాను చేసిన పనికి ఫలితమే అది అని భావించి, పశ్చాత్తాప పడ్డాడు. తాను దారి తప్పి, బావిలో పడిపోయినా, చీకటిలో ఏ ఒక్క గోవు అయినా అడవిలో దారితప్పి ఆశ్రమం చేరలేక ఆపదలపాలవుతుందేమోనని, గురువు చెప్పిన పని తాను సక్రమంగా నెరవేర్చలేకపోతున్నానని పరితాపం చెందేదేగాని, ఏ ఒక్క సందర్భములోనూ గురువును కలలో కూడ దూషించలేదు. పరీక్ష ఎంత కఠినమయితే ఫలితం అంత ఉత్తమముగా, అధికంగా ఉంటుంది, ఉపమన్యువు వృత్తాంతం ద్వారా ధౌమ్యమహర్షి ఆ విషయాన్ని విశదపరచారు.

"ధౌమ్యమహర్షులను వారి శిష్యులు సేవించిన విధములో ఏకొద్దిపాటి కూడ చేయక, అడిగిన వెంటనే నిన్ను శాస్త్రపారంగతుడిని చేయలేదని గురువుని దూషించి వచ్చేశావే. నీ చర్యకు నిష్కృతి ఉంటుందా, లిప్తకాలములో తనంతటి వాడిగా తీర్చిదిద్దే గురువు చెంత కొంతకాలము కూడ నిలవలేని నిన్ను అనుగ్రహించేదెవరు. గురుద్రోహి అయినవారు కుంభీపాకమనే నరకములో మగ్గిపోవుదురు. కనుక తక్షణమే వెళ్ళి ఆ గురువు పాదాలపైపడి క్షమించమని వేడుకో" అని తీవ్ర స్వరముతో పలికిన శ్రీగురుని హితోపదేశము పొందిన ఆ బ్రాహ్మణుడు తక్షణమే శ్రీగురుడి పాదాలపై వ్రాలి భోరున విలపిస్తూ "ఓ గురుమూర్తి మీకు సహస్రకోటి వందనాలు, అహంకారముతో అజ్ఞానాంధకారములో కొట్టుమిట్టాడే నావంటి అల్పుడికి, అపారమైన కరుణాకటాక్షముతో మీరు కలుగజేసిన జ్ఞానముతో పరమార్ధ తత్వం తెలియటమే కాకుండా, నేనెంత మూర్ఖుడనో, గురుద్రోహినో బోధ పడింది. ఇనుపముక్కను విరిగినచో అతికించవచ్చు, మనసు విరిగితే అతికించుట అసాధ్యము. మహా పాతకమైన నా చర్యతో నామనస్సు విరిగిపోయింది. నాజీవితము నేనే వ్యర్థము చేసుకొన్నాను. ఇక ఏముఖముతో నా గురువు చెంతకు వెళ్ళగలను. నేను చేసిన గురుద్రోహానికి ప్రాయోపవేశమే నాకు ప్రాయశ్చిత్తము" అంటూ పాదాలపై వ్రాలి భోరున విలపిస్తున్న బ్రాహ్మణమునిని లేవనెత్తి

"అగ్గి శిఖను తాకిన తక్షణమే ఎండుగడ్డి భస్మీపటలము అయినట్లు పశ్చాత్తాపాగ్నితో రగిలే నీ అంతఃకరణము పరిశుద్ధమైంది. అగ్నితో చేరి మండిన కర్పూరం సువాసనలు వెదజల్లినట్లే, నీ హృదయము పశ్చాత్తాపంతో పరిశుద్ధమైనది ఇక ప్రాయోపవేశము వలదు, మనసారా శ్రీగురుచరణాలు స్మరించు", అంటూ అతని మస్తకముపై తన దివ్య హస్తమునుంచి శ్రీగురుడు ఆశీర్వదించెను. తక్షణమే పుటము పెట్టిన పసిడి వలె అంతఃకరణ శుద్ధి అయిన ఆ బ్రాహ్మణుడు సకల శాస్త్ర పారంగతుడు అయినాడు.

తక్షణమే చేతులు జోడించి, శ్రీగురుడిని అనేక రీతుల స్తుతించాడు అతను. "ఓ సద్గురుసార్వభౌమ! మీరు త్రిమూర్తి స్వరూపులు, మీ కృప పొందిన వారికి శారీరక, మానసిక పాపాలను తక్షణమే భస్మీపటలమైపోతాయి, సూర్యరశ్మి సోకిన చోట అంధకారమునకు తావులేనట్లే, మీ కృపాదృష్టి సోకిన తక్షణమే అజ్ఞానము నశించి జ్ఞానము ఉదయిస్తుంది, పరశువేది తాకిన ఇనుము బంగారము అయినట్లు మీ పాదాలను స్పృశించిగానే అంతఃకరణ పరిశుద్ధమైపోతుంది" అంటూ స్తుతిస్తూ కంఠం గద్గదముకాగా, శరీరము రోమాంచితమై గగుర్పాటు చెందుతుండగా, తన కన్నుల వెంట జాలువారుతున్న భాష్పాలతో శ్రీగురుడి పాదాలను అభిషేకిస్తూ ఉండిపోయాడు ఆ బ్రాహ్మణుడు.

చిరుమందహాసంతో అతనిని లేవనెత్తిన శ్రీగురుడు "ఈ హృదయముతో ఇప్పుడు నీ గురుమూర్తి దగ్గరకు వెళ్ళి, వారి పాదాలపై వ్రాలి, నమస్కరించి, వారే నేనుగా భావించి, సేవించి, తరించు" అని ఆశీర్వదించారు. శ్రీగురుడి ఆజ్ఞను శిరసావహించి, ద్విగుణీకృతమైన భక్తి శ్రద్ధలతో తన గురువు చెంతకు బయలుదేరేడు ఆ బ్రాహ్మణుడు.

గుణాతీతుడు, రూపాతీతుడు అయ్యి సృష్టిచైతన్యమే తానని రుజువుచేసిన శ్రీగురుడి లీలావిలాసాలు అనేకం కలవు. అవి వినేవారి అంతఃకరణను, చెప్పేవారి మనస్సును, పవిత్రం చేస్తాయి. అటుపిమ్మట శ్రీగురుడు వైద్యనాథం వీడి, భువనేశ్వరీ క్షేత్రమైన భిల్లవటి చేరేరు శ్రీ గురుడు. అక్కడి శ్రీవారి లీలావిలాసాలను వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

## పండుగలు - పర్వదినాలు

### అక్టోబరు - 2021

1. దివ్యజనని శ్రీమతి ఎక్కిరాల అలివేలుమంగతాయారు గారి జయంతి (పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ధర్మపత్ని)
2. గాంధీ జయంతి
   శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి
6. మహాలయ అమావాస్య
7. శరన్నవరాత్రులు ప్రారంభం
12. సరస్వతి పూజ
13. దుర్గాష్టమి
14. మహర్నవమి
15. విజయదశమి – శ్రీ శిరిడీసాయిబాబా 103వ మహాసమాధి మహోత్సవము (తేదీ మరియు తిథి ప్రకారం)
20. వాల్మీకి జయంతి
23. అట్లతద్ది
30. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి (తేది ప్రకారం)

### నవంబరు

1. మహద్గురు శ్రీ పూర్ణానందస్వామి జయంతి (తేదిప్రకారం)
2. శ్రీపాద శ్రీవల్లభులు అంతర్ధానమైనరోజు (అశ్వయుజ బహుళ ద్వాదశి)
2. ధనత్రయోదశి
3. నరక చతుర్దశి
4. దీపావళి
6. అవధూత శ్రీ నాంపల్లిబాబా ఆరాధనోత్సవము (తేదిప్రకారం)
7. శ్రీసాయిదీక్షలు (మండలం) ప్రారంభం, పవర్‌సిటీ, వైజాగ్
8. నాగులచవితి
11. పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాలభరద్వాజగారి జయంతి (తిథిప్రకారం)
14. బాలల దినోత్సవం
17. శ్రీకాళహస్తి వేణుగోపాలస్వామి ఆరాధన (తేదిప్రకారం)
18. జ్వాలాతోరణం – కార్తీకపూర్ణిమ
19. శ్రీ గురునానక్ జయంతి
21. సింధూనది పుష్కరాలు ప్రారంభం
    శ్రీ రంగావధూత జయంతి
28. శ్రీ సాయిదీక్షలు (అర్ధమండలం) ప్రారంభం
29. శ్రీ ధునీవాలాదాదా ఆరాధనోత్సవం (తేదిప్రకారం)
    శ్రీ సుధీంద్రబాబు ఆరాధనోత్సవం (తేదిప్రకారం)

### డిసెంబరు

2, సింధూనది పుష్కరాలు ముగింపు
9. సుబ్రహ్మణ్య షష్ఠి
11. కాలభైరవాష్టమి
14. గీతాజయంతి
16. ధనుర్మాసం ప్రారంభం
16, 17, 18 శ్రీ దత్తజయంతి మహోత్సవములు–పవర్‌సిటీ, వైజాగ్
18. శ్రీదత్తజయంతి, శ్రీసాయిదీక్షలు విరమణ
27. అనఘాష్టమి వ్రతం
30. భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి
31. ఆంగ్ల సంవత్సరం 2021 కి వీడ్కోలు మరియు నూతన ఆంగ్ల సంవత్సరం 2022 కు ఆహ్వాన ప్రత్యేక సత్సంగమము – పవర్‌సిటీ, వైజాగ్

### జనవరి - 2022

1. ఆంగ్ల నూతన సంవత్సర ప్రత్యేక సత్సంగం
10. అవధూత శ్రీ అనసూయామాత ఆరాధనోత్సవము
13. వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి
14. భోగిపండుగ
15. మకర సంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం
16. కనుమ, అవధూత శ్రీ రామిరెడ్డితాత ఆరాధనోత్సవము
26. రిపబ్లిక్ డే
27. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా జయంతి
30. మహాత్మాగాంధీ వర్ధంతి

# తమసోమా జ్యోతిర్గమయ

"ఉన్నదానితో అసంతృప్తి లేని దేనికోసమో తపన" ఇదే మానవ జీవిత సారమంతా అనేది పరమ గురుదేవులు భరద్వాజ మహరాజ్ గారి వాణి. అంటే మనకెన్ని ఉన్నా, ఎంతవున్నా యింకా కావాలనే, ఇంకా చాలలేదనే తప్ప వున్నదానితో అంటే భగవంతుడిచ్చిన దానితో తృప్తి పడతామనేదే మనందరి జీవితాలలో లేనేలేదు. అంటే దీనర్థం నిష్క్రియత్వం కాదు. భగవద్గీతలో కర్మయోగంలో జగద్గురువు శ్రీకృష్ణుడు చెప్పినట్లు మన ప్రయత్నాలను మనం చేసి తీరాలి, ఫలితాన్ని భగవంతునికి వదలాలి. ఎందుకంటే మనం యిప్పుడు ప్రయత్నం చేయకపోతే తర్వాత జీవితంలో విచారించవలసి వస్తుంది. అదే మనం ఆ ప్రయత్నాన్ని చేసివుంటే ఆ పని ఆయివుండేదేమో అనే చింత మనలను తర్వాత జీవితంలో బాధపడకుండా వుండేందుకే మన పెద్దలు అలా నిర్దేశించారు. ఫలితం మన ప్రాప్తా ప్రాప్తాలను బట్టి వుంటుంది. ఇది మనందరి దైనందిన జీవితాలలో అనుభవ పూర్వకంగా చూస్తున్నాము. ఎంతటి ధనవంతుడు కూడా ఒక్కొక్కప్పుడు చిన్న పని కూడా చేసుకోలేకపోవడం మనం చూస్తూనే వున్నాము. అదే గుర్తు మనకు మనం ఎంత ప్రయత్నించినా మనకు ప్రాప్తం లేకపోతే జరుగదు. అంతమాత్రం చేత మనం నిరాశ చెందవలసిన పని లేదు. "భగవంతుడు మనలనెలా సృష్టిస్తే అలానే వుండాలి" అనే సాయినాధుని సూక్తిని అర్థవంతంగా, సమన్వయ పూరితంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలే కానీ అసంతృప్తి పడకూడదు.




సాయినాధుడు చెప్పిన నిష్ఠ, సబూరిలతో స్వీకరించడమే మనం చేయవలసినది. మనం అలా నడచుకున్నప్పుడు శాశ్వతమైన తృప్తి, శాంతి, ఆనందాలను మనకు ప్రసాదిస్తాడు శ్రీసాయి.

ఇక శాశ్వతమైన తృప్తి, శాంతి, ఆనందాలంటే ఏమిటో కాస్త యోచిద్దాం. దీనినే మన ఋషులు సచ్చిదానందమని అన్నారు. ఈ తృప్తి, శాంతి, ఆనందాలు మన కేమైనా బజారులో దొరికే వస్తువా? అదే వాస్తవమైతే, ఇది వరకే మనం దానిని ధనంతో ఎప్పుడో కొనేసి వుండే వాళ్ళం. అది అలా దొరికేది కాదు. మరి దొరికే మార్గమేమిటి? ఎలా? ఈ ప్రశ్న ప్రపంచంలోని సర్వజనావళిని పట్టి క్రుంగదీస్తున్న ప్రశ్న. దానిని పొందేందుకు జన బాహుళ్యం ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కాని అది అందరికి లభ్యం కాలేదన్నదానికి మన దుఃఖభూయిష్టమైన జీవితమే ఉదాహరణ. మరి అటువంటి జీవితమొకటున్నదా? లేదా? ఉంటే అది లభ్యమవుతుందా? మరి ఇదే వాస్తవమయితే మహాత్ములు దానినెలా సాధించి నిరంతరం ఆనందంలో నిమగ్నమైయున్నారు? కాబట్టి అది బయట దొరికే వస్తువు కాదని తేలిపోయింది. అది మనలోనే వున్నదని తెలుస్తున్నది. మరి అది మనలోవుంటే మనకెందుకు అనుభవం కావటంలేదు? స్వప్నం కూడా లేని గాఢమైన నిద్రలో మనకు కష్టాలు, దుఃఖాలు వున్నాయా? అనుభవమవుతున్నాయా? లేదు. నిద్ర నుండి లేచిన తర్వాత చాలా హాయిగా నిద్రపోయానని అంటూంటాం. అంటే యిక్కడ జరిగే ప్రక్రియను మనం జాగ్రత్తగా గమనించాలి. ప్రకృతి ద్వారా వచ్చే విషయాలను యింద్రియాల ద్వారా మనసు గుర్తించి తదనుగుణంగా మనస్సు ప్రవర్తిస్తున్నది. అంటే బాహేంద్రియాల ద్వారా సేకరించిన విషయాలను మనస్సు గ్రహించడం వలన విపరీతంగా కలత చెంది మనలో వున్న తృప్తి, శాంతి, ఆనందాలు మనకు అనుభవం కాకుండా పోతున్నాయి. కాని గాఢ నిద్రలో మనస్సు తాత్కాలికంగా లయమవుతున్నది. కాబట్టి నిద్రలో బయటనుండి వచ్చే విషయాలు మనస్సుకు చేరని కారణంగా, మనసు వాటిని గుర్తించని కారణంగా హాయి అనుభవమవుతుంది. ఇది జరుగుతున్నది నిద్రలో కదా మరి మెలుకువలో దీనిని సాధించడమెలా అంటే, దీనిని సాధించాలంటే సద్గురు సమాశ్రయం అనివార్యం. మెలుకువలో దీనిని సాధించడానికి వారి వారి సంస్కారాల ననుసరించి వివిధ సాధనామార్గాలను సద్గురువు చూపిస్తాడు. మరి ఆ మార్గంలో పయనించవలసినది మనమే కదా కాబట్టి, ధన సంపాదన లోను, కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించడంలోను, అధికారాన్ని చలాయించడంలోను మనకు తృప్తి, శాంతి, ఆనందాలురావు, రావనడానికి మనకు మనమే నిదర్శనం. నిరంతరం వాటి వేటలో పడి వాటి వెనుకనే పరుగులు పెడుతూ, మహాత్ములు చెప్పిన వాక్యాలను పెడ చెవిని పెడుతూ, రాగ, ద్వేష పూరితమైన జీవితాలను కొనసాగిస్తున్న మనకు తృప్తి, శాంతి, ఆనందాలు గగన కుసుమాలే. ఎడారిలో ఒయాసిస్ లాంటివి, అంటే అవి ఎండమావులే.



కాబట్టి అటువంటి దుఃఖ భూయిష్ట జీవితం నుండి విడివడడానికి సద్గురు సమాశ్రయంతో వారి ఉపదేశాల స్మరణం, పఠనం, ఆచరణలతో మనమందరం అజ్ఞానమనే చీకటిని చీల్చుకొని జ్యోతి మార్గంలో పయనిద్దాం. అందుకొరకు మనమందరం ఈ క్షణం నుండే మాష్టారు చూపిన సాయి బాటలో కలసి నడుద్దాం. కలిసి ప్రార్థిద్దాం. సద్గురు శ్రీసాయినాధుడు మనల్నందరిని ధర్మమార్గంలో నడిపించి రాగద్వేష రహితమైన జీవితాన్ని ప్రసాదించి, ఆయన వైపు ఒకడుగు వేసేలా ప్రయత్నిద్దాం. అపుడే ఆయన మనవైపు పది అడుగులు వేయటానికి సిద్ధంగా ఉంటారు. దానికి ప్రతీకగానే మనలోని అజ్ఞానమనే నూనెను సాయి స్వీకరించి, ద్వారకామాయిలో దీపాలు వెలిగించింది. అందుకే మన హృదయమనే ప్రమిదను శుభ్రంచేసి, సిద్ధంచేసి, అందులో మన అహంకారమనే నూనెను పోసి, భక్తి, శ్రద్ధ అనే రెండు వత్తులు వేసి, సద్గురు శ్రీసాయి జ్యోతితో వెలిగించుకుందాము. ఆ వెలుగులో మన అజ్ఞానమనే చీకటి పటాపంచలుకాగా, జ్ఞానమార్గంలో పయనిద్దాము

(నవంబరు 4వ తేదీ (గురువారము) దీపావళి శుభాకాంక్షలతో...

రచన : **వి.సి. వెంకటేశ్వరులు**,పుత్తూరు.




# ఒక్క క్షణం !

శింగరాయ కొండలో జరిగిన సత్సంగంలో పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చెప్పిన కొన్ని విషయాలను మీతో పంచుకుంటున్నాను.

1. మానవ జీవితానికి లక్ష్యం ఏమిటి? మనం పుట్టాం. మన ఇచ్ఛ లేకుండానే మన సంకల్పం లేకుండానే, ఈ మధ్యకాలాన్ని ఎలా సద్వినియోగ పరచుకోవాలి. ఈ మధ్యకాలంలో ఎన్నో పనులు చేస్తున్నాము. వాటన్నిటి లక్ష్యం తృప్తి, శాంతి, ఆనందాలను పొందటమే. కాని పొందుతున్నామా? పొందుతున్నట్లు అనుభవముంది కాని వాస్తవంగా మాత్రం లేదు. ఉదా.. కారు కొనాలనిపించింది. కొన్నాము ఆనందం, దానిలో స్వగ్రామానికి బయలుదేరి వెళ్తున్నాము మధ్యలో కారులో పెట్రోలు అయిపోయింది. పర్యవసానం దుఃఖం. లేదూ, అదే ఆగిపోయింది, మరలా దుఃఖం. ఇలాగే లౌకిక సుఖాల వెనుక దుఃఖం దాగి వుంటుంది. అలా కాదు తనకన్నీ వున్నాయి. అసలు దుఃఖమే లేదంటారా ఎవరైనా. కాబట్టి లౌకికంగా ఎన్ని సమకూర్చుకున్నా



మనం దుఃఖ అనుభవాన్ని పొందుతాము కాని దుఃఖ స్పర్శయేలేని సుఖాన్ని పొందము. తృప్తి, ఆనందాలకోసం మనం పోగుచేసుకునే వస్తువులను, ముండ్లతో కప్పినట్లుంటుంది. ఇది ఎంతో శ్రమ, దుఃఖాలతో కూడిన పని. అలాగాక మన కాళ్ళకు పాదరక్షలు ధరిస్తే ఆ మైదానాన్ని సులభంగా దాటగలం. అంటే ప్రతి పనిని కౌశలంగా చేయటం అవసరం. "యోగకర్మ సుకౌశలం" అని గీత కూడా చెప్తుంది. అయితే దుఃఖ స్పర్శయే లేని సుఖ సంతోషాలను పొందటానికి సులభమార్గమేది అంటారేమో, అది నీ స్వరూపాన్ని నీవు తెలుసుకోవటమే. నీది సాయినాధుని స్థితే, కావలసిన ప్రాతిపదికను శ్రీసాయియే వేసిపెట్టారు. అందుకు ప్రతిబంధకంగా నిలిచేది మనలోని వాసనలు. వాని బహిర వృత్తులు అయిన కోరికలు. ఈ కోరికలు నెరవేరితే సుఖం, లేకుంటే దుఃఖం. అందువలన బాబా తన భక్తునకు నిజంగా అవసరమైన కోరికలన్ని తన పుణ్యం అడ్డంవేసి తీరుస్తానన్నారు. వాసనాక్షయం కానిదే మనోనాశనం కాదు మనోనాశనమే ముక్తి. తద్వారా లభించేదే దుఃఖస్పర్శయే లేని సుఖం. తన భక్తులు కోరిన తక్షణమే అనుగ్రహిస్తానని, రక్షిస్తానని అన్నారు శ్రీసాయి. అది నిజమే. ఆయన రక్షణ మనకు పొడుగునా లభిస్తూ వుంటుంది. నానాసాహెబ్ అనుభవాలు, కాకా దీక్షిత్ అనుభవాలు, ఇతర సాయిభక్తుల అనుభవాలు కూడ ఈ విషయాన్ని సాయి చరిత్రలో మనకు తెలియచేస్తాయి.

అయితే బాబానే ఎందుకు సేవించాలి. సృష్టిలో ప్రతిజీవికి పుట్టుక, పెరుగుదల, క్షీణించటం వంటి స్థితులుంటాయి. తద్వారా దుర్మార్గులు తమ క్రూరత్వంతో సన్మార్గులను బాధిస్తారు. సన్మార్గులు యజ్ఞ, దాన, తపస్సుల ద్వారా పరమాత్మ రక్షణకై తపిస్తుంటారు. ఈ దుర్మార్గుల పాపము, ఈ సన్మార్గుల పుణ్యము ప్రారబ్ధంగా పరిణమించి భగవంతుడు అవతార పురుషుల రూపంలో దిగివచ్చి శిష్టరక్షణ దుష్టశిక్షణ చేస్తాడు. రాముడు కృష్ణాది అవతారాలన్ని ఇలా వచ్చినవే. రాముడు రావణాది రాక్షసుల సంహారానికి, మహర్షుల, మహాత్ముల రక్షణకై అవతరించగా, శ్రీకృష్ణుడు ధర్మరాజాధి సత్పురుషుల రక్షణకు, ధుర్యోదనాది దుష్టుల శిక్షించుటకు అవతరించారు. ఇలా అవతారాలలో దుష్టులను సంహరించుట కోసం వస్తారు. అయితే అధర్మాన్ని తలెత్తనీయకుండా చేసే ప్రక్రియను భగవంతుడే చేస్తాడు. అంటే రోగం వచ్చాక వైద్యం చేసే ప్రక్రియతోపాటే, రోగం రావడానికి కారణం అన్వేషించి, రూపుమాపే క్రియకూడా సృష్టిలో వుంది. ఈ రెండో ప్రక్రియ నిర్వహించటానికి భగవంతుడు మహాత్ముల రూపంలో దిగివస్తాడు. ఇక్కడ శిక్షించటం వుండదు. వారిని ధర్మంలోకి మేల్కొల్పటం వుంటుంది. సమాజంలో నైతిక విలువలను ప్రతిష్ఠించి, అధర్మం తలెత్తకుండా శ్రద్ధ వహిస్తారు. శ్రీసాయి సకల జీవస్వరూపంగా అనుభవాలనిచ్చి సర్వులలో తనను దర్శించే తత్వాన్ని తన భక్తులలో నిలిపారు. ఏ జీవిని హింసించినా, తననే హింసించారని, ఆదరిస్తే తననే ఆదరించారని అనుభవాలు ఇచ్చారు. ఇలా ఇచ్చిన వారు దాదాపు లేరనే చెప్పవచ్చు. ఎప్పుడైతే సర్వులలో సాయినే దర్శించగలుగతామో, అప్పుడు అధర్మ ప్రవర్తనకు తావే వుండదు. అంతేకాక ఏ సాధన ఫలించాలన్నా మనం సత్వగుణ ప్రధానములమయి వుండాలి. కాని సత్వగుణం ఎలా వస్తుందో ఎక్కడా చెప్పలేదు. కొందరు శ్రద్ధగా సంధ్యాది అనుష్టాది కార్యక్రమాలు చేస్తూపోతే వస్తుందన్నారు, కాని అలా చేస్తేనే రాదు అనటానికి రావణాది రాక్షసులే తార్కాణం. త్రికాల సంధ్యాది కార్యక్రమాలు చేసే రావణుడే సీతాదేవిని ఎత్తుకువచ్చాడు. అష్టదిక్పాలకులు రావణుడి లంకను కాపలాకాసేవారట. ఈశ్వరుని తపస్సు ద్వారా ప్రత్యక్షం చేసుకున్న సాధకుడు రావణుడు. కానీ రజోగుణ ప్రధానుడై పవిత్రులను హింసించేవాడు. కాబట్టి తెలిసో, తెలియకనో సంధ్యాది అనుష్టాన కార్యక్రమములు ఆచరిస్తే సత్వగుణం రాదు. ప్రశ్న మళ్ళీ మొదటికి వచ్చింది. అయితే సాత్విక పదార్థాలను తింటుంటే వస్తుందనన్నారు. ఏనుగు వంటి జంతువులు కేవలం సాత్విక పదార్థాలైన పండ్లు వగైరా తీసుకుంటాయి. వాటికి సత్వగుణం లేదు. అంతేకాదు ఇలా సాత్విక పదార్థాలను తింటూ వుంటే సత్వగుణమొస్తుందని ఎక్కడా చెప్పలేదు. భగవద్గీతలో

సత్వగుణ సంపన్నులు ఏ పదార్థాలు ఇష్టపడతారో చెప్పివుంది కాని, ఈ పదార్థాలు తింటే సత్వగుణం వస్తుందని ఎక్కడా చెప్పలేదు. ప్రశ్న తిరిగి మొదటికి వచ్చింది. సత్వగుణం వస్తేగాని యజ్ఞ, దాన, తపఃకర్మలు సిద్ధించవు. దాని దుంపతెగ, సత్వగుణమెలా వస్తుందో ఎక్కడా చెప్పిచావకపోయె. ఎట్లా ఈ సమస్య తెగేది. చివరకు ఈ మహానుభావుడి పాదాలనాశ్రయించాక మాత్రమే సమస్య పరిష్కారమైంది. నానాసాహెబ్ చందోర్కర్ సంస్కృతం బాగా చదువుకున్నాడు. ద్వారకామాయిలో బాబాపాదసేవనం చేస్తూ తనలో చెడ్డ ఆలోచనలు రాకుండా ఉండేందుకు భగవద్గీత పారాయణ చేస్తున్నాడు. చెడ్డ ఆలోచనలువస్తే బాబా తిట్టేవారు, ఒక్కొక్కసారి కొట్టేవారు. ఇలా చేస్తే పదిమందిలో పరువుపోతుంది, కాబట్టి చెడ్డ ఆలోచనలు రాకుండా గీత పారాయణ చేసుకుంటున్నాడు. చాలాసేపు పారాయణ చేసుకోనిచ్చారు. నాల్గవ అధ్యాయం 34వ శ్లోకం దగ్గరకువచ్చాక సాయి "ఏమిటి గొణుగుతున్నావు" అన్నారు. "ఇది సంస్కృతంలే. భగవద్గీత అంటారు. అందులోని శ్లోకాలను పారాయణ చేసుకుంటున్నాను" అన్నాడు నానాసాహెబ్. బాబాకు సంస్కృతం రాదని, చదువుకోలేదని అతని అభిప్రాయం. "భగవంతుని గురించిన గీతాలైతే కాస్త పెద్దగా చదవరాదా, నేను కూడా వింటాను" అన్నారు బాబా. "తద్విద్ధి" శ్లోకం పెద్దగా చదివేదు చందోర్కరు. ఈ శ్లోకంలో చెప్పివుంది సత్వగుణము ఎలా వస్తుందో, ఈ శ్లోకం దగ్గరే సాయి, నానాను ఎందుకు ఆపేరు. ఇందులో భగవద్గీత ఎలా పుట్టిందో చెప్పబడి వుంది. సత్వగుణమెలా వస్తుందో చెప్పబడి వుంది. అజ్ఞాన జనితమైన సుఖదుఃఖాల వంటి ద్వంద్వాల నుండి బయటపడాలని కోరుకునేవాడు, ఇంద్రియ మనోజన్యమైనదే సత్యమన్న భ్రాంతి నుండి బయట పడదలచుకున్న ముముక్షువు సాయినాధుని వంటి సద్గురువునాశ్రయించి, ఆత్మ సమర్పణ చేసుకుని, శరణాగతి పొంది, పరిప్రశ్న చేయాలని ఆ శ్లోకసారం. సద్గురువు మాత్రమే ఈ జగత్తును భగవన్మయంగా దర్శింపచేస్తారు. అప్పుడు వస్తుంది సత్వగుణం. తాము సుఖంగావుండి, పదిమంది సుఖపడాలని కోరుకునేవాడే సత్వగుణ ప్రధానుడు. తాను ఎవరినెత్తిన చేయిపెడితే వాడు కాలిపోవాలని కోరుకునేవాడు తమోగుణ ప్రధానుడు. పదిమంది దుఃఖంలో వుంటేనేగాని తనకు తృప్తిలేదనుకునేవాడు రజోగుణ ప్రధానుడు. సత్వగుణ ప్రధానుడు చేసే ప్రతిపని సిద్ధిస్తుంది. చేలో గింజనాటి పదిగింజలు ఇంటికి తెచ్చుకోవటం లాంటిది సత్వగుణ ప్రధానుడి దృష్టి. కొందరు మందిరాలకు విరాళాలు ఇస్తుంటారు. ఇది పుణ్యకార్యమే కాని ఇచ్చేటప్పుడు మా పెద్దల పేర్లు ప్రస్ఫుటంగా కన్పించేటట్లు మందిరంలో వేస్తారా? అని అడుగుతుంటారు. ఇలా వేయటం వెనుకవున్న అంతరార్థం తెలుసుకుంటే ఎవ్వరూ అడుగరు. "అలా పేరు వెయ్యాలన్న కోరికతోనే కదా మీ విరాళం ఇచ్చారు. పేరు వేశాం కనుక మీకు సాయికి మధ్యలో ఎటువంటి ఋణానుబంధం వుండదు, ఈ జన్మకుగాని, రాబోయే జన్మకుకాని మీరు బాబా నుండి పొందేది ఏమి లేదు, ముక్తి, మోక్షం లాంటివి బాబా ఇవ్వగలరు. దుఃఖరాహిత్య స్థితిని గూడా ఇవ్వగలరు, కాని మీరు మాత్రం ఆయన నుండి పొందేది వుండదు, అలాకాక సాయికి దక్షిణగా ఈ విరాళాన్ని సమర్పించామన్నారనుకోండి. ఆయన సకల జీవ స్వరూపుడు, సకల దేవతా స్వరూపుడు,సకల సాధుస్వరూపుడు. ఇంత మందికి దక్షిణనిచ్చిన పుణ్యం మీకు దక్కుతుంది. ఇది సామాన్యమైన పుణ్యమా! యోచించండి. అలా పేరు వెయ్యమనడం రజోగుణ ప్రధానమైన కోరిక". ఇందులో అంత అర్థముంది. 100రూ. నోటుకు చిల్లర మార్చుకుని ఆనందించటం లాంటిది. తెలివిగలవారు కోరుకోవలసినది ఇది కాదుకదా? ఇది చిన్నపిల్లల మనస్తత్వం. జేబు బరువుగావుంటే చూచుకొని నా దగ్గర చాలా డబ్బుందని సంతోషించటం. కాబట్టి సద్గురువును సేవించటం వల్ల సత్వగుణ ప్రధానులమవుతాము. శ్రీ సాయిబాబా తప్ప ఇలా ప్రత్యక్ష అనుభవాలనిచ్చిన సద్గురువు మరొకరు లేరనే చెప్పాలి. కాబట్టి మనం తప్పక శ్రీసాయిని మాత్రమే సేవించాలి. అప్పుడే మనకు అజ్ఞానజనితమైన దుఃఖస్పర్శయేలేని తృప్తి, ఆనందాలు మన సొంతం అవుతాయి. ఇదే గదా మన జీవిత లక్ష్యం. మనమంతా సత్వగుణ సంపన్నులమై శ్రీసాయిని సేవించి ఇహపర సుఖాలను పొందాలని, అటువంటి సంస్కారాన్ని సద్గురు సాయినాధుడు మనకందరికి ప్రసాదిస్తాడని ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను" అని సత్సంగము ముగించారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. (విజయదశమి మరియు మాష్టారిగారి జయంతి సందర్భముగా సమర్పణ)

రచన, సేకరణ : **శ్రీ జె.వి. సుబ్బయ్య మాష్టారు**, ఒంగోలు
సౌజన్యం : **'సద్గురుస్మృతులు'**

## శ్రీ దత్త ఘోర కష్టోద్ధరణ స్తోత్రం :

శ్రీపాద శ్రీవల్లభత్వం సదైవ । శ్రీదత్తాస్మాన్ పాహి దేవాధిదేవ ।
భవగ్రాహ్య క్లేశ హారిన్ సుకీర్తే । ఘోరాత్కష్టా దుద్ధరాస్మాన్ నమస్తే ॥

త్వం నో మాతాత్వం పితాప్తోధిపస్త్వం । త్రాతా యోగక్షేమకృత్ సద్గురుస్త్వమ్ ।
త్వం సర్వస్వం నో ప్రభో విశ్వమూర్తే । ఘోరాత్కష్టా దుద్ధరాస్మాన్ నమస్తే ॥

పాపం తాపం వ్యాధిమాధించ దైన్యమ్ । భీతిం క్లేశం త్వం హరాశుత్వదన్యమ్ ।
త్రాతారం నోవీక్ష ఈశాస్తజూర్తే । ఘోరాత్కష్టా దుద్ధరాస్మాన్ నమస్తే ॥

నాన్యస్త్రాతా నాపి దాతా న భర్తా । త్వత్తో దేవత్వం శరణ్యోశోకహర్తా ।
కుర్వాత్రేయానుగ్రహం పూర్ణరతే । ఘోరాత్కష్టా దుద్ధరాస్మాన్ నమస్తే ॥


ధర్మే ప్రీతిం సన్మతిం దేవభక్తిం । సత్సజాగాప్తిం దేహి భుక్తిం చ ముక్తిమ్ ।
భావ శక్తించఅఖిలానందమూర్తే । ఘోరాత్కష్టా దుద్ధరాస్మాన్ నమస్తే ॥

శ్లోక పంచక మేతద్యో లోక మంగళవర్ధనం ।
ప్రపఠేన్నియతో భక్త్యా సశ్రీదత్త ప్రియో భవేత్ ॥
అవధూత చింతన శ్రీ గురుదేవ దత్త

ఇతి శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీమద్ వాసుదేవానంద సరస్వతీ స్వామి విరచిత శ్రీ ఘోర కష్టోద్ధరణ స్తోత్రం సంపూర్ణమ్.

శ్రీ దత్తజయంతి శుభాకాంక్షలు

# జిజ్ఞాస



డిసెంబరు 30వ తేదీ భగవాన్ శ్రీ రమణమహర్షి జయంతి సందర్భముగా భక్తులు అడిగిన ప్రశ్నలకు భగవాన్ అందించిన జ్ఞాన గుళికలను "శ్రీరమణుని దివ్యభాషణలు" సౌజన్యంతో మీకందిస్తున్నాము

**– సంపాదకుడు**

**పశ్న : లోక వ్యవహారములలో సాక్షిగా ఉండటము అంటే ఏమిటి?**

**భగవాన్ :** పరమేశ్వరుడు జీవులను తమ తమ ప్రారబ్ధ కర్మలననుసరించి ఆడిస్తున్నాడు. ఏది జరగవలసిందో అది ఎవరెంత అడ్డుపడినా జరిగే తీరుతుంది. ఏది జరగకూడదని ఉందో అది ఎవరెంత ప్రయత్నించినా జరుగదు.

మనం చేసే సర్వ కర్మలకు (మనస్సుతో ఆలోచన, మాట్లాడే మాటలు, శరీరంతో చేసే పనులు) అన్నింటికి ఫలప్రదాత ఈశ్వరుడే. ఆ ఫలాలు మనం ఆశించినట్లుగాక, మన అర్హతకు తగినట్లు మాత్రమే అందుతాయి. వాటిని మనం ప్రసాద బుద్ధితో (భగవత్ ప్రసాదంగా) స్వీకరించడమే కర్తవ్యం.

ఏ కర్మలను అనుభవించడానికి ఈ శరీరం లభించిందో వాటిని అనుభవించే తీరాలి. వాటిని వదలివేయడం అనేది నీ ఇష్టాయిష్టాల మీద ఏ మాత్రం ఆధారపడి ఉండదు. ఏ శక్తి అయితే ఈ శరీరానికి ఉనికి కలిగించిందో ఆ శక్తే ఈ శరీరంతో చేయవలసిన పనులన్నిటినీ చేసేలా చేస్తుంది. నీకు ఇష్టమున్నా లేకున్నా నీ పుట్టుక ప్రయోజనం పూర్తి అయ్యే తీరుతుంది.

**ప్రశ్న : ప్రారబ్ధం ఉన్నదా? జరగవలసింది జరిగే తీరుతుందని మీరు అంటున్నారు కదా. అటువంటప్పుడు ఇక ప్రార్థనలు, ప్రయత్నాలు అవసరమేనా?**

**భగవాన్ :** ప్రారబ్ధాన్ని దాటటానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి – ప్రారబ్ధం ఎవరికి అని ప్రశ్నించుకొని ఆత్మను తెల్సుకోవటం. ప్రారబ్ధం అహంకారానికేగాని ఆత్మకు కాదు. మనం ఆత్మ స్వరూపులమైనప్పుడు, ప్రారబ్ధం మనలను బాధించదు. రెండు – భగవంతునకు పరిపూర్ణ శరణాగతి చెందటం, 'ప్రభూ.. నీవు తప్ప నేను లేను. నీ యిచ్ఛయే నెరవేరుగాక.." అంటూ నిరంతరం ప్రార్థించాలి. ఇది కావాలి అది కావాలి, అని కోరుకోవటం కూడదు. చివరకు మోక్షాపేక్ష కూడా అడ్డే అవుతుంది. అప్పుడు అహంకారం పూర్తిగా నాశనమైపోతుంది. ఇక ప్రారబ్ధం బాధించదు.

**ప్రశ్న : మరుజన్మలో మనిషి, నీచ జంతువుగా పుట్టుటుందునా?**

**భగవాన్ :** సంభవమే. ఉదాహరణకు – జడ భరతుడు, యోగియైన ఆ రాజు తర్వాత జింకగా పుట్టినాడని శ్రుతులున్నవి.

**ప్రశ్న : స్వామీ.. భగవంతుని సన్నిధిలో జపతపాలు చేసినవారికి మంచి ఫలితం కలుగునంటారు. సరే దురభ్యాసాలతో ఉన్నవారిమాటేమిటి?**

**భగవాన్ :** సత్కార్యాచరణకు ఫలితం ఉన్నప్పుడు దుష్కార్యాచరణకు ఫలితం ఎందుకు లేదు? కాశీలో గోదానం చేస్తే ఎంత పుణ్యమో, గోహత్య కంత పాపం చెప్పలేదా యేమి? పవిత్ర స్థలాల్లో గోరంత పుణ్యం చేస్తే కొండంత అవుతుందన్నప్పుడు, పాపం మాత్రం ఎందుకు కాదు? నేను చేస్తున్నాననే భావం ఉన్నంత కాలం దేనికది అనుభవించవలసిందే.

**ప్రశ్న : గురు సమర్పణ అంటే ఏమిటి?**

**భగవాన్ :** గురువునకు సమర్పణ అంటే తన ఆత్మకంటే బాహ్యంగా వున్న వేరెవరికో కాదు. తన నిజతత్త్వాన్ని గుర్తించే దిశలో సహకరించేందుకు తనకు బాహ్యంగా ప్రకటమైన తనకే అని గుర్తించాలి. "గురువున్నది లోపలే. ధ్యానం చేసేది గురువు బాహ్యంగా ఉన్నాడన్న అజ్ఞానపు అపోహను తొలగించేందుకు. అతడు బాహ్యంలో తారసిల్లిన ఎవరో నూతనవ్యక్తి కాదు సుమా. అదే అయితే ఇతరులవలె అతడూ కాలక్రమంలో అదృశ్యమై తీరుతాడు. అలాంటి అశాశ్వత వ్యక్తితో ఒరిగేదేమిటి? మరి, నీవో పరిమితమైన దేహం అనుకున్నంతసేపు గురువు కూడా వేరే దేహంతోటి నీకు వెలుపల కనిపించే ఆవశ్యకత ఉంది. "నేను" దేహమనే దోషభావం తొలగిపోగానే ఇంకేముంది. గురుమూర్తి నీ స్వరూపమే అయిన ఆత్మ అని గ్రహిస్తావు.

**ప్రశ్న : జపము అనగా?**

**భగవాన్ :** జపము వాచికము. దాని స్మృతి, ఆపైన ధ్యానము ఈ క్రమంలో సాగి, అజవర అప్రయత్నమగు నిరంతర జపము, జపకర్త, "ఆత్మయే". జపములన్నింటిలో "నే నెవరన్న" జపమే అత్యుత్తమం.

**ప్రశ్న : జ్ఞాని అయినవాడు, తానేగిన మార్గానుసారమేకాక ఇతర మార్గానువర్తులకును సహాయం చేయగలడా?**

**భగవాన్ :** ఆహా.. తప్పకుండా.. ఏ మార్గంలో ఉన్నవారికైనా సహాయం చేయగలదు. ఎట్లాగంటే, ఒక కొండ వున్నదనుకో, అది ఎక్కేందుకు ఎన్నోమార్గాలు, తానెక్కినదోవనే రమ్మంటే ఒకరికి నచ్చవచ్చు. ఇంకొకరికి నచ్చకపోవచ్చు. నచ్చనివారిని అటే రమ్మంటే రాలేరు. అందువల్ల ఏ దోవ ననుసరించిన వారికి ఆ దోవనే పైకి వచ్చేందుకు సహాయం చేస్తారు. మార్గమధ్యంలో ఉన్నవారికి, ఇంకొక దారిలోని మంచి చెడ్డలు తెలియవు గాని, శిఖరమెక్కి కూర్చున్నవారికి, అన్నిదోవలూ కనిపిస్తూనే వుంటాయి. ఇట్లా తప్పకోబాబు, అట్లా రా నాయనా, అని చెప్పి చూపగలరు. అందరికీ గమ్యస్థానం ఒక్కటేగదా.

# మన సంప్రదాయాలు - కార్తీకపౌర్ణమి

అన్ని మాసాలలో కార్తీకమాసం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. 'న కార్తీక సమో మాస' అని అత్రి మహాముని వచనం. అంటే కార్తీక మాసంతో సమానమైన మాసం లేదని అర్థం. 'చంద్రుడు పౌర్ణిమ రోజున కృత్తికా నక్షత్రములో సంచరించే మాసం కార్తీక మాసం'. దీనిని 'త్రిపుర పూర్ణిమ' రాస పూర్ణిమ, దేవ దీపావళి' అని కూడా అంటారు. ఈ రోజును మనువులలో పద్నాలుగోవాడైన భౌత్యుని పేరున భౌత్యమన్వంతరాది, ఇంద్ర సావర్ణిక మన్వంతరమని కూడా అంటారు. త్రిపురాసుర సంహారం జరిగింది కూడా ఈ రోజే.




తారకాసురుడి ముగ్గురు కుమారులూ బ్రహ్మను మెప్పించి, ఎక్కడికైనా స్వేచ్ఛగా సంచరించగలిగే మూడు పురాలను వరంగా పొందారు. ఎవరివల్లా మరణం లేకుండా వరం కోరేరు. అది సాధ్యం కాదన్నాడు బ్రహ్మ. అలాగైతే రథంకాని రథంమీద, విల్లుకాని విల్లుతో, నారికాని నారి సారించి, బాణంకాని బాణం సంధించి, మూడు నగరాలూ ఒకే సరళరేఖలోకి వచ్చాక ఒకే బాణంతో ముగ్గురినీ ఏకకాలంలో కొడితేనే మరణం సంభవించేలా వరం కోరారు. ఇవ్వక తప్పలేదు బ్రహ్మకు. ఆ వర బలంతో పట్టణాలతో సహా సంచారంచేస్తూ లోకాలన్నింటా కల్లోలం సృష్టిస్తున్నారు. వివిధ లోకవాసులు బ్రహ్మకు మొరపెట్టుకున్నారు. వరం ఇచ్చింది తానే కాబట్టి ఏమీ చేయలేనన్నాడు బ్రహ్మ, విష్ణువు దగ్గర కెళ్ళమని ఉపాయం చెప్పాడు. విష్ణువు కూడా తనకా శక్తిలేదని, వారిని వెంటపెట్టుకుని శివుడి దగ్గరకు వెళ్లాడు. దేవతలందరూ సహకరిస్తే తానీపని చేయగలనన్నాడు శివుడు. ఆ మాటతో భూమి రథం కాని రథంగా మారింది. మేరు పర్వతం విల్లుకాని విల్లుగా, ఆదిశేషువు అల్లెతాడుగా, శ్రీమహావిష్ణువు బాణంకాని బాణంగా మారేరు. వీరందరి సమాహార శక్తితో శివుడు త్రిపురాసురులను (మూడు పట్టణాల యజమానులైన రాక్షసులను) సంహరించాడని, అందువల్ల ఈ పేరు వచ్చిందనీ పురాణ కథనం.

ఈరోజు ఆచరించే వ్రతాలలో భక్తేశ్వర వ్రతం ఒకటి. ఇది స్త్రీలకు సౌభాగ్యం కలిగిస్తుంది. ఒక భక్తురాలి కోరికను శివుడు మన్నించి వరం అనుగ్రహిచటముతో ఇది ప్రాచుర్యంలో ఉంది. పాండ్యుడు, కుముద్వతి దంపతులు సంతానార్థం శివుని ఆరాధించి ప్రత్యక్షం చేసుకున్నారు. వారు చేసిన ఆరాధనలోని చిన్న లోపంవల్ల సరైన వరం ఇవ్వదలచుకోలేదట శివుడు. అందుకే 'అల్పాయుష్కుడు, అతిమేధావి అయిన కొడుకు కావాలా... పూర్ణాయుష్కురాలు, విధవ అయిన కుమార్తె కావాలా అని అడిగితే, కుమారుణ్నే కోరుకున్నారా దంపతులు. అతడి వయస్సు పెరుగుతున్న కొలదీ, వారిలో గుబులూ పెరుగుతోంది. ఆ సమయంలో శివభక్తి పరాయణురాలైన అలకాపురి రాజకుమార్తెపై వారి దృష్టిపడింది. ఆమె పిలిస్తే శివుడు పలికేటంత భక్తి, శక్తి కలదని విన్నారా దంపతులు. ఆ పిల్లను తమ కోడలిగా చేసుకుంటే తమబిడ్డను పూర్ణాయుష్కుడిగా మార్చే బాధ్యత ఆమె చూసుకుంటుందని ఆలోచించి, అలాగే చేశారు. వివాహమైన కొన్నాళ్లకే భర్తకోసం యమభటులు వచ్చేసరికి ఆసాధ్వి తక్షణమే తన భక్తి ప్రభావంతో శివుని ప్రార్థించి ప్రత్యక్షం చేసుకుని భర్తను పూర్ణాయుష్కుడిగా మార్చుకునే వరం పొందిందని పురాణ కథనం.

కార్తీకపౌర్ణమి శివకేశవులకు ప్రియమైనరోజు. ఈ రోజున దీపం వెలిగిస్తే తెలిసీ తెలియక చేసిన పాపాలన్నీ హరించుకుపోతాయి. కార్తీక సోమవారాల్లో, కార్తీక పౌర్ణమి రోజున రుద్రాభిషేకం చేయిస్తారు. ఈ విశిష్ట దినాన సత్యన్నారాయణ వ్రతం చేసుకోవడం చాలా శ్రేష్టం. ప్రదానంగా కార్తీక పౌర్ణమి నాడు తెల్లవారుజామున సముద్రం, నదిలో స్నానం చేయడం శుభప్రదం. నదిలో స్నానం చేసే అవకాశం లేనివారు ఉదయానే లేచి స్నాన జపాలు ముగించి ఆలయానికి వెళ్లి దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం 365 వత్తులతో దీపాన్ని వెలిగిస్తారు. రోజుకు ఒక ఒత్తి చొప్పున ఏడాది మొత్తాన్ని సూచిస్తాయి ఈ ఒత్తులు. కొందరు దీపాలను అరటిదొప్పలో ఉంచి నదిలో లేదా కొలనులో విడిచిపెడతారు. మరి కొందరు శివాలయంలో దీపాలు వెలిగిస్తారు. అలా వీలుకాని వారు ఇంట్లోనే దేవునిముందు లేదా తులసికోట ఎదుట దీపం వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు శివాలయంలో దీపారాధన చేయడం అంటే ముక్కోటి దేవతలనూ పూజించటమే. సకల పుణ్య నదుల్లో స్నానం చేసిన ఫలం దక్కుతుంది. కార్తీక పౌర్ణమినాడు చేసే దీపారాధనతో ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, పరలోకంలో ముక్తి లభిస్తాయి.

జైనులకు, పంజాబీలకు ఇది విశిష్టదినం. గంగా మహోత్సవం కూడా ఈ రోజునే నిర్వహిస్తారు. తెలుగువారు కార్తీకపూర్ణిమ వ్రతంలో చలివిడి చేస్తారు. తమిళులు వేపుడు బియ్యం, అటుకులు చేస్తారు. బలి చక్రవర్తికి ఒళ్లంతా మంటలు పుడితే కార్తీక పౌర్ణమి నాడు శివారాధన చేయడంతో మంటలు తగ్గినట్లు, మహిషాసురుడితో యుద్ధం చేసిన సమయాన శివలింగాన్ని బద్దలు కొట్టిన పాపనివృత్తికై పార్వతీదేవి కూడా శివారాధన చేసినట్లు పురాణ కథనాలు.

నాలుగు నెలలు పాటు బుద్ధుడు ఉత్తమ లోకంలో తల్లి వద్ద ఉండి తిరిగి భూలోకానికి కార్తీక పౌర్ణమి రోజున దిగి వచ్చే క్రమంలో బౌద్ధులు దీపమాలికలు వెలిగించి, మత స్థాపకునికి స్వాగతోపచారాలు చేస్తారు. బర్మాలో ప్రతి చోటు దీపాలతో నిండి ఉంటుంది. కార్తీక శుద్ధ పూర్ణిమ రోజున కృత్తికా దీపోత్సవాన్ని ఆచరించడం, ఉసిరి చెట్టుకు ప్రదక్షిణలు చేసి, కార్తీక దామోదరుని పూజ, దీపారాధన చేయటం అత్యంత పుణ్యప్రదం.

దైవ దర్శనం, దీపారాధన సాలగ్రామ దానం, దీపోత్సవ నిర్వహణ ఈ రోజు విశేష శుభ ఫలితాలను అనుగ్రహిస్తాయి అని కార్తీక పురాణంలో పేర్కొనబడింది. ఎవరి శక్తి సామర్థ్యాలను బట్టి హరిహరులను సేవించి వారి కరుణా కటాక్షాలు పొందుతారు. వీరిని ఎంత నిష్ఠతో తలిస్తే అంత శుభఫలితాలు ఉంటాయి.

(నవంబరు 18వ తేదీ గురువారము, కార్తీకపూర్ణిమ సందర్భముగా సమర్పణ).

సేకరణ : **శ్రీమతి వై. సాయిశిరీష,** బెంగుళూరు



# పూర్ణ అంతరంగాలు

సకల జనావళిని ఉద్ధరించాలనే లక్ష్యంతో అవతరించిన జగద్గురువు అయిన శ్రీ శిరిడీసాయినాధుడు, అనేక మిషలమీద కార్యకారణ సంబంధముగా, భక్తులను తన వద్దకు లాగుతానన్నారు. భూమిపై ప్రతి జీవి ఏదో ఒక కారణంగా జన్మిస్తుంది. అది ఎరుకగలిగి జీవితం సార్ధకత చేసుకునే అవకాశం మాత్రం ఒక్క మానవ జన్మలోనే ఉంది. తన లాగానే భౌతిక దేహమిచ్చిన భగవంతుడు, మరల గురురూపంలో అవతరించి, తన చెంతకు లాగి, వెంటనుండి నడిపిస్తాడు. ఇందులో జీవి ప్రమేయం కన్నా జీవితం ప్రసాదించిన భగవంతుడు, ఆయన స్వరూపమైన గురువు యొక్క పాత్రే యెక్కువ. మనం ఎదుగుతున్నాము, జన్మసార్ధకత చెందించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము, ఆ దిశగా మన అడుగులు సాగుతున్నాయి అంటే, అందులో మన ప్రమేయం ఒక్క అడుగు మాత్రమే, ఆ దిశగా సాగే ప్రయత్నంలో అనేక రూపాలలో గురువు ఎదురై, వెంటనుండి గమ్యం చేరుస్తారు, –మధ్యలో మనం అహంతో జారిపోకుండా ఉంటే – ఆ ప్రయాణములో ఎప్పుడు ఎవరు ఎవరిని కలవాలో, ఏదిశగా పయనం సాగించాలో ముందే నిర్దేశించబడి ఉంటుంది, తగిన సమయంలో తగురీతిన వ్యవహరించటమే మనవిధి.

నిరంతరము వెంటనుండి నడిపిస్తూ, అనేక ఆధ్యాత్మిక అనుభూతులను ప్రసాదిస్తున్న ఆదిదంపతులైన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు, వారి ధర్మపత్ని శ్రీమతి అలివేలుమంగతాయారుగారి దివ్య పాదపద్మములకు సహస్ర వందనాలు అర్పిస్తూ, ఆ ఆది దంపతులు జరిపిస్తున్న లీలావిలాసాలను, వారి దివ్య అనుగ్రహ అనుమతి, ఆశీస్సులతో మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తాను. 1982లో ప్రప్రథమముగా సూళ్ళూరుపేటలో మాష్టారుగారి దర్శనం చేసుకున్న తరువాత 1989 ఏప్రిల్ లోపల పూజ్య మాష్టారిగారిని ప్రత్యక్షంగా దర్శించుకొన్నది కొన్ని సార్లే, కాని వారిని దర్శించుకున్న ప్రతిసారి ఒక మధురానుభూతి, ప్రతిసారి ఒక సరికొత్త అనుభవం. అటుపిమ్మట ఒంగోలు వెళ్ళినప్పుడల్లా మాష్టారిగారి ప్రతిరూపమైన వారి ధర్మపత్ని శ్రీ అలివేలుమంగమ్మగారి దర్శనం చేసుకొని వారి, ఆశీస్సులు అందుకొని రావటం జరిగేది. 2000వ సంవత్సర నూతన శతాబ్దిలో మొట్టమొదటసారిగా 'అఖిలాంధ్ర సాయిమాస్టర్ భక్తసమ్మేళనము' విశాఖపట్నంలో నిర్వహించదలచినప్పుడు అమ్మగారిని దర్శించుకొని, మాష్టారిగారి దివ్యానుగ్రహము, అమ్మగారి ఆశీస్సులతో ఒక మరపురాని మధురానుభూతులతో విశాఖపట్నం ఉక్కునగరంలో, మూడు రోజులపాటు శ్రీశిరిడీసాయి సేవాట్రస్ట ఆధ్వర్యములో మొదటి సమ్మేళనము, నిర్వహించటమైనది. దానికి శ్రీ కె.వి.రంగారావు, శ్రీ రాణి గోపాలకృష్ణ శ్రీ సోమిన శివప్రసాదు తమపూర్తి సహాయ సహకారములందించారు. కె.వి. రంగారావుగారు మాష్టారుగారితో అత్యంత సన్నిహితులైన వారందరి, అడ్రస్సులు సంపాదించి, అందించటమే కాకుండా వారిని ఆహ్వానించటములో కూడ తమవంతు సహకారమందించారు. అమ్మగారు తమ ఆశీస్సులతోపాటు, ఒంగోలు నుంచి సంస్థ ప్రతినిధిగా శ్రీ

రామారావును (శ్రీ రామచంద్ర చైతన్య మహరాజ్‌ను) ఆ కార్యక్రమానికి పంపటం జరిగింది. మాష్టారుగారి సహోద్యోగులు, విద్యార్థులు, అనుయాయులు, అనుసరణీయులతోపాటు, ట్రస్టు అనుబంధ సంస్థలనుండి వందలాది మంది ఆ కార్యక్రమానికి విచ్చేయటం జరిగింది. సాయి అంటేనే అంతగా తెలియని ఆ మారుమూల ప్రాంతంలో "సాయిమాస్టర్" పేరిట జరిగిన ఆ సమ్మేళనానికి, శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టుపైగల అభిమానంతో ప్రత్యక్షముగా, పరోక్షముగా సహాయ సహకారములందించినవారు, అటుపిమ్మట, నన్నుఒక్క ప్రశ్న వేశారు, వారేకాదు దూరప్రాంతాల నుంచి వచ్చిన సాయి భక్తులు కూడ కొందరు అడిగేరు "ఎవరండి 'సాయిమాస్టర్', బాబాగురించి తెలుసు, మీరు శ్రీసాయిమార్గంలోనికి రావటానికి కారణం శ్రీ భరద్వాజగారి రచనలు అని తెలుసు, ఒక లెక్చరర్ గురించి, ఒక రచయిత గురించి, రాష్ట్రస్థాయిలో సమ్మేళనము జరపటానికి కారణమేమిటి?. అంతేకాదు ఆ కార్యక్రమానికి విశేషంగా రాష్ట్రం నలుమూలల నుంచి కూడ అంతమంది రావటం కూడ చాలా విశేషంగా ఉంది. వారి గురించి పూర్తిగా తెలియజేయమని" నన్ను చాలామంది అడిగారు. బహుశ ఆ సందేహం మారుమూల ప్రాంతాలలోని మా అనుబంధ సంస్థలలోని వారికి కూడ ఉండి ఉండవచ్చు. ప్రతి ఒక్కరికీ విడివిడిగా సమాధానం చెప్పటం నావల్లకాదు, ఏమిచేయాలి? అని అనుకునే సమయంలో శ్రీసాయినాధుడి స్ఫూర్తితో నాలో ఒక ఆలోచన మెదిలింది, దాని అక్షరరూపమే పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి సంక్షిప్త జీవిత చరిత్ర "సాయి-మాస్టర్". అలనాడు శ్రీసాయిబాబా గురించి తెలియజేయటానికి మాష్టారుగారు "సాయిబాబా" అనే పుస్తకము ముద్రించి, రెండు రూపాయల (శ్రద్ధ-సబూరి) మూల్యం పెట్టి అందరికి శ్రీసాయిని పరిచయం చేశారు. అదే విధముగా శ్రీసాయి అనుంగుబిడ్డడుగా మహాత్ములచే పిలువబడిన పూజ్యశ్రీ మాస్టారి గారి గురించి అందరికీ తెలియచేయాలనే భావనతో "సాయి-మాస్టర్", పుస్తక ముద్రణకు సమాయుక్తమయినాము. వెంటనే ఒంగోలు వెళ్ళి మాస్టారిగారి సమాధిని దర్శించి, వారికి మనోభావాన్ని వెళ్ళడి చేశాము. మా ప్రయత్నానికి తన అనుగ్రహ ఆశీస్సులు అందజేశారు అమ్మగారు, అంతవరకు మాస్టారిగారి 50వ జన్మదిన సందర్భముగా కావలి నందదీప సాయిసమాజ్ వారు ప్రచురించిన "మరో నందదీపం" సావనీర్ మాత్రమే అందుబాటులో ఉంది. మాస్టారిగారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో "సాయిమాస్టర్" రచనకు ప్రయత్నం ప్రారంభించాము, రచనలో శ్రీ కె.వి. రంగారావు గారు తమపూర్తి సహాయ సహకారాలు అందించారు. వారు మాస్టారిగారితో అత్యంత సన్నిహితం కలిగి ఉండటం, "సాయిబాబా"పక్ష పత్రికకు సబ్ఎడిటర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వారు చాలా విషయాలు, అనుభవాలు మాకు అందించి రచనకు పూర్తి సహకారం అందించారు, దానికి తోడు మాస్టారిగారితోపాటు, మహాత్ముల పరిచయము కలిగిన శ్రీ రాణి గోపాలకృష్ణగారి, సహకారము తోడయింది. మొదటి సమ్మేళనము అనూహ్యమైన రీతిలో దిగ్విజయంగా జరిగి, మా ఉద్దేశ్యము నెరవేరే దిశగా సాగటంతో, దానిని స్థిరపరచు కోవటానికి, మాస్టారిగారి పేరుమీద జరిగే కార్యక్రమాలకు ద్వితీయ విఘ్నం ఉండకూడదనే భావనతో 2001లో ఫిబ్రవరి 1,2,3,4 తేదీలలో ద్వితీయ "అఖిలాంధ్ర సాయిమాస్టర్ భక్త సమ్మేళనము" కూడ విశాఖపట్నం ఉక్కునగరంలోనే జరపటానికి సమాయుక్తమయినాము. ఆ సమ్మేళనము లోపలే, "సాయిమాస్టర్" ముద్రించి, అందరికీ అందించాలనే మా ప్రయత్నం తీవ్రతరంచేసి, పుస్తకం ముద్రించి, మన పంచప్రాణాలు, సాయిమాస్టర్ పాదాలచెంత ఉంచితే, విశ్వాత్మకులైన "సాయిమాస్టర్" అనుగ్రహం పొందవచ్చుననే భావనతో రుసుము5 రూపాయలుగా నిర్ణయించి, మా గోత్ర ఋషి అయిన "భారద్వాజ" మరియు, నన్ను నిరంతరం వెంటనుండి నడిపిస్తున్న గురుదేవులు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి నామం కూడ నిరంతరం స్మరించుకునే విధముగా "శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్" పేరిట 2001లో "సాయి-మాస్టర్" ప్రథమ ముద్రణచేసి, వెనువెంటనే ఒంగోలు వెళ్ళి మాస్టారిగారికి సమర్పించి, ప్రథమ ప్రతిని అమ్మగారి దివ్య హస్తాలకు అందజేశాము. కొంచెం సేపు తదేకంగా ఆ పుస్తకం వైపు చూసి, పేజీలు తిరగేసిచూస్తూ, ఒక అలౌకికమైన స్థితికి వెళ్ళేరు. కొంతసమయం అనంతరం, తమ చూపులతో మమ్ములను ఆశీర్వదించిన విధము ఇప్పటికి తలచుకున్నా మధురానుభూతిని కలుగచేస్తుంది. అమ్మగారికి మరికొన్ని పుస్తకాలు అందించి అక్కడ ఉన్నవారికి కూడ అమ్మగారి అనుమతితో తలాఒకటి అందజేయటం జరిగింది. ఇప్పటికి "సాయిమాస్టర్" 13సార్లు పునర్ముద్రితమైనది. అక్షరరూపంలో మాస్టారి విషయాలను అందులో సంక్షిప్తముగా నింపేము మేము, దానిని తన ప్రతిరూపంగా మాస్టారుగారు అనుగ్రహిస్తే, ఆ రూపం మనమధ్య కదలాడే విధంగా అమ్మగారు ఆశీర్వదించారు. అందుకే అన్ని ముద్రణలకు నోచుకుంది. "ఎటువంటి సమస్యలకయినా, "సాయి-మాస్టర్" పారాయణ సమాధానమిచ్చి పరిష్కరిస్తుంది", అని ఎంతోమంది తమ అనుభవాలను, అనుభూతులను తెలియజేశారు. ప్రత్యేకించి విద్యార్థులకు, "సాయి-మాస్టర్" ఒక వరంగా మారింది. దానిని పారాయణ చేస్తే చాలు అలవోకగా వారి లక్ష్యం చేరుకునేవారు. మొదటి సమ్మేళనానికి, పెద్ద బేనర్లు వేయించి ఇచ్చిన విశాఖ, గాజువాకలోని ఒక వస్త్ర సముదాయ అధినేతకు కూడ "సాయి-మాస్టర్" అందించటం జరిగింది. అది పారాయణ చేసిన అనంతరం ఆయన నన్ను పిలిపించి, వీరెవరో సామాన్యులు కాదు, ఇది చదువుతుంటే అద్భుతమైన అనుభూతి కలుగుతున్నది. ఆంగ్ల నూతన సంవత్సర సందర్భముగా మా కష్టమర్లకి, కీచైన్లు, క్యాలెండర్లు, వివిధ పూజా పుస్తకాలు అందజేస్తుంటాము, అయితే ఈ సంవత్సరం "సాయిమాస్టర్" అందించ దలచాను కనుక ముద్రణకు ఎంతయినా ఫరవాలేదు నాకు వీలైనన్ని ఎక్కువ పుస్తకాలు కావాలని అడిగేరు, ఆ పుస్తక రూపంగా మాస్టారి గారి లీలావిలాసం మరింత బోధపడింది మాకు. "దట్‌ఈజ్ సాయిమాస్టర్". ద్వితీయ

సాయిమాస్టర్ భక్తసమ్మేళనము 4 రోజులు నిర్వహించదలచాము. మొదటి మూడు రోజులు, సుదూర ప్రాంతాలవారికి, 4వ రోజు ఉక్కునగర వాసులకోసం అని నిర్ణయించి, ఆ ఒక్కరోజే దాదాపు ఐదువేల మందికి భోజనాలు కూడ సిద్ధంచేశాము. మొదటి సమ్మేళన సందర్భముగా తణుకు దగ్గరి చివటం అమ్మ దర్శనం చేసుకొని, అమ్మ సేవకురాలు లక్ష్మిగారిని అమ్మ ప్రతినిధిగా సమ్మేళనానికి విచ్చేయవలసింది అని కోరగా, అమ్మగారిని ప్రపంచానికి పరిచయం చేసిన మాస్టారిగారి పేరిట జరిగే సమ్మేళనానికి తప్పకుండా వస్తానని చెప్పటమే కాకుండా, ఆ కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని కోరుకుంటూ, అమ్మ ఆశీర్వాదంగా, చివటం అమ్మ వాడుకున్న భిక్షాపాత్రను మాకు అందజేశారు, ఇక అప్పటినుంచి ఇప్పటి వరకు మేము నిర్వహించే ఏ కార్యక్రమానికి లోటు జరుగలేదు. ఆ ధైర్యంతోనే ద్వితీయ సమ్మేళనం 4 రోజులు జరపటానికి సమాయుక్తమై యధావిధిగా, ఒంగోలు వెళ్ళి మాస్టారిగారికి విన్నవించుకొని అమ్మగారి చెంతకుచేరి అమ్మ ఆశీర్వాదం అడిగేము. ద్వితీయ విఘ్నం లేకుండా కార్యక్రమము కొనసాగిస్తున్నందుకు అమ్మ చిరునవ్వులు చిందిస్తూ మనసారా మమ్ములను ఆశీర్వదించి ప్రసాదం అందించారు. అయితే అప్పుడు చి॥ ద్వారకానాథ్ ఏవో ఎగ్జామ్స్‌కు సమాయుక్తమవుతుండటముతో పైగా చిన్నవాడు కనుక, ఈసారి శ్రీరామారావునే పంపుతున్నానని అమ్మగారు చెప్పి పంపేరు. ద్వితీయ సమ్మేళనం ఆది దంపతుల అనుగ్రహ ఆశీస్సులతో అద్వితీయంగా జరిగింది. "సాయి-మాస్టర్" పుస్తకం వేలాది మందికి చేరువయింది, అటుపిమ్మట మాదగ్గర ఎంతోమంది మాస్టారిగారి అనుగ్రహపాత్రులవ్వటమే కాకుండా, వారి దర్శనార్థము ఒంగోలు వెళ్ళి, మాస్టారి సమాధి దర్శనం చేసుకొని అక్కడ అపారమైన శాంతి పొందేమని, అక్కడ విన్నవించుకొన్న తరువాత తమ కష్టాలు కడతేరినయ్యి అని, ప్రదక్షిణల ద్వారా అనుకున్నది నెరవేరింది అని తెలియజేసేవారు. మాస్టారిగారి బృందావన దర్శనంతోపాటు, అమ్మగారి దర్శనం చేసుకొని రమ్మని చెబుతూ ఉండేవాడిని, కారణమడిగిన వారికి ''ఈరోజు మాస్టారిగారి బృందావనాన్ని దర్శించుకొని జన్మ చరితార్థమైనదని, మనస్సు పునీతమయింది అని భావిస్తూ ఎన్నెన్నో అనుభూతులు చెబుతున్నాము కదా మనమందరము, అంతటి అదృష్టం పొందటానికి మూలకారణం అమ్మగారు. మాస్టారు భౌతికదేహం వీడిన 1989 ఏప్రిల్ 12వ తేదీన వారి సంప్రదాయానుసారం దహనం చేయాలని వారి జ్ఞాతులు పట్టుబడితే, మాస్టారుగారు సాయి స్వరూపులు కనుక శ్రీసాయి బాబా వలె మాస్టారుగారికి సమాధి నిర్మించుకొని సేవించుకుంటామని, మాస్టారిగారి భక్తులు, అనుసరణీయులే కాకుండా, అక్కడి ప్రతి ఒక్కరూ కోరేరు. చివరకు నిర్ణయం అమ్మగారి చెంతకు చేరింది. భక్తవత్సలురు, ప్రేమ స్వరూపులు అయిన మాస్టారిగారి మనోగతం ఎరిగిన, వారి అర్ధాంగి అమ్మగారు, "భక్తుల కోరికను మన్నించటమే మాస్టారిగారి అభీష్టమని" తెలుపగా, ఒంగోలు లాయరుపేటలోని శ్రీ షిర్డీసాయి మందిర మహరాజ్ ప్రాంగణములోనే శ్రీసాయి చెంతనే వారి అనుంగుబిడ్డడైన మాస్టారుగారిని సమాధి చేయటం జరిగింది. అది నేడు లక్షలాది మంది కోరిన కోరికలు ఈడేర్చే 'శ్రీ గురు భరద్వాజ బృందావనం'. ఆనాడు అమ్మగారి నిర్ణయం వేరయి ఉంటే? మనమీనాడు ఈ అదృష్టం పొందేవారమా? కనుక వారి స్వరూపమయిన అమ్మగారిని దర్శించుకోవటముతో అర్ధనారీశ్వరుల దర్శనం సంపూర్ణం చేసుకున్నట్లు అవుతుంది" అని చెప్పటంతో సత్సంగ సభ్యులు ఎవరు ఒంగోలు వెళ్ళినా, మాస్టారిగారి-అమ్మగారి దర్శనం చేసుకునే వచ్చేవారు తద్వారా మాస్టారిగారి ప్రత్యక్ష ఆశీర్వాదం అమ్మగారి ద్వారా పొందేమని చెప్పేవారు. విశ్వమంతా వసుధైక కుటుంబముగా కలసి మెలసి జీవించాలని శ్రీసాయి అవతార లక్ష్యం, ఆమార్గంలో అందరినీ నడిపించాలనే ఆయన అనుంగుబిడ్డడైన సాయిమాస్టర్ ప్రణాళిక. అందులో మనము భాగస్వాములు అయ్యిననాడు నిజంగా మాస్టారిగారిని విశ్వసించి, ఆ బాటలో నడుస్తూ వారికి దక్షిణ సమర్పించినట్లు. నన్నీ మార్గంలో నడిపిస్తున్న మాస్టారుగారికి నూతన శతాబ్ది 2000 సంవత్సరములో ఒకటికాదు రెండుసార్లు వారి పేరిట ఈ మారుమూల ప్రాంతములో రాష్ట్రస్థాయిలో సమ్మేళనం నిర్వహించే మహద్భాగ్యం కలిగింది. సమ్మేళనం ఒక్క విశాఖపట్నంలో జరిగితే సరిపోదు, రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో జరగాలి, ప్రతి ఒక్కరికీ మాస్టారుగారు చూపిన నిర్దుష్టమైన మార్గం తెలియపరచాలి, అందుకు నాందిగా ముచ్చటగా మూడవ సమ్మేళనం మాస్టారి గారి సన్నిధిలో, ఒంగోలులో జరగాలి, అప్పుడే ఇది వారి ప్రణాళికలో భాగం అని మాతోపాటు ప్రతి ఒక్కరికీ ప్రత్యక్ష నిదర్శనమవుతుంది అని భావించాను. అయితే అందుకు పూనుకునేవారు ఎవరు. సమ్మేళనానికి రాష్ట్రం నలుమూలల నుంచేకాదు, ఒంగోలునుంచి కూడ, విశేషంగా ఎందరో మాస్టారుగారితో ప్రత్యక్ష అనుబంధం కలవారు విచ్చేశారు. అందరూ మౌనం వహించారు. అయితే మాస్టారి నిర్ణయం వారి ప్రణాళిక, అర్ధనారీశ్వరుల అనుగ్రహ ఆశీస్సులు ఎన్నటికీ వమ్ముకావుకదా! ముచ్చటగా మూడవ సమ్మేళనం ఒంగోలు మాస్టారిగారి సన్నిధిలో శ్రీ షిర్డీసాయిమందిర మహరాజ్ ప్రాంగణములో, మందిర కమిటీవారి పూర్తి సహకారముతో ప్రత్యేకించి అధ్యక్షులు శ్రీ వాసుదేవరావుగారి (రెండు సమ్మేళనాలకు వారు విచ్చేశారు) సంపూర్ణ సహకారముతో యువకుడైన శ్రీ జె. జయరామకృష్ణ పూనికతో తృతీయ అఖిలాంధ్ర సాయిమాస్టర్ భక్తసమ్మేళనం 2002 ఫిబ్రవరి 7,8 మరియు 9 తేదీలలో మాస్టారి బృందావనం చెంతనే అమోఘంగా నిర్వహించటమైనది. అయితే సమ్మేళనం తేదీలలో చిన్నమార్పు చేయటమైనది. శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు వార్షికోత్సవము సందర్భముగా 2000 ఫిబ్రవరి 1,2,3 తేదీలలో మొదటిది, 2001 ఫిబ్రవరి 1,2,3 మరియు 4 తేదీలలో ద్వితీయ సమ్మేళనమ నిర్వహించటమైనది. ఈసారి మాస్టారిగారి సన్నిధిలో కనుక ఫిబ్రవరి నెలను మార్చకుండా అదే నెలలో మాస్టారుగారు ప్రపథమముగా శిరిడీ వెళ్ళిన ఫిబ్రవరి 8వ తేదీ, విశ్వచైతన్యానుభూతిని పొందిన 9వ తేదీని పురస్కరించుకొని, ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 7,8,9 తేదీలలో సమ్మేళనం నిర్వహించటానికి

నిర్ణయించటమైనది. అటుపిమ్మట ప్రతి సంవత్సరము ఫిబ్రవరి 7,8,9 తేదీలలో రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో సమ్మేళనాలు జరిగిన విషయం అందరికీ విశదమే. మాస్టారిగారికి అత్యంత సన్నిహితులుగా మెసలిన వారి ఆధ్వర్యములోనే ముచ్చటగా 3వసారి, మాస్టారిగారి సన్నిధిలోనే 2021 ఫిబ్రవరి 7,8,9 తేదీలలో 22వ సమ్మేళనము ''అఖిల భారత శ్రీసాయి మాస్టర్ భక్తసమ్మేళనము''గా రూపుదిద్దుకొని అఖండముగా జరగటం మనందరికీ తెలిసిందే. (సమ్మేళనాలు, రెండు దశాబ్దాల పయనం 2000–2021 అని అప్పటి అనుభవాలను, అనుభూతులను ఇప్పటి వారితో పంచుకోవాలని నా ఆకాంక్ష, మాస్టారుగారి అనుగ్రహం తోడయిననాడు అది కార్యరూపందాల్చి మీముందుకు వస్తుంది)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు భౌతికదేహం వీడిననాడు వారి పాదాలు పట్టుకొని ప్రమాణం చేసినందుకు దానిని నెరవేర్చుకునే దిశగా శ్రీ భరద్వాజ మాస్టారిగారి అనుగ్రహంతో, అమ్మగారి ఆశీస్సులతో సమ్మేళనాల ప్రారంభం, మాస్టారిగారు తలపెట్టిన నిర్దుష్టమైన శ్రీ దత్తసాయి, అవధూత సంప్రదాయ ప్రచార యజ్ఞానికి ఒక చిన్న సమిధ సమర్పించే అవకాశం కలిగింది, అయితే ఇది చాలదు ఇంకా ఏమిచేయాలి! అనే ఆలోచన మదిలో తీవ్రంగా తొలచసాగింది. మాస్టారిగారి అనుగ్రహంతో మదిలో ఒక ఆలోచన మెరిసింది. దానిని పరిపూర్ణత్వం చెందించుకోవటానికి, మాస్టారిగారికి విన్నవించుకొని అమ్మగారి ఆశీర్వాదానికై తిరిగి మిత్రులతో కలసి ఒంగోలు బయలుదేరేను, వివరాలు వచ్చే సంచికలో.

"శ్రీ శిరిడీసాయిబాబా గురించి నాకు తెలిసిన దానిలో ఏ కొద్దిపాటి మీకు తెలిసినా ఆయన జగద్గురువు అని మీరు అంగీకరించి తీరుతారు" అని అవతార మెహర్‌బాబా గారు చెప్పినట్లుగా, ఒక లెక్చరర్, శ్రీసాయితత్వ ప్రచారకులు, బాబా గురించి పుస్తకాలు రాసిన ఒక రచయితగా భావించినంత కాలం మాస్టారిగారి గురించి ఆవగింజ అంతఅయినా మనకు తెలియబడదు. శ్రీ గురుచరిత్ర పారాయణ ద్వారా శ్రీసాయి లీలామృతం గ్రోలి, శ్రీసాయి ప్రబోధామృతాన్ని ఆస్వాదించిననాడు, శ్రీసాయిసన్నిధితోపాటు మాస్టారి విశ్వతత్వం కొంచెమయినా అవగతమవటానికి అవకాశం కలుగుతుంది! మహాత్ములచే సాయి అనుంగుబిడ్డడుగా ప్రశంసించబడిన మాస్టారిగారి సాన్నిధ్యంలో నేనుపొందిన కొద్దిపాటిఅనుభవాలను, అనుభూతులను ఎప్పుడు తలచుకున్నా హృదయం ఆనంద డోలికలతో మునిగిపోతుంది. వెంటనే ఎన్నిసార్లు విన్నా మధురానుభూతిని కలిగించే పదకవితా పితామహుడు అన్నమాచార్య విరచిత ''అంతయు నీవే హరిపుండరీకాక్ష'' అన్న సంకీర్తన మదిలో మెదులుతుంది. ఆ కీర్తన ఆలకిస్తూ ఉండిపోయాను.

అంతయు నీవే హరి పుండరీకాక్ష ।
చెంత నాకు నీవే శ్రీరఘురామ ॥
అంతయు నీవే హరి పుండరీకాక్ష ।
చెంత నాకు నీవే శ్రీరఘురామ ॥ ॥ అంతయు ॥

కులమును నీవే గోవిందుడా । ॥ కులమును ॥
నా కలిమియు నీవే కరుణానిధి ॥ ॥ కులమును ॥

తలపును నీవే ధరణీధర । ॥ తలపును ॥
నా నెలవును నీవే నీరజనాభ ॥ ॥ తలపును ॥

అంతయు నీవే హరి పుండరీకాక్ష ।
చెంత నాకు నీవే శ్రీరఘురామ ॥ ॥ అంతయు ॥

తనువును నీవే దామోదర । ॥ తనువు ॥
నా మలికియు నీవే మధుసూదన ॥ ॥ తనువు ॥

వినికియు నీవే విట్ఠలుడా । ॥ వినికి ॥
నా వెనకముందు నీవే విష్ణుదేవుడా ॥ ॥ వినికి ॥

అంతయు నీవే హరి పుండరీకాక్ష ।
చెంత నాకు నీవే శ్రీరఘురామ ॥ ॥ అంతయు ॥

పుట్టుగు నీవే పురుషోత్తమ । ॥ పుట్టుగు ॥
కొన నట్టనడుమ నీవే నారాయణ ॥ ॥ పుట్టుగు ॥

ఇట్టే శ్రీ వెంకటేశ్వరుడా । ॥ ఇట్టే ॥
నాకు నెట్టిన గతి ఇంక నీవే నీవే ॥ ॥ ఇట్టే ॥

అంతయు నీవే హరి పుండరీకాక్ష ।
చెంత నాకు నీవే శ్రీరఘురామ ॥ శ్రీరఘురామ॥ శ్రీరఘురామ॥

మీ... **వి.వి. పూర్ణచంద్రరావు**

## సాధన

నిజమైన సాధకుడు తన జీవితాన్నంతా సాధనకు అనుకూలంగా మలచుకుంటాడు, అంటే తన సాధనను అడ్డుకొనే ఉద్యోగం, స్నేహితులు, జీవితవిధానం, దినచర్య అన్నీ. తాను వేసే ప్రతి అడుగు తన గమ్యంవైపే వేస్తాడు. తాను దేనికోసం జీవితాన్ని గడుపుతున్నాడో దానికోసం సర్వాన్ని వదలిపెట్టటానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. అలాకాక రోజూ సక్రమంగా ధ్యానం చేయటానికి వీలు, టైం దొరకటం లేదనో, తాము జీవితంలో పూర్తి చేయవలసిన పనులు కొన్ని పూర్తిచేసి సాధన చేస్తామనో, జీవితం బాగా అనుభవించి (ఇక అనుభవించయోగ్యం కాని ముసలివయస్సులో) బాగా సాధన చేస్తామనో అనుకునే వాళ్ళకు అసలు సాధన అంటే ఇంకా తెలియలేదన్నమాట.

అసలు మనము ఉన్నది, దేవుడిగా మారటం కోసమే, విత్తు ఉండేది చెట్టు అవ్వటం కోసం అయినట్లు. కాబట్టి **సాధనలో జీవితం ఒక భాగమవ్వాలి** అని తెలుసుకొని తీరాలి. ఇది తెలుసుకొనకుండా, సాధించకుండా ఈ లోపల సాధన, ముక్తి అని మాట్లాడటం చిన్నపిల్లవాడి మాటలవలె అర్ధరహితం. ఇది సాధిస్తేనే సాధన మొదలైనట్లు.

**– ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2021 జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీ సాయిసేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2021 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో అనేక ఆధ్యాత్మిక – సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించటమైనది.

కోవిడ్–19 నేపథ్యములో ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాలు వీలయినంత వరకు కొన్ని ఏకాంతముగాను, ముఖ్యమైన కార్యక్రమాలు, పరిమితమైన సభ్యులతో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నిర్వహించటమైనది. ఆ యా పండుగ, పర్వదినాలు, మహాత్ముల జయంతి, ఆరాధనోత్సవాలలు లోక కళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించటమే కాకుండా, ట్రస్టు ప్రాంగణములో ప్రతిరోజు ధునిపూజ కూడ నిర్వహించటమైనది.

సామాజిక సేవాకార్యక్రమాలు కూడ వీలయినంతగా ఆ యా సేవలు అర్హులైన వారి ముంగిటనే అందజేసే విధముగా ఏర్పాటు చేయటమైనది. ప్రతినెల "శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 60 అతి నిరుపేద, దివ్యాంగుల, వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటము, ప్రతి వారము దాదాపు నాలుగు వందలమందికి సరిపడా కూరగాయలు, శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో జరిగే నిరుపేద రోగుల అన్నదాన నిమిత్తము అందజేయటము, అదే విధముగా శ్రీకాకుళంలో నిత్యాన్నదాన సేవాసమితి వారికి ప్రతివారము 400 మందికి సరిపడా కూరగాయలు, అవసరమైనప్పుడు నిత్యావసర వస్తువులు అందజేయటము, ఆ యా పుణ్యతిథుల సమయంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటము, సెప్టెంబరు 21వ తేదీ నుండి మహాలయపక్షాల సందర్భముగా అరసవిల్లిలోని శ్రీ లలితా త్రిపురసుందరి నిత్యాన్నదాన సత్రానికి 15 రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటముతో పాటుగా అన్నదానానికి అవసరమైన కూరగాయలు కూడ అందజేయటానికి ఏర్పాట్లు చేయటము మొదలైన ముఖ్యమైన వాటిలో కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు.

జూలై 11వ తేదీ శ్రీకాకుళంలోని బ్రాహ్మణ నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

జూలై 24వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా, ట్రస్టు ప్రాంగణములో లోకకళ్యాణార్థము శ్రీ దత్తసాయి భరద్వాజులకు పంచామృతాభిషేకము, షోడశోపచారపూజ అనంతరము, సామూహిక "స్థవనమంజరి", "శ్రీ సాయిచాలీసా" "శ్రీసాయి స్తోత్రములు" పారాయణ చేసి, భక్తసమారాధన ఏర్పాటు చేయటమైనది.

గురుపూర్ణిమ సందర్భముగా శ్రీకాకుళంలోని అసరవిల్లిలోని శిశుసంక్షేమ సదనానికి సీలింగ్‌ఫాన్స్ బహుకరించటమే కాకుండా శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో జరిగే నిత్యాన్నదాన సమితి వారికి 400 మందికి సరిపడా కూరగాయలు మరియు అనాధ నిరుపేద వృద్ధుల అన్నదాన సమితి వారికి 600 మందికి సరిపడా కూరలు, బియ్యము అందజేయటమైనది.

జూలై 30వ తేదీ "శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 60 నిరుపేద, దివ్యాంగులు, వితంతు కుటుంబాలకు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులతో పాటు వస్త్రాలు బహుకరించటమైనది.

ఆగష్టు 2వ తేదీ 4వ దత్తావతారమైన శ్రీ అక్కల్‌కోట మహరాజ్ పాదుకలు సద్గురుపాదుకాక్షేత్రమునకు విచ్చేసిన శుభ సందర్భముగా, పాదుకలకు విశేష పూజ చేసి, అనంతరం ప్రత్యేక సత్సంగమము నిర్వహించి భక్తసమారాధన ఏర్పాటుచేయటమైనది.

ఆగష్టు 15వ తేదీ ట్రస్టు ఆవరణలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమములో, ట్రస్టు అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొని రాబోయే రోజులలో చేయబోయే కార్యక్రమాల గురించి చర్చించారు, అనంతరం సమారాధన ఏర్పాటుచేయటమైనది.

ఆగష్టు 20వ తేదీ వరలక్ష్మీవ్రతం సందర్భముగా అందరికీ ఆధ్యాత్మిక సంపద లభించాలని కోరుకుంటూ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించటమైనది.

ఆగష్టు 22వ తేదీ శ్రావణ పౌర్ణమి సందర్భముగా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ధునిపూజ నిర్వహించటమే కాకుండా, సభ్యులందరిచేత కూడ ధునిపూజ నిర్వహింపచేసి, సామూహిక "సాయినాథ స్థవనమంజరి" పారాయణ చేయటమైనది. అనంతరం భక్త సమారాధన ఏర్పాటుచేయటమైనది.

ఆగష్టు 24వ తేదీ అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకొని, ట్రస్టు ప్రాంగణములో స్వామివారి పాదుకలకు, వస్త్రానికి, పూజాదికాలు నిర్వహించి, సామూహిక "వెంకయ్యస్వామి చరిత్ర" పారాయణ చేయటమైనది. ఆ సందర్భముగా 60 నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటముతోపాటు శ్రావణమాసము సందర్భముగా నిరుపేద స్త్రీలకు చీరలు బహుకరించటమైనది.

ఆగష్టు 29వ తేదీ శ్రీ సద్గురుపాదుకాక్షేత్రంలో జరిగిన ఒక కార్యమములో, కూలీపనిచేసుకునే నిరుపేద స్త్రీలకు 30 మందికి చీరలు బహుకరించటమైనది.

సెప్టెంబరు 3వ తేదీ అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము సందర్భముగా, స్వామివారి పాదుకలకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి "చీరాలస్వామి చరిత్ర" సామూహిక పారాయణ చేయటమైనది. అనంతరం భక్తసమారాధన ఏర్పాటుచేయటమైనది.

సెప్టెంబరు 10వ తేదీ, వినాయకచవితి మరియు శ్రీపాద శ్రీవల్లభుల జయంతి పురస్కరించుకొని ట్రస్టు ఆవరణలో జరిగే ఒక కార్యక్రమములో "సాయిమాస్టర్" 13వ ముద్రణ ప్రతిని 'శ్రీభరద్వాజ పబ్లికేషన్స్ అధినేత శ్రీమతి వి.యస్.లక్ష్మి ఆవిష్కరించటమైనది.

సెప్టెంబరు 21వ తేదీ నుంచి మహాలయపక్షాలు సందర్భముగా అరసవిల్లి లోని శ్రీ లలితా త్రిపురసుందరి నిత్యాన్నదాన సత్రం వారికి 15 రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటముతోపాటు అందుకు అవసరమైన కూగాయలు రోజువారీ అందజేయటానికి ఏర్పాట్లు చేయటమైనది.

సెప్టెంబరు 30వ తేదీ ట్రస్టు ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమములో "శ్రీసాయి భరాద్వజ ఆపన్నహస్తం" పేరిట 60 అతి నిరుపేద దివ్యాంగుల, వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం


# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2021 జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)



# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2021 జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో నిర్వహించిన కార్యక్రమాలు)




పూర్తి వివరములకు 21 పేజీ చూడగలరు.

# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా 2021 జూలై, ఆగష్టు, సెప్టెంబరు నెలలలో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించటమైనది. లోక క్షేమాన్ని ఆకాంక్షిస్తూ కోవిడ్ మహమ్మారి నుండి అందరూ పూర్తిగా రక్షించబడాలి అని ఆకాంక్షిస్తూ శ్రీ శిరిడీసాయిసేవాట్రస్టు ఆవరణలో ప్రతి రోజూ ప్రత్యేక ధునిపూజ నిర్వసించటమే కాకుండా, ట్రస్టుకు సంబంధిత శ్రీసాయి దేవాలయములలో ప్రతి గురువారము, శ్రీసాయినాథుల వారికి, ప్రత్యేక అభిషేకము, ధునిపూజలు, పారాయణ, నామజపాలు మొదలైన పూజాదిక కార్యక్రమాలు నిర్వహించటమైనది.

సామాజిక సేవలో భాగంగా శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం పేరిట ప్రతినెల 60 మంది అతినిరుపేద, దివ్యాంగుల, వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, శ్రీకాకుళంలో రిమ్స్ ఆసుపత్రిలో నిరుపేద రోగులకు జరిగే నిత్యాన్నదానానికి, ప్రతి వారము అవసరమైన కూరగాయలు మరియు అరసవిల్లి, శ్రీకూర్మం పరిసర ప్రాంతాలలోని అతినిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, శ్రీకాకుళంలోని వృద్ధులకు నిత్యాన్నదాన సమితివారికి అవసరమైనప్పుడు నిత్యావసర వస్తువులు కూరగాయలు మరియు మహాలయపక్షాలు సందర్భముగా, అరసవిల్లిలోని శ్రీ లలిత త్రిపురసుందరి నిత్యాన్నదాన సమితి వారికి, పక్షం రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు, కూరగాయలు మొదలైనవి అందజేయటమైనది. ఈ ప్రధానమైన కార్యక్రమాలతో పాటు సమయానుకూలముగా, అవసరమైనచోట, అవసరమైన వారికి నిత్యావరస వస్తువులు, వస్త్రాలు మొదలైనవి ట్రస్టు తరపున అందజేయటమైనది.

మేము చేసే సామాజిక సేవా కార్యక్రమాలకు సహృదయముతో ఇతోధికముగా ధన, వస్తు రూపేణా సహాయ సహకారములు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనములు, హృదయపూర్వకంగా మీరందించే ప్రతి చిరు సహాయము పదింతలుగా భావిస్తూ, తగురీతిన అందరికీ అందించే విధముగా నిరంతరం మాకృషి కొనసాగిస్తామని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాము.

సహాయ సహకారములందిస్తున్న ప్రతి ఒక్కరికీ శ్రీదత్తసాయి భరద్వాజులు తమ కృపానుగ్రహముతో మరింతగా ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని కోరుకుంటూ, చేయూతనిచ్చిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము. మరిన్ని వివరాలకు ఆధ్యాత్మిక సామాజిక సేవా శీర్షిక - 21వ పేజీలో చూడగలరు.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| శ్రీమతి పి. వాణి సుబ్రహ్మణ్యరెడ్డి, సూళ్ళూరుపేట | 11001/- |
| శ్రీ వి. దుర్గాదాసు, చెన్నై, తమిళనాడు | 10000/- |
| శ్రీ సిహెచ్. నరసింహరావు, హైదరాబాదు | 7000/- |
| శ్రీ ఓలేటి కుమార్, జంగారెడ్డిగూడెం | 6000/- |
| శ్రీమతి హైమ అప్పలరాజు, ఎన్.టి.పి.సి, వైజాగ్ | 5500/- |
| శ్రీ యస్. రవికుమార్, శ్రీకాకుళం | 5000/- |
| శ్రీమతి కావ్య | 5000/- |
| శ్రీమతి బి. వాణి సత్యసాయి, ఉక్కునగరం, వైజాగ్ | 4000/- |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీనగర్, వైజాగ్ | 3000/- |
| శ్రీ పట్టాభిరామయ్య, న్యూఢిల్లీ | 2500/- |
| ఒక సాయిభక్తుడు | 2012/- |
| చి॥ బి. సాయిప్రణీత్, చెన్నై, తమిళనాడు | 2000/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 1212/- |
| శ్రీ వై చిరంజీవిరావు, విజయవాడ | 1116/- |
| శ్రీ యమ్.ఎస్. ఎన్.మూర్తి, హైదరాబాదు | 1116/- |
| శ్రీమతి ఆర్. అన్నపూర్ణ అప్పలరాజు, ఆర్.ఆర్.వి. పురం, వైజాగ్ | 1000/- |
| శ్రీ టి. శ్రీను, గాజువాక, విశాఖపట్నం | 1000/- |
| శ్రీమతి బి. సరస్వతి అప్పారావు, ఉక్కునగరం, వైజాగ్ | 1000/- |
| శ్రీ నరసింహం, విశాఖపట్నం | 900/- |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 750/- |
| శ్రీ సిహెచ్. త్రినాథ్, అనకాపల్లి | 730/- |
| శ్రీ పి. పార్థసారధి, అనకాపల్లి | 730/- |
| చి॥ సాయిసూరజ్ | 501/- |
| శ్రీ పి. వెంకటేశ్వరరావు, ఉక్కునగరం | 500/- |
| శ్రీ జె. సాయిబాబు, శ్రీకాకుళం | 400/- |
| శ్రీ సింగారి హరిష్, నల్లపాడు, గుంటూరు | 300/- |
| శ్రీ జె. సాయి, శ్రీకాకుళం | 110/- |

## అక్షర యజ్ఞానికి చేయూత


శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు, శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగాజరిపే సామాజిక సేవాకార్యక్రమాలు మరియు శ్రీ భరద్వాజ సద్గురువాణి ద్వారా వేలాది భక్తుల జ్ఞాన తృష్ణతీర్చే అక్షరయజ్ఞానికి తమవంతు సహకారముగా

| | |
|---|---|
| శ్రీ కె. కరుణారెడ్డి, యు.ఎస్.ఏ | 82046/- |
| శ్రీ బి. రఘు, సాయిజయ ఎంటర్‌ప్రైజస్, విశాఖపట్నం | 10000/- |
| శ్రీ యస్. జయరామప్ప, అనంతపురం | 1000/- |

అందజేయటమైనది. వారి సహృదయతకు ధన్యవాదాలు అర్పిస్తూ శ్రీ దత్తసాయి భరద్వాజుల కృపానుగ్రహముతో వారు మరింతగా ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలలో పాల్గొనే శక్తిని ప్రసాదించమని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరొక్కసారి కృతజ్ఞతాభివందనములతో

**మేము సహితమునకు విరాళములు పంపుటకు**
**చిరునామా మరియు బ్యాంక్ అక్కౌంటు**

**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)



# పుస్తక పరిచయం

## శ్రీ గురుదత్త విజయం





శ్రీ దత్త జననం గురించి, శ్రీ దత్తావతారాలు, షోడశ అవతారాలు, శ్రీదత్తాత్రేయ, ఆరాధన విధానము, దత్తావతారాల ప్రత్యేకత, ముఖ్యమైన శ్లోకాలతోపాటుగా పురాణాలలో దత్తాత్రేయుడి ప్రస్తావన మొదలైన అమూల్యమైన విషయాల సంపుటి "శ్రీగురుదత్త విజయం". సూక్ష్మంలో మోక్షంలా, శ్రీదత్తాత్రేయుని గురించి తెలుసుకోవాలనే వారందరూ తప్పక చదవాల్సిన పుస్తకము.

**పేజీలు : 27** వెల : రూ. 9/-

**ప్రతులకు :** రచయిత యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు
ప్లాట్ నెం. : 104, శ్రీ సాయిసదన్ అపార్టుమెంట్స్
బృందావన్ కాలనీ ఆర్చి దగ్గర, నిజాంపేట రోడ్డు,
జె.యన్.టి.యు. (కూకట్‌పల్లి), హైదరాబాదు - 500 085
ఫోన్ నెం. : 92472 58886

## శిరిడీ దర్శని





జగద్గురువైన శ్రీ శిరిడీసాయిబాబా దర్శనానికి నేడు లక్షలాదిమంది వెళుతున్నారు. వెల్లువలా పోటెత్తే జనంతో నిండిపోయిన శిరిడీకి వెళ్ళి కేవలం శ్రీసాయిసమాధిని దర్శించుకొని వచ్చేవారు ఎంతోమంది కలరు. దానికి కారణం పూర్తి సమాచారం తెలియక పోవటమే. ఆలోటు తీర్చేదే ''శిరిడీ దర్శిని". శిరిడీ వెళ్ళాలనుకున్నప్పటి నుండి తిరిగి వచ్చే వరకు, ప్రయాణ సౌకర్యాలు, బాబాదర్శన సమయాలు, అక్కడ దర్శించవలసిన ప్రదేశాలు, వసతి భోజన సదుపాయాలు, సంస్థాన్‌సేవలు ఒకటేమిటి శిరిడీ గురించి సమస్త విషయాలు పొందుపరచబడిన చక్కటి పుస్తకం. శిరిడీ వెళ్ళాలనుకునే ప్రతి ఒక్కరికి చక్కటి కరదీపిక "శిరిడీదర్శిని"

**పేజీలు : 27** వెల : రూ. 5/-

**ప్రతులకు :** రచయిత యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు
ప్లాట్ నెం. : 104, శ్రీ సాయిసదన్ అపార్టుమెంట్స్
బృందావన్ కాలనీ ఆర్చి దగ్గర, నిజాంపేట రోడ్డు,
జె.యన్.టి.యు. (కూకట్‌పల్లి), హైదరాబాదు - 500 085
ఫోన్ నెం. : 92472 58886

## సాయిమాస్టర్




మనమధ్య మనలాగే జన్మించి, జన్మ సార్ధకతకోసం అన్వేషించి, జగద్గురువైన శ్రీసాయిని ఆశ్రయించి, తను గృహస్తజీవితంలోనే ఉంటూ, ఫకీరు అయిన శ్రీసాయి బోధించిన సూక్తులకు ప్రత్యక్ష నిరూపణగా మారి, తాను గురువై, సద్గురువై శ్రీసాయి స్వరూపులై లక్షలాది మందికి మార్గదర్శకులైనారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు.


సంసార సాగరంలో మునిగి తేలుతూ కొట్టుమిట్టాడే మనం, సద్గురువు సమాశ్రయము ద్వారా సముద్రపు అలలపై తేలియాడే మహావిష్ణువులా జీవించవచ్చని తాను ప్రత్యక్ష నిరూపణ చేసిన పూజ్య ఆచార్య భరద్వాజగారి సంక్షిప్త జీవితచరిత్ర, బోధనల సమ్మేళన చిరుగ్రంథము. ఎటువంటి సమస్యకైనా చక్కటి పరిష్కారం చూపే మాస్టారి గారి ప్రతిరూపమైన "సాయిమాస్టర్" 13వ ముద్రణ వెలువడింది.

**పేజీలు : 48** వెల : రూ. 10/-

**ప్రతులకు :**

శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్,
C/o. శ్రీ సద్గురు పాదుకాక్షేత్రం, ప్లాట్ నెం. : 13, పవర్‌సిటీ,
పరవాడ (మండలం) విశాఖపట్నం - 531 021
సెల్ నెం. : 9849645224

## శ్రీ శిరిడీసాయి శతకం





శ్రీసాయి ప్రేరణతో, శ్రీ వాచస్పతి సుధాకర్ హృదయ లోతుల్లోనుండి జాలువారి శ్రీశిరిడీసాయిపై వ్రాసిన 100 పద్యాల సంపుటి

**ప్రతులకు :**

రచయిత వాచస్పతి సుధాకర్
సెల్‌ఫోన్ నెం. : 8954515045

# స్ఫూర్తిప్రదాత - శ్రీ బి.వి. నరసింహస్వామి

తమిళనాడు రాష్ట్రంలోని ఎరోడ్ జిల్లాలోని భవాని పుణ్యక్షేత్రంలోని తమిళ అయ్యంగర్ కుటుంబానికి చెందిన శ్రీ వెంకటగిరి అయ్యర్, శ్రీమతి అంగాని అమ్మాళ్ దంపతులకు 1874వ సంవత్సరం ఆగష్టు 21వ తేదీ శ్రావణపంచమి నాడు మగశిశువు జన్మించాడు. శ్రీ నరసింహస్వామి అనుగ్రహంతో పుట్టిన ఆబాలునికి తల్లితండ్రులు నరసింహ అయ్యర్ అని పేరు పెట్టేరు. కాళహస్తిలోని సొరకాయల స్వామి భక్తులు అయ్యర్ కుటుంబీకులు. సనాతన సంప్రదాయ కుటుంబంలో పుట్టిన శ్రీ నరసింహ వాటిని పాటిస్తూనే, అన్ని మతాలలోని సారాన్ని గ్రహించి పరమత సహనం, భూతదయ కలిగిఉండేవారు. దానికి వారి తల్లితండ్రుల సహకారము కూడా తోడయింది.



1890లో చిన్న వయస్సులోనే కాళ్ళకూర్చి వైద్యనాథ్ అయ్యర్, శాంతి దంపతుల ఏకైక కుమార్తె, సీతాలక్ష్మితో శ్రీ నరసింహకు వివాహం అయింది. అటుపిమ్మట మద్రాసులోని క్రిస్టియన్ కాలేజీలో ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి, 1895లో 'లా' డిగ్రీ కూడ పొంది తిరిగి సేలం వచ్చి తను న్యాయవాది వృత్తి చేసస్తూ, అపారమైన పేరుప్రఖ్యాతులు పొందేరు. కేవలం వృత్తిలో గడించిన కీర్తి సంపదలతో తృప్తిపడక, అనేక సామాజిక కార్యక్రమాలలో, రాజకీయ ఉద్యమాలలో పాల్గొనేవారు. అత్యంత నిజాయితీ పరులుగా పేరుగన్న శ్రీ నరసింహ అయ్యర్ తన నిత్యానుష్టానములను ఏనాడు మానలేదు. అద్భుత ప్రతిభా పాటవాలు కలిగిన శ్రీనరసింహ అయ్యర్ మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా1920 వరకుకొనసాగేరు. తమిళ, సంస్కృత, ఇంగ్లీషు భాషలలోని ఆయన అపారమైన ప్రతిభా పాటవాలు, ఆయా భాషలలోని వారి ఉపన్యాస ధోరణి, సామాజిక స్పృహ, సమకాలీన అంశాలపట్ల అవగాహన గ్రహించి, తమిళనాడు రాష్ట్రంలోని అనేక సభలకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించేవారు. వీరికి వెంకటరామన్, రాజ్యలక్ష్మి, శారదాంబాళ్,జయరామన్, సావిత్రి అనే ఐదుగురు సంతానం కాగా, మొదటి ముగ్గురు వివాహితులుకాగా, చిన్న వాళ్ళైన జయరామన్, సావిత్రి మాత్రమే వీరితో ఉండేవారు.

1915 సంవత్సరము నాటికి శ్రీ నరసింహ అయ్యర్ శక్తి సామర్థ్యాలు, పేరుప్రఖ్యాతులు, సంపద అత్యుత్తమ స్థాయికి చేరుకున్నాయి. సేలం సమీపంలోని శివస్వామి మఠంలో, మహరాజ్ భవంతితో సమానమైన భవనం నిర్మించుకొని, కారు, బంగ్లా, సేవకులతో అత్యంత వైభవంగా జీవించారు. 1917లో ప్లేగువ్యాధి విజృంభించటముతో దాదాపు 40 లక్షల మంది చనిపోయారు. అందులో సేలంలో మొదటగా ఆ వ్యాధికి బలైన వ్యక్తి, శ్రీ నరసింహ అయ్యర్ తల్లి, దానితో కృంగిన శ్రీనరసింహకు, 1918లో కలరావ్యాధితో తండ్రి వెంకటగిరి అయ్యర్ మరణించటము మరొక విషాద ఘటన. ఈ పెను విషాదాలతో కలత చెందిన శ్రీ నరసింహ అయ్యర్ వీలయినంతగా సాంఘిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో మునిగిపోయేవారు. 1921వ సంవత్సరము ఏప్రిల్‌లో ఇంటివద్ద తల్లి శ్రాద్ధకలాపనలో శ్రీ నరసింహ అయ్యర్ మునిగి ఉండగా, పెరట్లో సగం తవ్విన దిగుడు బావిలో 15 సంవత్సరాల తన చిన్న కొడుకు జయరామన్, 13 సంవత్సరాల కుమార్తె సావిత్రి ఒకేసారి బావిలో పడి మరణించారు. ఒకేసారి ఇద్దరు పిల్లలు మరణించటంతో 47 సంవత్సరాల శ్రీ నరసింహ అయ్యర్ జీర్ణించుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైనారు. ఆ దిగులుతోనే ఆయన భార్య శ్రీమతి సీతాలక్ష్మి 1922వ సంవత్సరములో మరణించారు. అంతటితో పూర్తిగా తన జీవితాన్ని ఆధ్యాత్మికం వైపు మరలించుకోవాలని నిర్ణయించుకున్నారు శ్రీ నరసింహ అయ్యర్. అప్పటికే తన గురువైన శ్రీ సొరకాయలస్వామి (శ్రీకాళహస్తి) దేహంవీడి ఉండటంతో, శృంగేరిలోని శంకరాచార్య పీఠం చేరి, జగద్గురు శ్రీ శంకరాచార్య శ్రీ చంద్రశేఖరభారతీస్వామి వారి సన్నిధికి చేరి సన్యాసదీక్ష కోరగా, వారు తిరువన్నామలై వెళ్ళి శ్రీ రమణమహర్షిని దర్శించమని ఆదేశించారు. వారి ఆదేశానుసారం, తిరువన్నామలై చేరి కొండపై స్కంధాశ్రమములో ఉండి, బ్రాహ్మణస్వామిగా భక్తులచే పిలువబడే శ్రీ రమణమహర్షి సన్నిధి చేరేరు. 1926 జనవరిలో రమణాశ్రమము చేరిన శ్రీ నరసింహస్వామి, భగవాన్ శ్రీ రమణమహర్షి ఆదేశంతో "నేను ఎవరు" అనే దానిని ధ్యానిస్తూ, ఒక గుహలో ఉండిపోయారు. ఆ సమయంలోనే శ్రీ కావ్యకంఠ గణపతిముని, మహన్ శేషాద్రిస్వామితో అత్యంత సన్నిహితం ఏర్పడి, శ్రీ రమణ భగవాన్ గురించి అనేక విషయాలు తెలుసుకొని, శోధించి, సేకరించి, 'సెల్ఫ్‌రిలైజేషన్' అనే గ్రంథ రూపంలో ప్రపంచానికి అందించారు. అంతవరకు భగవాన్ రమణమహర్షి మహత్యం కొంతవరకే పరిమితమైనది, ఈ గ్రంథం ద్వారా విశ్వవ్యాప్తమై వెల్లువలా భక్తులు శ్రీ భగవాన్ చెంతకు రాసాగేరు. 1929లో ఆగష్టు నెలలో, శ్రీ నరసింహస్వామి భగవాన్ శ్రీ రమణమహర్షి చెంతకుచేరి, "తనకు మనశ్శాంతి ఎప్పుడు కలుగుతుంది" అని ప్రశ్నించారు. శ్రీ నరసింహస్వామివైపు తదేకంగా చూసిన శ్రీ రమణులు "నేను నీ గురువును కాదు, నీ గురువు ఉత్తరాదిన నీకోసం ఎదురుచూస్తున్నారు. ఆయన వలన నీకు సాక్షాత్కారం లభిస్తుంది" అని బదులిచ్చారు.

భగవాన్ అనుమతి, ఆశీస్సులతో రమణాశ్రమము వదిలి తన ప్రయాణం కొనసాగించిన శ్రీ నరసింహస్వామి, హుబ్లీలోని సిద్ధ పురుషులైన శ్రీ గురుసిద్ధారూఢస్వామిని దర్శించుకొని అక్కడ కొంతకాలం ఉన్నారు. 1930లో శ్రీ సిద్ధారూఢస్వామి సమాధి చెందటం వలన ఆశ్రమం వదలి తన అన్వేషణ కొనసాగించేరు. 1930 ఫిబ్రవరిలో పండరీపురం చేరి అక్కడ భక్తులతో కలసి మరాఠీలో భజన పాటలు నేర్చుకొని పాడుకుంటూ, 1931 డిసెంబరులో పండరీపురం విడచి దోవలో అనేక మంది మహాత్ములను దర్శిస్తూ, వారి సన్నిధిలో కొంతకాలం గడిపి, మనశ్శాంతి లభించక, అన్వేషణ కొనసాగించేరు. 1933లో ఖేట్‌గామ్‌లోని శ్రీ నారాయణ మహరాజ్ ఆశ్రమం చేరేరు. మహరాజ్‌ను దర్శించుకొని, పరిభాషలో

"స్వామి నేను ముత్యాలు, పగడాలు వంటి విలువైన రాళ్ళ వ్యాపారం చేసే వర్తకుడిని, కాని నేనెంతో దురదృష్టవంతుడిని, నాకు ఎన్నో విలువైన వజ్రాలు లభించాయి. అయితే అవేవి నన్ను తృప్తిపరచలేదు. నాకు శుద్ధమైన, పెద్ద విలువైన మంచి వజ్రం లభించేలా మీరు నన్ను ఆశీర్వదించండి" అని ప్రార్థించారు శ్రీ నరసింహస్వామి. సద్గురు ఖేట్ నారాయణ మహరాజ్ ఒక్క క్షణం ఆలోచించి "నీ కోరిక తప్పకుండా తీరుతుంది'' అని చెప్పేరు. అటుపిమ్మట శ్రీ నరసింహస్వామి మెహరాబాద్‌లోని అవతార శ్రీ మెహర్‌బాబాను దర్శించుకున్నారు. అప్పటికే మౌనంలో ఉన్న అవతార మెహర్‌బాబా, ఆధ్యాత్మిక మార్గ దర్శనం కోసం ప్రార్థించిన శ్రీ నరసింహస్వామికి ఒక పలకమీద సంస్కృతంలో "నేను నీగురువును కాదు, నీ గురువు ఉత్తరాదిన నీకోసం ఎదురు చూస్తున్నారు" అని వ్రాసి చూపించారు. వారి ఆశ్రమంలో సాకోరిలోని శ్రీ ఉపాసనీ బాబా గురించి విన్న స్వామి, 1934వ సంవత్సరం మార్చి నెలలో సాకోరిలోని స్మశానం ప్రక్కన ఉన్న ఉపాసనీ మహరాజ్ ఆశ్రమం చేరి శ్రీ ఉపాసనీ బాబాను దర్శించుకున్నారు. ఆయనను చూస్తూనే "నేను ఎంతో కాలంగా నీగురించి ఎదురుచూస్తున్నాను" అని ఉపాసనీ బాబా స్వాగతించారు. ఉపాసనీ బాబా బోధనలకు ఆకర్షితులైన శ్రీ నరసింహస్వామి అక్కడ కొన్ని నెలలపాటు ఉన్నారు. ఎన్నో సంవత్సరాల సాధన ద్వారా శ్రీ ఉపాసనీబాబా సాధించిన ఆధ్యాత్మిక ప్రగతిని గురించి "ద సేజ్ ఆఫ్ సాకోరి" అనే గ్రంథం రచించారు శ్రీ నరసింహస్వామి.

1936వ సంవత్సరములో ఆగష్టు 29వ తేదీ శ్రావణపౌర్ణమినాడు తన గత కాలపు స్మృతులు గుర్తుకు రాగా, 11 సంవత్సరములపాటు మనశ్శాంతి కోసం చేసిన పర్యటనలో తనకు సంపూర్ణత్వం ప్రసాదించే గురువు దొరకలేదు, ఇంక తిరిగి మద్రాసులోని తన పెద్ద కుమారుడైన వెంకట్రామన్ చెంత శేషజీవితం గడుపుతూ వాళ్ళకు ఆనందం కలిగించాలని నిర్ణయించుకొని, ఉపాసనీబాబా ఆశ్రమం వీడి, అక్కడి స్మశానందాటి, ముందుకు సాగగా ఆరడుగుల పొడవు, దృఢకాయుడైన ఒక పఠాన్ ఎదురుపడి " ఓ మద్రాసీ సాధువు ఎక్కడికి వెళుతున్నావు" అని అడగగా, నేను ఆధ్యాత్మిక అన్వేషణలో కొన్ని సంవత్సరాలు పర్యటన చేశాను. ఇప్పుడు నేను "నా ఊరికి వెళ్ళిపోతున్నాను" అని జవాబిచ్చారు. అందుకు ఆ పఠాన్ "నువ్వు ఎలాగు వెనక్కి వెళ్ళిపోతున్నావు. వెళ్ళేముందు శిరిడీలో ఉన్న శ్రీసాయిబాబా సమాధిని ఒక్కసారి దర్శించుకొని వెళ్ళు, బహుశ అది నీకు ఆధ్యాత్మికంగా మేలు చేయవచ్చు" అన్నారు. "ఇప్పటికే నేను హజరత్ బాబాజాన్, తాజుద్దీన్ బాబా, మొయిద్దీన్‌చిస్తీ మొదలైన మహాత్ముల దర్గాలను దర్శించాను. అవేవి నన్ను ప్రభావితం చేయలేదు. ఇప్పటికి 18 సంవత్సరాల క్రితం 1918లో సమాధి చెందిన ఆయన సమాధి నాకేమి మేలుచేస్తుంది'' అని పఠాన్ మాటను తోసిపుచ్చారు శ్రీనరసింహస్వామి. "నువ్వు ఒక్కసారి శిరిడీ వెళ్ళు, బాబా నేటికీ సజీవులై తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు, నీ ఆధ్యాత్మిక పురోగతికి తప్పకుండా ఆయన సహాయపడగలరు" అని మరింత పట్టుదలగా చెప్పేరు ఆపఠాను. ఆయన నుంచి తప్పించుకోవాలని "సరే" అని చెప్పి చితలీ రైల్వేస్టేషను వరకు నడిచి వచ్చిన శ్రీ నరసింహస్వామి, అక్కడి నుండి మద్రాసు వెళ్ళే రైలు ఎక్కటానికి సమాయుక్తమైనారు. కాని ఆ పఠాను మాటలు,చెవుల్లో మార్మోగుతుండటంతో, ఇచ్చిన మాట తప్పకూడదు అన్న తత్వం కలిగిన శ్రీ నరసింహస్వామి, తనకు తెలీయకుండానే, దారి మార్చుకొని, సాకోరికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న శిరిడీవైపు తన అడుగులు వేశారు శ్రీ నరసింహస్వామి.

తూర్పున సూర్యుడు క్రమేపీ పైకి ఎగబ్రాకుతున్నారు. అది 1936వ సంవత్సరం ఆగష్టు 29వ తేదీ శ్రావణపౌర్ణమి పర్వదినం శ్రీ నరసింహస్వామి అడుగులు, సాకోరి నుంచి శిరిడివైపు వడివడిగా సాగినయ్యి, మొట్టమొదటసారిగా శిరిడీలో అడుగిడి శ్రీసాయిబాబా సమాధి మందిరమైన బూటీవాడాలోకి అడుగిడేరు శ్రీ నరసింహస్వామి. అప్పుడు సమయం ఉదయం 11 గంటలవుతుంది. శ్రీసాయి సమాధి చెంత అబ్దుల్లాబాబా కూర్చొని, సమాధికి వింజామరతో వీస్తూ ఉన్నారు. శ్రీసాయిసమాధి ప్రథమ దర్శనంతోనే, శ్రీనరసింహస్వామి ఒక్కక్షణం నిశ్చల స్థాణువై ఉండిపోయారు. ఏదో తెలీయని అలౌకికమైన ఆనందంతో అప్రయత్నంగా కళ్ళుమూతబడినయ్యి. మహోజ్వలమైన అగ్ని శిఖవలె శ్రీసాయి తన శరీరంలోనికి ప్రవేశించి అణువణువును ఆలింగనము చేసుకుంటున్న ఆత్మానుభూతితో నిండిపోయింది శ్రీనరసింహస్వామి మస్తిష్కం. శ్రీ నరసింహస్వామి పాత శరీరం ఏమాత్రం అస్తిత్వంలేకుండా పోయింది. లిప్తకాలం ఆత్మసాక్షాత్కారం పొందిన శ్రీనరసింహస్వామి 'స్వామీజీ'గా మారిపోయారు. అప్పటివరకూ అవిశ్రాంతంగా పర్యటింప చేసిన కల్లోల మనస్సు, ఆ క్షణంలోనే నిశ్చలమైపోయింది. స్వచ్ఛమైన, నిర్మలమైన ఆకాశంవలె వారి మనస్సు శాంతిని పొందింది. శ్రీసాయి సంపూర్ణ కృపకు శ్రీనరసింహస్వామి పాత్రులయినారు. వారి హృదయంలో శ్రీసాయి జ్ఞానజ్యోతి వెలిగించబడింది. ఆ అనుభూతి గురించి 1941లో కలకత్తాలో జరిగిన ఒక బహిరంగసభలో స్వామీజీ చెబుతూ – "నా ఆధ్యాత్మిక ఆకలికి శిరిడీ చేరేవరకు ఆహారం దొరకలేదు, శిరిడీలో నేను స్వీకరించగలిగిన దానికంటే ఎంతో ఎక్కువగా బాబా నాకు ప్రసాదించారు. చివరకు నేను సద్గురువును కనుగొన్నాను, నేను, సమర్థ సద్గురువు సాయినాథ్ మహరాజ్ ఎల్లప్పుడూ అనుసంధానం కలిగి ఉంటాము". శ్రీ నరసింహస్వామి అంతులేని ఆధ్యాత్మిక దాహం, సద్గురువు అన్వేషణ, శ్రీ శిరిడీసాయి సమాధి దర్శనంతో పరిపూర్ణమయింది. నాటి నుండి తాను పొందిన శ్రీసాయి అనుగ్రహము అనే గొప్పనిధిని సర్వులకు పంచటానికి సమాయుక్తమయినారు. తద్వారా, శ్రీశిరిడీసాయి లీలావిలాసాలు, మహారాష్ట్ర దాటి దేశమంతటా వ్యాప్తి చెందటానికి కారకులై లక్షలాది మందికి స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శకులై నిలచారు శ్రీ బి.వి. నరసింహస్వామి.

రెండు దశాబ్దాలపాటు నిర్విరామంగా శ్రీ శిరిడీసాయిఖ్యాతిని, మహత్యాన్ని వెల్లడి చేయటంలో శ్రీ స్వామీజీ చేసిన అద్వితీయ కృషి గురించి వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

సౌజన్యం : **శ్రీ నరసింహస్వామి చరిత్ర**

రచయిత : **డా॥ ఆర్. విజయకుమార్** (బెంగుళూరు)

(తిథి ప్రకారం అశ్వయుజ పూర్ణిమ అక్టోబరు 20వ తేదీ బుధవారం (తేదీ ప్రకారం 18-10-1956) శ్రీ బి.వి. నరసింహస్వామివారి ఆరాధనోత్సవము సందర్భముగా సవినయ సమర్పణ)

సేకరణ : **"సత్యాన్వేషి"**

# ఆదర్శమూర్తి - ఆచార్య శ్రీ భరద్వాజ

1984వ సంవత్సరములో అక్టోబరు 30వ తేదీ నేను మాస్టరుగారి జయంతికి ఒంగోలు వెళ్ళి అందులో పాల్గొని రాత్రికి అక్కడే ఆగిపోయి, మర్నాడు ఉదయం అయితే మాస్టరుగారు కొంచెం ఖాళీగా ఉంటారు బాగా మాట్లాడవచ్చు అని మాస్టారి దగ్గరకు వెళ్ళాను. వారితో సద్గోష్టి అయ్యాక, నాకు ఇంకో రోజు శెలవుంది ఎక్కడికి వెళ్ళమంటారని అడిగేను. "గొలగమూడి వెంకయ్యస్వామి గారిని దర్శించావా" అని అడిగేరు. ఇంతవరకు దర్శించలేదు అని చెప్పాను. "ఆయన కారణజన్ముడు, ఆజన్మసిద్ధుడు ఇక్కడకు దగ్గరలో నెల్లూరులోని గొలగమూడిలోని వారి సమాధి దర్శనం చేసుకొని వెళ్ళు" అన్నారు. అలాగే అన్నాను. అక్కడ స్వామి శిష్యులయిన శ్రీగురవయ్యగారికి, శ్రీనాగయ్య గారికి ఇక్కడ జయంతి కార్యక్రమాలు బాగా జరిగాయని చెప్పు అంటూ ఒక కాగితం పొట్లం నా చేతుల్లో పెట్టి ఇది శ్రీవెంకయ్య స్వామి గారికి సమర్పించు అన్నారు. అందులో కొంత డబ్బు పొట్లం కట్టేరు అని అనుకొన్నాను. సరే అని వెంటనే ఒంగోలు నుండి నెల్లూరు ట్రైను ఎక్కాను. సాయంత్రం నాలుగు గంటలవుతున్నది. ఇంతలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఎవరో కాల్చిచంపారన్న వార్త రైల్లోనే గగ్గోగ్గలుగా చెప్పుకొంటున్నారు. నెల్లూరులో దిగి మద్రాస్ బస్టాండుకి చేరేను. ప్రదర్శనలు, రాస్తారోకోలు, బంద్‌లు మొదలుపెట్టారు. గొలగమూడి బస్సు వస్తుందా! అని వాకబుచేశాను. అప్పట్లో ప్రవేటు బస్సే తిరుగుతూ ఉండేది. ఏమో ఆదివారం కదా గొలగమూడి నుంచి, వచ్చాక మళ్ళా వెడుతుందో లేదో చెప్పలేం అన్నారు. చీకటిపడిపోయింది. బస్సురాలేదు. వెనక్కి వెళ్ళిపోదాం అంటే, మాస్టరుగారు స్వయంగా దక్షిణ ఇచ్చి వెంకయ్యస్వామి వారికి సమర్పించమన్నారు కదా, దానిని నాతో కూడ కాకినాడ తీసుకొని వెళ్ళిపోతే మరలా ఉద్యోగ బిజీతో ఎంతకాలానికి గొలగమూడి రావడం వీలవుతుందో తెలియదు. "మాస్టరుగారిచ్చిన దక్షిణ ఎలాగైనా వెంకయ్యస్వామి వారికి చేర్చే ప్రయత్నం చేయవలసిందే" అని నిశ్చయించుకొన్నాను. ఒక లాడ్జిలో గది తీసుకొని రాత్రికి ఆగిపోయి, మర్నాడు ఉదయం ప్రయత్నం మొదలెట్టాను. నెల్లూరు అంతా బంద్. బస్సులు కార్లు తిరగవు అన్నారు. అప్పట్లో ఆటోలు ఇంకారాలేదు. రిక్షా ఏదైనా వస్తుందేమో అని అడుగుతున్నాను. అబ్బే చాలా దూరం రాలేము అని చెప్పారు. ఏం చేయాలో పాలుపోలేదు. మాస్టరుగారిని, శ్రీసాయిని, శ్రీస్వామిని తలచుకొని అడిగాను. రిక్షాఅతను ఎంతడిగినా ఇద్దాం అనుకున్నాను. ఒక అతను వస్తానన్నాడు. రానుపోను బాడుగ మాట్లాడుకొని రిక్షాలో గొలగమూడి వెళ్ళాను. బంద్‌మూలాన అక్కడ వచ్చేపోయే వాళ్ళు ఎవరులేరు. నాగయ్యగారు, గురవయ్యగారు కనబడ్డారు. నమస్కారం చేశాను. ఒంగోలు మాస్టరుగారు పంపితే వచ్చానన్నాను. వాళ్ళు ఆశ్చర్యపోయారు ఇంతవరకు ఇక్కడికి నెల్లూరు నుంచి రిక్షామీద వచ్చిన వారెవరూ లేరన్నారు. వెంకయ్యస్వామి గారి సమాధి దర్శనం చేసుకొని, మాస్టరుగారిచ్చిన కాగితం పొట్లం సమర్పించి, అక్కడి వారితో ముచ్చటించి మరలా



అదే రిక్షాలో మధ్యాహ్నానికి నెల్లూరు రైల్వేస్టేషన్‌కి వచ్చి కాకినాడ చేరేను. అసలు నేను చేసిన గొలగమూడి ప్రయాణం తలచుకొంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. పూజ్య మాస్టరుగారు దక్షిణ ఇచ్చి ఆశీర్వదించి పంపడం వలననే గొలగమూడి దర్శనం చేసుకోగలిగాను. లేకపోతే వెనక్కి వచ్చేసేవాడిని. అందుకే మాస్టరుగారు దక్షిణ ఇచ్చి పంపించారని అర్థమైంది.

ఒక ఆదివారంనాడు ఒంగోలులో రమణారెడ్డి గారింట్లో (వారు ఫెర్టిలైజరు డీలర్ అని గుర్తు) మాస్టరుగారు నిర్వహించిన సత్సంగమునకు కాకినాడ నుంచి వచ్చాను. ఆరోజు మాస్టరుగారు "సాయినాథపూజ" గ్రంథంలోని ఉదయ ప్రార్థన మా అందరి చేత చెప్పించి చేయించారు. అయితే ప్రార్థన చివరలో ఆగ్రంథంలో లేని వాక్యం ఒకటి చెప్పించారు. అది "మాకు గురువు అవ్వాలనే గుబులు (అంటే దురద అన్నమాట) నశించుగాక!" అనే వాక్యం. ఇలా కూడా ప్రార్థించుకోవాలా అని ఒక ప్రక్క ఆశ్చర్యం కలిగింది. మరోప్రక్క మాస్టరుగారు హాస్యంగా చెప్తున్నారా అనిపించింది. మనం ఎవరం గురువు అయిపోవాలని అనుకోవడంలేదు కదా అనుకొన్నాను. కాని భక్తుల యొక్క భవిష్యపోకడలను అంచనా వెయ్యగలిగిన మాస్టరుగారు అర్థవంతంగానే ఆ వాక్యం ఆరోజు చెప్పించారు అని ఇప్పుడనిపిస్తోంది. ఎందుకనంటే మూడు పారాయణలు ఆరుసత్సంగాలు చెయ్యగానే భక్తులనుంచి వచ్చే ఆదరణ చూసి, మురిసిపోయి గురువులైపోయామనే భ్రమలో లేని మాయలో కొందరు పడటం జరుగుతున్నది. అందుకని ముందే హెచ్చరించి, అలా కాకుండా ఉండేందుకు శిక్షణ ఇచ్చారని ఇప్పడనిపిస్తోంది. మాస్టరుగారు ఆయనను గురువు అననిచ్చేవారు కాదు. "నేనందరికి ఏకైక గురువు సాయినాథుడని నెత్తినోరు కొట్టుకొని చెప్తుంటే, నేను గురువనిపించుకొనేందుకు నాది గుండె, చెరువా" అనేవారు మాస్టరుగారు.

ఒకసారి విజయవాడ ఒన్‌టౌనులో ఒక హైస్కూల్‌లో వేసవి శెలవులలో మాస్టరుగారి ప్రవచనములు, సద్గోష్టులు జరిగాయి. సాయిసేవా కార్యక్రమములు అంటే మందిర నిర్మాణములు, దానధర్మాలు, అన్నదానాలు మొదలగునవి మనం తరించే విధంగా ఎలా చెయ్యాలో వివరించారు. ఆ విషయములు తర్వాత పత్రికలో వచ్చాయి. కాని చివరలో ఆయన చెప్పినది ఏమిటంటే "కొన్ని

పర్వదినాలలో కొన్ని ప్రత్యేక స్థలములలో చేసేది మాత్రమే సేవకాదు, సేవాభావం మన సహజ స్వభావంగా మారాలి. ఎవరికి వారు, వారు ఉండే ప్రదేశములో ఎవరు ఏ ఇబ్బందులు పడుతున్నారో తెలుసుకోవాలి, అనారోగ్య సమస్యలు, వృద్ధుల సమస్యలు, పిల్లల చదువులు, పెళ్ళిళ్ళ సమస్యలు, ఆర్థిక సమస్యలు, మనిషిసాయం అవసరమైన సమస్యలు, పైకి చెప్పుకొని సహాయం అడిగేందుకు అభిమానపడే వాళ్ళుంటారు. ముందు మనకు దగ్గరలోని రెండు మూడు వీధుల్లో ఉన్నవారితో కలిసిమెలిసి ఉంటే వాళ్ళ సమస్యలు తెలుస్తాయి. వాటికి తగిన విధంగా మనం అందించగలిగిన మేరకు సహాయ సహకారాలు చేస్తూ ఉంటే, సేవాకార్యక్రమాలు ఇంకా విస్తృతంగా నిరంతరం జరుగుతాయి. అప్పుడది "సేవా యోగం" అవుతుంది. అంతేకాని సంవత్సరంలో ఏ రెండు మూడు సందర్భాలలో అన్నదానాలు మొదలైనవి చేస్తే చాలా స్వల్ప ప్రయోజనమే ఉంటుందని" చెప్పారు. తర్వాత సద్గోష్ఠిలో మాస్టరుగారిని ఇలా అడిగాను. "ఈ జన్మలో కష్టనష్టాలకి కారణం క్రితం జన్మలో అజ్ఞానంతో చేసిన దుష్కర్మలంటారు. మరి ఆజన్మలో అలాంటి కష్టాలకి కారణం అంతకు ముందు జన్మలోని కర్మలంటారు. అసలు ఈ అజ్ఞానం ఎప్పుడు మొదలైంది?" అప్పుడు మాస్టరుగారు ఇలా చెప్పారు. "అజ్ఞానానికి ఆది లేదు, అంతం ఉంది. ఈ అజ్ఞానం ఎన్ని జన్మల క్రిందట ప్రారంభమైందో తెలుసుకొని ఉపయోగంలేదు. సత్కర్మాచరణలో నిలిచి ఉండేందుకు అవసరమైన జ్ఞానమును సద్గురువులు వేయినోళ్ళ బోధిస్తూనే ఉన్నారు. అలా నడచుకొంటే క్రొత్తగా దుష్కర్మలు చేయడం ఆగిపోతుంది. గత జన్మలది స్వయంకృతమని, అవి అనుభవించి తొలగించుకునేందుకు భగవంతుడు అవకాశమిచ్చాడనే భావంతో అనుభవిస్తుంటే, సద్గురు కృపతో వాటి తీవ్రత తగ్గడమో, కాలవ్యవధి తగ్గించడమో, ఓర్పు, సహనంతో తట్టుకొనే శక్తినిచ్చిగాని దాటించేస్తారు. కాబట్టి అజ్ఞానానికి ఆదిలేదని పెద్దలు చెప్పారు. ఎలా అంతమవుతుందో చెప్పారు". సాయినాధుని సంపూర్ణ అనుగ్రహం పొందిన మాస్టరుగారు కూడా జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డారు. అయినా వారు బోధించిన విధంగానే స్వయంగా ఆచరించి చూపించి ఆచార్యులైనారు కదా అని తెలుసుకొన్నాను.

ఒంగోలులో ఒకసారి టాటా వారి కళ్యాణమండపంలో మాస్టరుగారి జయంతి కార్యక్రమములు జరిగాయి. అప్పటి జయంతి విశేషం ఏమిటంటే సాయిప్రసన్న శ్రీ చోడవరపు సాంబమూర్తిగారు (చిక్కడపల్లి, హైదరాబాదు) శ్రీ శ్యామ్‌చరణ్‌గారు (నంద్యాలలో తెలుగు గంగ ప్రోజెక్టులో పనిచేసినవారు), శ్రీ బాపట్ల పార్థసారధిగారు (చెఱువు గ్రామం) వారి వారి శిష్యులతో వచ్చారు. వీరందరూ ప్రముఖ సాయిభక్తి ప్రచారకులు. అక్కడ అందరూ హడావిడిగా మేము ఫలానా వారి శిష్యులం, మేము ఫలానా వారి శిష్యులం అని నలుగురు ప్రముఖుల (మాస్టరుగారి శిష్యులమంటూ కూడ) శిష్యులు ఒకరికొకరు పరిచయం చేసుకుంటూ తిరుగుతున్నారు. ఆసాయంత్రం మాస్టరుగారు ప్రవచనం చేశారు. అందులో ఒక హెచ్చరిక నిర్మొహమాటంగా చేశారు మనందరి శ్రేయోభిలాషియైన మాస్టరుగారు. "మీరు భరద్వాజ గారి శిష్యులమని, వారి శిష్యులమని, వీరి శిష్యులమని చెప్పుకుంటూ తిరిగితే, వారివారి శిష్యులుగానే మిగిలిపోయి, సాయి శిష్యులుగా ఎవరూ కాకుండా పోతారు అని గుర్తుపెట్టుకోండి" (శ్రీసాయినాధుడు మిఠాయి అయితే దానిని చుట్టిన కాగితం పొట్లంలాంటి వాడిని, దాని ఆలంబనతో మిఠాయి ఆస్వాదించండి) అని అన్నారు. ఇందులో ప్రతి అక్షరం మాస్టరుగారు చెప్పినది గుర్తుపెట్టుకొని మరీ ఇప్పుడు చెప్పాను. ఆ ప్రసంగం జరిగినరోజు శ్రీ మన్నవసత్యం, శ్రీ విక్రమ్, శ్రీ శరత్‌బాబు కూడా ఉన్నారు. అంటే "మనం సాయినాధుడినే గురువుగా పెట్టుకొని, సాయిస్మరణే చేస్తూ, సాయి తత్వప్రచారమే చేస్తూ, సాయి శిష్యులుగా మాత్రమే ఉండేటట్లుగా ఎంతో జాగరూకతతో ఉండాలి తప్ప వేరెవరిని వ్యక్తిపూజ చేయవలసిన అవసరం లేదు. మనం ఏ పెద్దల ద్వారా సాయిమార్గాన్ని అందుకొన్నామో వారిపట్ల కృతజ్ఞతాభావమును హృదయంలో నిలుపుకొంటూ, ప్రతి ఒక్కరమూ శ్రీసాయి శిష్యులమే, శ్రీసాయి పరివారమే అనే భావంతో కలసి మెలసి వ్యవహరించాలని" అనేదే మాస్టరుగారి సందేశం.

అది 1988వ సంవత్సరం, అక్టోబరు 30వ తేదీ, మాస్టరుగారు జయంతి ఉత్సవం ఫ్యాన్సీగూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్, ఒంగోలులో జరుగుతున్నది. మాస్టరుగారికి 50 సంవత్సరములు నిండిన సందర్భముగా "మరోనందదీపం" పేరుతో సావనీర్ ప్రింట్ చెయ్యాలనుకొన్నారు భక్తులు. పేరు ప్రఖ్యాతులు, ప్రచారము కోరుకోని పూజ్య మాస్టరుగారు అంగీకరించలేదు. అందుకని అమ్మగారిని అడిగేరు. భక్తుల భక్తి, శ్రద్ధలను, ఉత్సాహమును కాదనలేని కరుణామయియైన అమ్మగారు అందుకంగీకరించారు. సరే దాని ప్రయత్నం మొదలు పెట్టారు. ఆ రోజు భక్తులంతా మాస్టరుగారికి సాయి అష్టోత్తర శతనామాలతో పాదపూజ చేస్తాం అని అడిగారు. మాస్టరుగారు ఒప్పుకోలేదు. "ఈరోజు సాయినామాలతో నన్ను పూజించుకోవాలనే మీ భావం భవిష్యత్‌లో నిలుపుకోవడం కష్టంకావచ్చు. ఈరోజు ఆవేశపూరితమైన భక్తి ఉత్సాహాలతో సాయిస్థానంలో నన్ను నిలిపి పూజచేస్తున్న భావం తర్వాత కాలంలో ఉండకపోవచ్చు. అందుకని చేసేముందు బాగా ఆలోచించుకోండి" అని చెప్పారు. అయినా సరే భక్తులు ఒప్పుకోలేదు. సరే మాస్టరుగారు పళ్ళెంలో కాళ్ళుపెట్టి కూర్చుని, కళ్ళు మూసుకొని సాయిధ్యానంలో మునిగిపోయారు. బాహ్యస్మృతి లేదు. సన్నిహిత భక్తులు పూజ చేయడం మొదలు పెట్టారు. మాస్టరుగారి రూపంలో ఒక అలౌకికమైన తేజస్సు కనపడింది. అప్పటి రూపం నా హృదయంలో ఇప్పటికి ముద్రపడి ఉంది. కాని అదే వారు సశరీరంగా ఉన్నప్పటి ఆఖరి జయంతోత్సవం అవుతుందని ఊహించలేదు. 1989వ సంవత్సరం, ఏప్రిల్ 12వ తేదీన శ్రీసాయిలోఐక్యం చెందారు మాస్టారుగారు.

(అక్టోబరు 30వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా సమర్పణ.)

రచన : **శ్రీ పి. శ్రీరామ విజయభాస్కర్,** నిడదవోలు

# బాల వికాసం - అన్నం పరబ్రహ్మం

భోజనం సరిగా తినకుండా కిందపారవేస్తే పెద్దవాళ్ళు మిమ్మల్ని మందలించటమే కాకుండా "అన్నం పరబ్రహ్మ స్వరూపం అట్లా వృథా చేయకూడదు" అంటారుకదా.. పిల్లలు, అట్లా ఎందుకు అంటారో అనేదానితో పాటు, మనం అన్నం తినటమే కాకుండా, ఇతరులకు దానం చేయటం వలన ఎటువంటి ఫలితమో తెలుసుకుందాము.

ప్రతి జీవికి కావాల్సిన ఆహార పదార్థాలను పుట్టుకతోనే ఈ భూమి మీద భగవంతుడు కల్పిస్తాడు. కాబట్టి ఎవరైనా జన్మించిన తర్వాత నారు పోసిన వాడు నీరు పోయకపోడు అని భగవంతుని గురించి పెద్దలు చెబుతుంటారు. అంటే అమ్మ కడుపులో నుంచి బయటకు రాకముందే మనకు ఇంత ఆహారం అని, ఇన్ని నీళ్లని భగవంతుడు నిర్ణయిస్తాడు. గత జన్మలో చేసిన పాప పుణ్యాలను లెక్కించి వాటికి అనుగుణంగా మనకు సమకూర్చి, ఎవరికి కడుపులో పుట్టాలో కూడా నిర్ణయిస్తాడట. ఆయన సమకూర్చిన అన్న, పానీయాలు ఎప్పుడు నిండుకుంటాయో ఆ జీవికి ఈ భూమి మీద నూకలు చెల్లిపోయినట్లే. అందుకే మీరు తినగా ఉన్న ఆహారాన్ని, తాగే నీటిని వృథా చేయకుండా అవసరమైన వారికి దానంగా ఇవ్వడం వల్ల పుణ్యఫలం పెరుగుతుందట. అలాగే భవిష్యత్తులో మనకు నచ్చిన ఆహారం మరింత లభించి దీర్ఘాయుష్షు కలుగుతుందట. అలా కాకుండా సృష్టికర్త ఇచ్చిన ఆహారాన్ని వృథాచేస్తే ఆయువు క్షీణించి పోతుందట.



ఏతల్లి అయినా తన బిడ్డల క్షీణాన్ని తట్టుకోలేదు. అందుకే అన్నం పారబోయవద్దని ఒకటికి పదిసార్లు చెబుతుంది. అవసరమైతే దండిస్తుంది కూడా. ఇదంతా వివరంగా చెప్పలేక అన్నం పరబ్రహ్మస్వరూపం అని మాత్రమే చెబుతారు మన పెద్దలు. అందుకే అన్ని దానాలలో కన్నా అన్నదానం మిన్న. ఎవరికైనా కోట్లు ఇచ్చినా సంతృప్తి చెందరు కడపునిండా భోజనం పెడితే చాలు అంటారు.

ఏది లోపించినా బ్రతకగలం. కానీ ఆహారం లోపిస్తే బ్రతకలేం. ఏది దానంగా ఇచ్చినా, ఎంత ఇచ్చినా కూడా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కాని అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా చెబుతారు. ఏ దానం ఇచ్చినా దానం తీసుకున్నవారిని మనం సంతృప్తి పరచలేకపోవచ్చు. కాని అన్నదానం చేస్తే మాత్రం దానం తీసుకున్నవారిని పూర్తిగా సంతృప్తిపరచవచ్చు. అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారిని కూడా చూడవచ్చు. అన్నదానం చేయలేకపోయినా అన్నం పెట్టే ఇంటినన్నా చూపించమని పెద్దలు చెప్తారు. దీనికి సంబంధించిన ఒక కథనాన్ని కూడా చెప్తారు. మహాభారత యుద్ధంలో కర్ణుడు మరణించిన తరువాత స్వర్గానికి వెళ్ళేడు. అక్కడ కర్ణుడికి అన్ని సౌకర్యాలు లభించాయి. స్వాగత సత్కారాలు లభించాయి. ఏది కావాలంటే అది పొందే అవకాశం ఉంది. అన్నీ అందుబాట్లో ఉన్నాయి. ఏంలాభం....! కర్ణుడికి ఏదో అసంతృప్తి. ఏదో వెలితి. ఎంత తిన్నా కడుపు నిండినట్టుండటంలేదు. సంతృప్తిఅనేది లేదు. ఎందుకు ఈ విధంగా ఉంటుందో అతనికర్థం కావడంలేదు. ఇదే మాట దేవేంద్రుడిని అడిగాడు కర్ణుడు. అప్పుడు "దేవేంద్రుడు చిరునవ్వుతో, నీవు అనేక దానాలు చేశావని, అడిగినవారికి లేదనకుండా ఇచ్చే దానకర్ణుడివని చెప్తారు. మరి... ఎప్పుడైనా అన్నదానం చేశావా?" అనడిగాడు. దానికి సమాధానంగా లేదు... "నేనెన్నో దానాలు చేశాను గాని అన్నదానం మాత్రం చేయలేదు" అన్నాడు కర్ణుడు. "పోనీ అన్నం పెట్టే ఇల్లయినా చూపించావా?" అనడిగాడు దేవేంద్రుడు. కాస్త ఆలోచించిన కర్ణుడు చెప్పాడు. "అవును. ఓ బీద బ్రాహ్మణుడు నా దగ్గరకు వచ్చి అన్నం పెట్టించమని అడిగాడు. అపుడు నేను ఏదో ధ్యాసలో ఉండి, నాకు అవకాశం లేదు గానీ.... అక్కడ ఆ ఇంటికి వెళ్ళు అని ఒక ఇంటిని చూపించాను" అన్నాడు కర్ణుడు. నీవు అన్నదానం చేసిన ఇంటిని చూపించిన వేలిను నోట్లో పెట్టుకో" అన్నాడు ఇంద్రుడు. సరేనని ఆ వేలిని నోట్లో పెట్టుకుని ఒక్క గుటక వేసాడు కర్ణుడు. ఆ క్షణంలోనే అతని కడుపు నిండిపోయింది. అంతవరకున్న అసంతృప్తి మటుమాయమైంది. ఎనలేని తృప్తి కలిగింది. ఈ కథనం ద్వారా అన్నదానం యొక్క మహత్యం, దాని ప్రాశస్త్యం తెలుస్తోంది. నిత్య జీవితంలో మనం ఎదుర్కొనే అనేక ఇబ్బందులనుండి, ఇక్కట్ల నుండి బయటపడడానికి చక్కటి పరిష్కారంగా పనిచేస్తుంది అన్నదానం అని చెప్తారు పండితులు. అన్నదానం వలన ఎన్ని సమస్యలున్నా పరిష్కారమవుతాయని చెప్తారు. అన్నదానం చేసేటప్పుడు దైవభక్తులకు తాంబూలంతో పాటు దక్షిణ ఉంచి దానం ఇస్తే అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని ప్రతీతి. కొందరు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఎంత ప్రయత్నించినా సరైన రాబడి లేకపోవడం, దానికితోడు

విపరీతమైన ఖర్చులతో సతమతమవడం జరుగుతుంది. అలాంటివారు అన్నంతో పాటుగా లడ్డు పెట్టి, తాంబూల సహితంగా దానం ఇస్తే అధిక ఆదాయం పొందడంతో పాటు శ్రీమంతులయ్యే అవకాశం ఉందని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇక అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దీర్ఘ రోగాలతో సతమతమవుతున్నవారు అన్ని రోగాలు తొలగి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారు. బెల్లం అన్నం దానం చేస్తే శ్రీమంతులవుతారు. భోజనం చేసేముందు మొదటి ముద్దను పరమేశ్వరార్పణం చేసి దానిని కాకులకో, ఇతర పక్షులకో పెడతారు. ఇలా చేయడంవలన భగవంతునికి సమర్పించినట్లు అవుతుంది. ఇక అన్నం తినేముందు కొద్దిగా అన్నాన్ని కాకులకు వేయడం వలన శని దోషాలనుంచి బయటపడవచ్చని కూడా చెప్తారు.

"కాకబలికి సమృద్ధిగా అన్నం బయట విడిచిపెట్టిరా, దేనిని పిలువవద్దు, తరమవద్దు అట్లా చేస్తే నీవు లక్షలాది మందిని సత్కరించినట్లే" అన్నారు శ్రీ శిరిడీసాయిబాబా. మనం అన్నం తినే ముందు అది మనకు అందటానికి కారణమయిన భగవంతుడిని తలచుకొని, ఒక ముద్ద ముందుగా విడిగా తీసి, మిగిలింది భగవంతుడి ప్రసాదంగా స్వీకరించాలి. తినేముందు భగవంతుడికి అర్పించి మనం స్వీకరిస్తే అది ప్రసాదం అవుతుంది, మనం తిన్న తరువాత, మిగిలింది బయట పెడితే అది ఎంగిలి అవుతుంది. పుట్టినరోజునాడు తండ్రి పిల్లవాడికి ఇచ్చిన చాక్లెట్లలో ముందు ఒకటి తన తండ్రికి ఇస్తే ఎంతో మురిసిపోయి, మరొకసారి ఇంకా అధికంగా, ఉత్తమమైనది బహుకరించటానికి ప్రయత్నిస్తాడు. అట్లా కాకుండా, తాను తిని, అందరికీ పంచి మిగిలింది తండ్రికి ఇస్తే, మరుసటిసారి, మరిన్ని తక్కువచేసి ఎట్లా ఇస్తాడో, అదే విధంగా ముందుగా భగవంతుడికి అర్పణచేసి మిగిలింది ఆయన ప్రసాదంగా స్వీకరించటము ద్వారా, అది ప్రసాదించిన భగవంతుడిపట్ల కృతజ్ఞత కలిగి ఉంటాము. తద్వారా వారి కృపకు పాత్రులవుతాము. "నాకు అర్పించకుండా ఎవరు ఏమీ తినరో వారికి నేను బానిసను" అన్నారు శ్రీ సాయిబాబా. కనుక మనం తినే ప్రతీది బాబా ప్రసాదమని భావించి, ముందుగా ఆయనకు సమర్పించి వృథాచేయకుండా మనము తీసుకోవటమే కాకుండా, ఆకలిగొన్నవారికి ఉన్నదానిలో ఆహారం అందించటానికి ప్రయత్నించి బాబాకృపకు పాత్రులవుదాము. ఏమంటారు పిల్లలు?

విజయదశమి శుభాకాంక్షలు

– శ్రీమతి వి.యస్. లక్ష్మి

## నైవేద్యం

నైవేద్యం రెండు రకాలు. అవసర నైవేద్యం, మహానైవేద్యం. కొబ్బరికాయ, అరటిపండ్లు తదితరమైన ఫలాలతో పాటు పాలు, పెరుగు మొదలైనవి సమర్పించే నైవేద్యాన్ని అవసరనైవేద్యమని, భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయాలతో అర్పించే పంచభక్ష్యాలను మహా నివేదన (నైవేద్యం) అని అంటారు.

ఓం శ్రీ సాయినాథాయనమః | ఆహ్వానము | శ్రీ భరద్వాజ గురవేనమః



# దత్తజయంతి మహోత్సవములు



**వేదిక**

**శ్రీ సద్గురుపాదుకాక్షేత్రం**

ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, పరవాడ (మం), విశాఖ - 21



**తేదీలు**

**2021 డిసెంబరు 16, 17 మరియు 18**

**(గురు, శుక్ర మరియు స్థిర వారములు)**


**దత్త జయంతి మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు**

**2021 డిసెంబరు 16, 17 మరియు 18 (గురు, శుక్ర మరియు, స్థిర వారములు) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు**

ప్రతి రోజూ భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం శ్రీ గురుచరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, **16వ తేది** శ్రీ గురుచరిత్ర పై సత్సంగమము, **17వ తేది** శ్రీగురుచరిత్ర సామూహిక ఏకాహ పారాయణ, **18వ తేది** శ్రీ దత్తాత్రేయుడి క్షీరాభిషేకం, గురుపూజలు మరియు వివిధ సామాజిక సేవ మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును.

గమనిక : కోవిడ్ 19 నియమ నిబంధనలను అనుసరించి నిర్వహించబడే కార్యక్రమములలో తదనుగుణముగా పాల్గొనగోరుతున్నాము.

నిర్వహణ : **శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు** (రిజిష్టర్డు)
ప్లాట్ నెం. 13, పవర్‌సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర, పరవాడ (మం) విశాఖ - 531 021.
సెల్ : 9849645224




**పంచభక్ష్యాలు :** ఆహారము తీసుకుంటున్నాము అంటే కేవలం కడుపు నింపుకోవటానికి మాత్రమే కాకుండా వండటము, వడ్డించటము, ఆ వండిన పదార్థములను తీసుకోవటము వరకు మన పూర్వీకులు కొన్ని శాస్త్రీయ ప్రాతిపదికలను ఏర్పరచారు. కుంతకాలు, రదనికలు, అగచర్వణకాలు, చర్వణకాలు అనే నాలుగు రకాలైన దంతాలతో ఆహారాన్ని తీసుకునే విధముగా ఆహారము తీసుకోవాలని శాస్త్రవిధి. తద్వారా తీసుకున్న ఆహారము రుచితోపాటు శక్తిని, తృప్తిని కలుగచేస్తుంది. "తీసుకునే ఆహారము మనలను ఆరోగ్యయోగయుక్తునిగా చేయమని" ప్రార్థిస్తూ ఆహారం తీసుకోవాలంటారు ఆచార్య శ్రీ భరద్వాజగారు. ఇక పంచ భక్ష్య పరమాన్నాలు అంటే ఏమిటో తెలుసుకుందాము.

ఐదురకాలైన ఆహార పదార్థాలతో కూడిన దానిని పరమాన్నము అంటారు. ఇవే పంచభక్ష్యాలు.

**1. భక్ష్యం :** కొరికి తినే గారెలు, బూరెలు, అప్పాలు మొదలైనవి

**2. భోజ్యం :** నమిలి తినే పులిహోర, దద్దోజనం మొదలైనవి. వీటి ద్వారా దంతాలు గట్టిపడి వాటికి బలం చేకూరుతుంది.

**3. చోష్యం :** జుర్రుకుని త్రాగే పాయసం, దప్పళం, చారు మొదలైనవి తద్వారా ఆకలి పెరిగి జీవక్రియకు దోహదపడుతుంది.

**4. లేహ్యం :** నాలుకతో తీసుకొబడేవి. తేనె, బెల్లంపాకం, చలివిడి మొదలైనవి. తద్వారా రుచి పెరగటమే కాకుండా, శక్తికరమైన ఆహారం తీసుకోవటం అవుతుంది.

**5. పానీయం :** త్రాగేవి నీళ్ళు, పళ్ళరసం వంటివి. తద్వారా జీర్ణశక్తి మెరుగవుతుంది.

## భోజనం చేసే విధానము :

నేలపై ఆసనం (పీటగాని, చాపగాని) వేసుకొని, వడ్డించిన ఆహారాన్ని చేతితో కలుపుకొని తినటం ద్వారా జీవశక్తి ఉత్తేజితమై తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. అందుకు కారణం బొటనవేలులో - అగ్ని తత్వం, చూపుడు వేలులో వాయుతత్వం, మధ్యవేలులో ఆకాశతత్వం, ఉంగరం వేలులో పృధ్వీతత్వం, చిటికన వేలులో జలతత్వం కలిగి ఉండటము వలన చేతితో కలుపుకొని తిన్న ఆహారము పంచభూతాత్మకమై, జీవశక్తిని ప్రసాదిస్తుంది.

## మృష్టాన్న భోజనం :

బాగా శుద్ధిచేసి, శుచిగా వండి, తీర్థయాత్రలు చేస్తూ తన ఇంటివద్ద  ఆగిన అతిథులకు ఆదరణతో వడ్డించగా, తృప్తిగా అతిథులు ఆరగించే భోజనము.

## కొబ్బరి నీటి యొక్క కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు :

1. కొబ్బరినీరు ఎక్కువ కొవ్వును కరిగించటానికి సహాయపడుతుంది.

2. కొబ్బరి నీరు తాగడం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

3. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

4. కొబ్బరినీరు రక్తపోటును తగ్గిస్తుంది

5. కొబ్బరి నీరు విటమిన్ సి, ఎలక్ట్రోలైట్స్ మరియు అధిక ఫైబర్‌తో కూడి ఉండటం వల్ల మన జీర్ణక్రియ పెరుగుతుంది.

## మీకు తెలుసా!

1. నిలబడి నీళ్ళు త్రాగే వారికి మోకాళ్ళ నొప్పులు వస్తాయి. నిలబడి నీళ్ళు త్రాగే వారి మోకాళ్ళ నొప్పిని ప్రపంచంలో ఏ డాక్టర్ బాగుచేయలేడు. కాబట్టి కూర్చుని త్రాగండి.

2. వేగంగా తిరిగే ఫ్యాన్ గాలిక్రింద లేదా ఏ.సి.లో పడుకుంటే శరీరం పెరిగి లావై పోతారు.

6. షర్బతు మరియు కొబ్బరినీళ్ళు ఉదయం 11 గంటలలోపు అమృతం వలె పనిచేస్తాయి.

## శ్రీగురుదత్తాత్రేయ

అనసూయ మాతను పరీక్షించటానికి వచ్చిన త్రిమూర్తులు వారికి సాక్షాత్కరించి అత్రిమహర్షి కోరిక మేరకు మేము ముగ్గరము పుత్రులమవుతామని వరమిచ్చారు. బ్రహ్మ అంశంతో చంద్రుడు, రుద్రుని అంశంతో దుర్వాసుడు, విష్ణువు అంశంతో దత్తాత్రేయుడు అవతరించారు. దత్తాత్రేయుడు వేదాంత తత్త్వ శాస్త్రాన్ని అలర్క మహర్షికి, ప్రహ్లాదునికి, పరశురామునికి ఉపదేశించాడు. అలాగే దత్తాత్రేయుని ఆశ్రమంలో ఆయన చుట్టూ 4 కుక్కలు, 8 మద్యభాండాలు, 16 మంది యువతులు. 32 వివిధ జంతువుల మాంసఖండాలు, 64 విలాస భోగ స్థానాలు ఇన్నిటి మధ్యన స్వామి భోగమూర్తిగా వ్యసన లంపటునిగా అజ్ఞానులకు దర్శనమిస్తారు. వాస్తవానికి జ్ఞానులకు యోగులకు, 4 కుక్కలు 4 వేదాలు, 8 మద్యభాండాలు అష్ట సిద్ధులు, 16 మంది యువతులు 16 కళలు, 32 జంతువుల మాంస ఖండాలు 32 బ్రహ్మ విద్యలు, 64 వివిధ భోగాలు చతుష్షష్ఠి కళలు ఇది శ్రీదత్తాత్రేయుని అసలు రూపం. జ్ఞానులకు ఈ విధంగా సాక్షాత్కరించి అజ్ఞానులకు దూరంగా ఉండాలని పై విధంగా దర్శనమిస్తారు.

**ఓం నమో శ్రీదత్తాత్రేయాయ!**
**యక్ష రాజాయ, శంకర ప్రియాయ నమః**



# అనఘావ్రతం

త్రిమూర్త్యాత్మకుడైన శ్రీ దత్తాత్రేయుని యొక్క గృహస్తు రూపమునకే "అనఘస్వామి' అని పేరు. ఆ స్వామి అర్థాంగికి 'అనఘాదేవి' అని పేరు. అనఘాదేవిలో శ్రీ రాజరాజేశ్వరి, మహాలక్ష్మి, మహాకాళి, మహాసరస్వతి లక్షణాలు నిండుగా ఉన్నాయి. అనఘస్వామిలో బ్రహ్మ, రుద్ర, విష్ణు లక్షణాలు ఉన్నాయి. అనఘుడు విష్ణు స్వరూపుడు. అనఘాదేవి లక్ష్మిస్వరూపము. ఈ దంపతులిద్దరూ నిత్యమూ తపోమయమైన జీవనం గడుపుతూ భక్తులకు తత్వ జ్ఞానాన్ని అనుగ్రహించే అతి ప్రాచీన ఆది దంపతులు. వారికి అష్టసిద్ధులు, (అణిమా, లఘిమా, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం, కామావసాయితా, మహిమా) పుత్రులై అవతరించారు. అనఘావ్రతంకి సంబంధించి పురాణోపోక్తమైన ఒక కథ ఉంది.

నర్మదానది తీరానగల హైహయస రాజ్యానికి మహిష్మతి పట్టణాన్ని రాజధానిగా చేసుకొని కృతవీర మహారాజు పరిపాలించెడివాడు. సంతానంకోసం ఎన్నో యజ్ఞయాగాలు, క్రతువులు, దానధర్మాలు సహిత అనేక పుణ్య కార్యాలు చేసిన ఫలితముగా ఆ రాజుభార్య గర్భము ధరించి, 9 నెలలు నిండుతున్న ఒక శుభముహూర్తంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది మహారాణి. అయితే ఆ బిడ్డడు రెండు చేతులు చచ్చుపడి జన్మించాడు. ఒక వంక పుత్రోదయ ఆనందం, మరొకపక్క ఆ బిడ్డడి అంగవైకల్యము చూసి దుఃఖముతో ఉండేవాడు కృతవీర్య మహరాజు. ఎన్ని వైద్యములు చేయించిన ఫలితము లేకపోయింది, కృతవీర్యుని కుమారుడు కనుక ఆ బాలుడిని కార్తవీర్యార్జునుడు అని పిలువసాగేరు. కార్తవీర్యునికి పన్నెండు సంవత్సరాలు వచ్చు లోపలే తండ్రి కృతవీర్యుడు మరణించెను. మంత్రి, సామంతులు, పురోహితులు కార్తవీర్యుని రాజ్య పాలనకై సింహాసనం అధిరోహించమని కోరేరు. చచ్చుబడిన రెండు చేతులతో నన్ను నేనే రక్షించుకోలేనటువంటి వాడిని, రాజ్యాన్ని, ప్రజలను శత్రువుల నుండి ఎట్లు కాపాడగలను కనుక నాకు రాజ్యాధికారము వలదు. మీలో అర్హులైనవారు, రాజ్యాన్ని పరిపాలించండి అని చెప్పటంతో, విష్ణు అంశంతో పుట్టిన అతనిలోని ధర్మనిరతికి అచ్చెరువొందిన మంత్రులు పిన్న వయస్సులోనే, ధర్మనిరతి గలిగిన మీరే మా రాజ్యాధినేత. మీ వంశస్థులు యోగిరాజు శ్రీ దత్తాత్రేయుని భక్తులు. రాక్షసరాజు జంభాసురుని వధించి దేవేంద్రునికే తిరిగి అతని దేవరాజ్యం ఇప్పించిన ఆ త్రిమూర్త్యాత్మకుడు శ్రీ దత్తాత్రేయుడు, ఆయన సహ్యాద్రి పర్వతాలలో అనేక రూపాలలో తిరుగుతూ ఉంటారని ప్రతీతి. కనుక వారి అనుగ్రహము పొందినచో మీ రెండు చేతులు జీవం పొందగలవు, కనుక మీరు సహ్యాద్రి పర్వతాలకు వెళ్ళి మీ తపోదీక్షతో శ్రీ దత్తాత్రేయుని మెప్పించి, వారి అనుగ్రహం పొంది తిరిగి రండి. అంతవరకు మీ ప్రతినిధులుగా ఈ రాజ్యాన్ని పరిరక్షిస్తామని, మంత్రులు, సామంతులు చెప్పటంతో కార్తవీర్యార్జునుడు శ్రీ దత్తప్రభువు కృపకై సహ్యాద్రి పర్వతం చేరి అనేక రీతుల వారిని ప్రార్థిస్తూ, అనేక రీతులలో దత్తుడు పెట్టిన పరీక్షలలో ప్రాణత్యాగానికైనా సంసిద్ధుడు కాగా, దయాళువైన శ్రీ దత్తాత్రేయుడు తన భార్య అనఘాదేవి (పాపాలను దహింపచేయునది)తో దర్శనమిచ్చి కార్తవీర్యార్జునుని అనుగ్రహిచటమే కాకుండా, తనను తలచినప్పుడు అతనికి సహస్ర బాహువులు వచ్చునట్లుగా, వరమిచ్చారు. శ్రీ కార్తవీర్యార్జునుడు అనఘాదేవి సహిత శ్రీదత్తాత్రేయుని అనుగ్రహముతో వరాలు పొందినది మార్గశిర మాస బహుళ అష్టమి. శ్రీ దత్తానుగ్రహంతో భక్తి యోగాన్ని, యోగసమాధి సిద్ధిని పొంది రాజ్యానికి తిరిగి వచ్చిన కార్తవీర్యార్జునుడిని చూసిన మంత్రి, సామంత సహిత ప్రజలందరూ మహదానందము పొందేరు. తనకు అంతటి భాగ్యం ప్రసాదించిన శ్రీ అనఘాస్వామి అనఘాదేవి పేరిట అనఘావ్రతాన్ని తన రాజ్యమంతటా ప్రజలచే నిర్వహింపచేయటము ద్వారా అందరూ శ్రీ దత్తప్రభువు అనుగ్రహాన్ని చవిచూసేలా చేశాడు కార్తవీర్యార్జున మహారాజు. అప్పటి నుంచి అనఘావ్రతం ప్రసిద్ధి చెందింది. అటువంటి మహత్తరమైన అనఘావ్రతంకి అవధూత పీఠాధిపతి, దత్త స్వరూపులు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి వారు బహుళ ప్రాచుర్యం కల్పించి, కోట్లాది మందిచే ఆ వ్రతం నిర్వహింపచేస్తూ శ్రీ దత్తానుగ్రహపాత్రులను చేస్తున్నారు.

అనఘాదేవి యోగేశ్వరి, జగన్మాత, యోగం నందు ప్రీతి కలది. గృహం, పతి, పత్ని, పుత్రులను అనుగ్రహిస్తుంది. వంశవృద్ధిని కలిగిస్తుంది. సమస్త కోరికలను సిద్ధింపజేస్తుంది. కవితాశక్తిని, కళలను ఇస్తుంది. ఈమెకే 'మధుమతి' అనే పేరు కూడా కలదు. (అతి ప్రాచీనమైన మధుమతి సమేత శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం గుంటూరుజిల్లాలోని మాచర్ల దగ్గరి ఎత్తిపోతల వద్ద కలదు.) ఈమె అనఘాస్వామి భ్రూమధ్య నుండి ఉద్భవించినది. శ్రీదత్తాత్రేయుడు అనఘను వామభాగమున ధరించి ఉన్న శాక్త రూపము. "అనఘము" అంటే పాపము. మూడు రకాలయిన పాపాలను నశింపజేయునది అనఘాదేవి.

అనఘాష్టమి వ్రతానికి ముఖ్యమైన రోజు మార్గశీర్షమాస కృష్ణపక్ష అష్టమి. ఈ రోజున ప్రతి సంవత్సరం ఈ వ్రతం చేయడం చాలా మంచిది. అలాగే ప్రతీ నెలా కృష్ణపక్ష అష్టమి రోజు కూడా చేయవచ్చు. ఈ వ్రతం ప్రతీ సంవత్సరం చేసుకునే వారికి మూడురకముల పాపములు తొలగి వారు "అనఘులు"గా అవుతారు. కాబట్టే ఈ వ్రతాన్ని "అనఘాష్టమీ వ్రతం" అంటారు. ఇది పురాణ ప్రసిద్ధమైన వ్రతం. వ్రత పీట తూర్పు ఈశాన్య దిక్కులో ఉండాలి. బంధుమిత్ర సమేతంగా ఈ వ్రతం చేస్తే ఉత్తమం. పనసచెట్టులో అనఘ-దత్తాత్రేయులవారు వారి పుత్రులైన అష్టసిద్ధులతోగూడి ఉంటారు. కాబట్టి అనఘాష్టమీ వ్రతం పనసచెట్టు క్రింద చేస్తే ఎంతో ప్రశస్తము.

(డిసెంబరు 27వ తేదీ సోమవారము అనఘాష్టమి సందర్భముగా సమర్పణ.)

సేకరణ : **శ్రీమతి ఆర్. విజయ,** విజయవాడ

# శ్రీ దత్తాత్రేయుడు

భగవంతుడు ఒక్కడే ఒక్కప్పుడు ఆయన అనేకమవ్వాలని సంకల్పించాడు. ఆ సంకల్పమే మాయాశక్తి. త్రిగుణాత్మకమైన ఆయన తన మాయచేత యీ జగత్తును సృష్టించి, దాని రూపంలో ప్రకటమయ్యాడు. వెనుకటి ప్రళయానికి ముందున్న జీవులు ప్రళయంలో పరమాత్మయందు సూక్ష్మరూపంలో దాగియుంటారు. వారు సాధన ద్వారా తరించగలందులకు పరమాత్మ అలా మరలా సృష్టి చేస్తాడు. సృష్టి చేసిన ఆ పురుషోత్తముడే ఆత్మజ్ఞానం వలన పొందదగినవాడు. ఎవరయితే ఇంద్రియ విషయాల వలన కలిగే రాగద్వేషాలను దైవీ సంపత్తితో జయిస్తారో అట్టివారే ముక్తిపొందుతారు. అటువంటి ముముక్షువుల కొరకే జనన మరణాలు లేని ఆ పరమేశ్వరుడు తన దివ్య మాయచేత మానవరూపంలో జన్మిస్తాడు. అంతేగాదు, అజ్ఞానం వలన జీవులు అనివార్యంగా చేసే దోషాలు, వాటి వలన ధర్మబద్ధంగా జీవించటానికి యేర్పడే ఆటంకాలను, అవరోధాలను తొలగించడానికి మళ్ళీ భగవంతుడే అవతారం దాలుస్తారు. ఆ భగవంతుడే పరిపూర్ణులైన సద్గురువులుగా అవతరించి, తన లీలల ద్వారా మోక్షేచ్ఛ, ధర్మనిష్ఠ కలిగేలా చేస్తూ ఉంటాడు. ఇలా యెల్లప్పుడూ భూమిమీద పూర్ణులైన మహాత్ములుగా అవతరించే భగవత్తత్త్వాన్నే "శ్రీదత్తాత్రేయుడు" అన్నారు.



త్రిగుణాతీతుడైన అత్రి మహాముని, మహా పతివ్రత అయిన అనసూయాదేవికి భగవంతుడు పుత్రుడుగా మార్గశిర పూర్ణిమ బుధవారంనాడు మృగశిర నక్షత్రంలో సాయంత్రం జన్మించాడు. ఆ బాలునికి దత్తుడని నామకరణం చేసారు. అత్రియొక్క సంతానం గనుక వీరిని ఆత్రేయులని, దత్తుణ్ణి "దత్తాత్రేయు" దని వ్యవహరిస్తారు

ప్రకృతి వికారాల వలన పీడుతులైన మానవులు, మునులు బాలదత్తుడిని శరణువేడగా యోగలీలగా వారి మనోవికాసాలను తొలగించి జ్ఞానము ప్రసాదించాడు, శిష్యులకు వేదం నేర్పాడు. ఒకప్పుడు ధ్యాననిష్ఠుడై ఉంటాడు. తన యోగ మాయచేత లీలలను చేసి జీవులను తరింపజేశాడు శ్రీదత్తుడు.

బదరికావనం చేరి అక్కడ కఠోర తపస్సుచేత వివిధ సిద్ధులు పొందిన సిద్ధులెందరో అహంకార ఆగ్రహాలతో వాదులాడు కొంటున్న వారికి – గురువును ఆశ్రయించి, చిత్తశుద్ధితో సేవించి, కర్మ, నిష్ఠ మరియు ధ్యానము అనే సాధనతో అతి దుర్లభమైన పరమానందాన్ని పొందవచ్చని బోధించి, వారికి తమ యోగాన్ని, సిద్ధిని యిచ్చి, పరుల సిద్ధిని రద్దుచేసే మంత్రముపదేశించాడు.

అజ్ఞానమే జీవుల దుఃఖానికి కారణమని, కలహాలలో తగుల్కొని, ధ్యానంలో చంచలులుగా ఉన్నకొందరు సిద్ధులకు తన విశ్వరూపం దర్శింపచేసి వారిని ఆత్మశుద్ధులుగా చేసి జ్ఞానాన్ని బోధించాడు శ్రీదత్తాత్రేయుడు.

శ్రీదత్తుడు ప్రదర్శించే మాయలకు చలించక ఆయనను సేవించిన కార్తవీర్యార్జునునకు భక్తియోగాన్ని, యోగ సమాధి సిద్ధిని బోధించి, అనుగ్రహించి, స్వధర్మపాలన చేయించాడు.

భూమిని నిక్షాత్రం చేయదలచిన పరశురాముని యోగసిద్ధుడినిచేసి, అనుగ్రహించాడు. అలర్కుడికి ఆది గురువుగా దర్శనమిచ్చి ఆత్మవిచారాన్ని బోధించి తరింపచేసాడు. తాను అత్యాశ్రమినని చెప్పి దత్తుడు పింగళనాగునికి సుందరము, శుభమూ అయిన శివరూపంలో దర్శనమిచ్చి అనుగ్రహించాడు. అమలక వృక్షం క్రింద ముని రూపంలో తపస్సు చేస్తుంటే సిద్ధాదులు మొదలు సర్వప్రాణులూ సహజవైరాన్ని మాని కలసి జీవించాయి.. శంఖ చక్ర గదా పద్మహస్తుడై బ్రహ్మకు దర్శనమిచ్చాడు. దిగంబర అవధూతగా యదుమహారాజుకు దర్శనమిచ్చి 24 మంది సాధక గురువుల నుండి తాము నేర్చిన జ్ఞానాన్ని బోధించాడు. దత్తానుగ్రహం వలన యదుమహరాజు వంశంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. ఇలానే ప్రహ్లాదునికి జ్ఞానం ఉపదేశించి, అనుగ్రహించాడు.

మనదేశంలో యెన్నో ఆధ్యాత్మిక సంప్రదాయాల వారిచేత పరమ గురువుగా కీర్తించబడిన శ్రీదత్తస్వామి, యెందరో సాధకులను అనుగ్రహించి, మహాత్ములుగా రూపొందించారు. 13వ శతాబ్దంలో తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో అప్పలరాజు శర్మ సుమతి అనే పుణ్యదంపతులైన తమ భక్తులను అనుగ్రహించి, వారికి పుత్రుడుగా అవతరించారు. ఆయనయే శ్రీపాద శ్రీవల్లభుడు. అటుపిమ్మట అంబిక అనే స్త్రీకి వరమిచ్చిన కారణంగా 15వ శతాబ్దములో మహారాష్ట్రంలోని కరంజగ్రామములోని శ్రీ మాధవశర్మ, అంబ దంపతులకు కలియుగములో 2వ అవతారమైన శ్రీ నృసింహ సరస్వతిస్వామిగా శ్రీ దత్తాత్రేయుడు జన్మించటము జరిగింది. కలియుగములో మొదటి, రెండవ దత్తావతారముల చరిత్ర అయిన 'శ్రీగురుచరిత్ర' పారాయణ వలన ఇహలోక కామ్యములు సిద్ధించటమే కాక, సాటిలేని సద్గురువు సాంగత్యము లభించి, జన్మసాఫల్యం కలుగుతుంది.

(డిసెంబరు 18వ తేదీ శనివారము శ్రీదత్తజయంతి
సందర్భముగా శ్రీగురుచరిత్ర పారాయణ చేసి
శ్రీదత్తప్రభువు కృపకు పాత్రులవుదాము)

సేకరణ, సంకలనం : **శ్రీమతి వి.యస్. లక్ష్మి**, విశాఖపట్నం

# సింధునది పుష్కరాలు



నీరు.... సకలజీవకోటికి ప్రాణాధారం. మానవాళి ఉనికి, నాగరికత నీటిపైన ఆధారపడిఉంది. మన ప్రాచీన భారతీయ సనాతన ధర్మం జలానికి అమితమైన ప్రాధాన్యత ఇచ్చింది. దాహం తీర్చడమే కాదు, ఆచమనం మొదలు తర్పణం వరకు మనిషికి నీటితోనే పని. చివరకు తులసి తీర్థం గొంతు దిగాలన్నా నీటిచుక్క సాయపడుతుంది. అందుకే పంచభూతాల్లో జలానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.

ఆ నీరు ప్రవాహరూపం దాల్చితే దాన్ని నదిగా పిలుస్తారు. తూర్పు దిశగా ప్రవహిస్తూ నేరుగా సముద్రుడిలో కలిస్తే నదిగాను, అలాగే పశ్చిమ దిశగా ప్రయాణించి సాగరాన్ని చేరుకొంటే దాన్ని నదం అని అంటారు. నదీనదాలంటే మన దేశంలో కేవలం నీటి ప్రవాహాలు కావు. అవి దేవతా స్వరూపాలు. శివుడు జలాభిషేక ప్రియుడు. మహావిష్ణువు భక్తితో తనకు ఒక్కనీటి బొట్టును సమర్పించినా చాలునంటాడు. మహా విష్ణువు నీటిలోనే నివాసం ఉంటాడు. నారం అంటే నీరు.. నీరులో నివసిస్తాడు కాబట్టి ఆయనకు నారాయణుడు అనే పేరు వచ్చింది.

మన ప్రాచీన ఋషులు కూడా నదీతీరాల్లో నివసించేవారు. ఋషుల పుణ్యక్రతువుల కారణంగా నదీజలాలకు అపారమైన ఆధ్యాత్మిక జీవశక్తి చేకూరుతుందని, మానవులు శారీరక మాలిన్యాలతోపాటు, కర్మలకు చెందిన కాలుష్యాలను సైతం కడిగివేసే సామర్థ్యం సమకూరుతుందని పెద్దలు చెబుతారు. ఆ విశ్వాసం కారణంగానే మనదేశంలో పుణ్య నదీపుష్కరాలకు జనం కోట్ల సంఖ్యలో హాజరవుతారు.

పవిత్రమైన నదులలో మానవులు స్నానం చేసి వారి పాపాలను పోగొట్టుకొంటున్నారు. నదులు ఆ పాపాలు స్వీకరించి అపవిత్రులు అవుతున్నాయి. మానవులు వల్ల అపవిత్రులై ఆ నదులు పాపాలు భరించలేక బాధ పడుతుంటే, పుష్కరుడు అనే మహానుభావుడు బ్రహ్మ గురించి తపస్సు చేసి బ్రహ్మ దేవుని అనుగ్రహం పొంది తనను ఒక పవిత్ర క్షేత్రంగా మార్చమని కోరతాడు. ఈ విధంగా పుష్కరుడు పుష్కర తీర్థంగా మారి స్వర్గలోకమున మందాకిని నది యందు అంతర్భూతమై ఉన్నాడు.

పుష్కర అనేది భూమిమీద సప్త ద్వీపాలలోనూ ఒకదాని పేరు. కానీ, సాధారణంగా పుష్కరం. పుష్కరాలు అంటే నదులకు 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే పుష్కరోత్సవాలనే స్ఫురిస్తుంది.

అంతేకాదు ఆయా హోమ హవిస్సులను స్వీకరించడానికి వివిధ దేవతలు తీర్థాలకు వేంచేస్తారు. వారికి అతిథ్యం ఇచ్చే నిమిత్తం పుష్కరుడు వస్తాడు. పుష్కరాలు వస్తే దేవతలకే కాదు నదులకూ గొప్ప పండుగే ఒక్కో నదిలో ఏడాది చొప్పున 12 పుణ్యనదుల్లో పుష్కరుడు నివాసం ఉంటాడు. కాబట్టి ప్రతి నదికీ 12 ఏళ్లకోసారి పుష్కరాలు వస్తాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం అత్యంత పుణ్యప్రదమని హిందువులు విశ్వాసం.

తైత్తరీయ ఉపనిషత్తును అనుసరించి బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఔషధులు, ఔషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవుడు పుట్టాయని వివరిస్తుంది. ఇలా జీవరాశులకు ప్రధానమైన జలం స్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు.

మనదేశంలోని పన్నెండు నదులకు పుష్కరాలు జరపడానికి సంబంధించి వాయు పురాణంలో ప్రస్తావన ఉంది. బ్రహ్మ లోకవాసి అయిన పుష్కరుడు గురుగ్రహం అయిన బృహస్పతి ఎప్పుడు ఏ రాశిలో ప్రవేశిస్తుందనే కాలాన్ని బట్టి ఈ పన్నెండు నదులనూ దర్శిస్తుంటాడని ఐతిహ్యం. బ్రహ్మస్వయంగా పంపించిన వాడు కావడం చేత పుష్కరుడు నదులకు వచ్చినప్పుడు సప్త మహా ఋషులు ఆయనకు అతిథ్యం ఇచ్చి గౌరవిస్తుంటారని, వారు సూక్ష్మ దేహంతో నదులకు వస్తారు కనుక వారు వచ్చిన కాలం పవిత్రమైనదనీ ఒక విశ్వాసం.

పుష్కరాలు జరిగే సంవత్సరకాలంలో నదికి సమీప ప్రాంతాలలోని వారు వివాహాది శుభకార్యాలు చేయరు. తప్పని సరిగా చేయవలసి వస్తే వేరే ప్రాంతాలకు వెళ్ళి చేస్తారు.

సింధూనది టిబెట్‌లోని మానస సరోవరం, కైలాస పర్వతాల్లో ఉద్భవిస్తోంది. ఇది కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాక్‌లోని డెమ్‌చోక్‌లో భారత్‌లోకి ప్రవేశించి, అక్కడి నుంచి న్యోమ, లెహ్, నిమూ, కల్సినిము, బాటాలిక్ వరకు భారత్‌లో ప్రవహించి, అక్కడి నుంచి పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిట్ బాల్టిస్తాన్ మీదుగా ప్రవహించి, కరాచీ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది.

సింధూనది కశ్మీర్ లోయలో ప్రవేశించదు. కానీ సింధునది ఉప నదులు కశ్మీర్ లోయలో ప్రవహిస్తాయి. సోనేమార్గ్‌లో ఉద్భవించిన ఒక వాగును కశ్మీరీలు సింధ్‌గా వ్యవహరిస్తారు. ఈ వాగు షాదిపూరా అనే గ్రామం సమీపంలోని నారాయణ్ భాగ్ వద్ద జీలం నదిలో కలుస్తోంది. రెండు నదులు కలిసే సంగమం కావడంతో యాత్రీకులు ఇక్కడే పుష్కర స్నానాలు ఆచరిస్తారు.

2021 నవంబరు 21వ తేది నుండి డిసెంబరు 2వ తేదీవరకు సింధూనదికి పుష్కరాలు సందర్భముగా సమర్పణ

సౌజన్యం : **'సింధూనది చరిత్ర'** సేకరణ : **"విరించి"**

# సత్సంగమము



సత్ సంగమము అన్న పదానికి మంచి కలయిక అనేది ఒక అర్థమయితే, సత్ అనగా శుద్ధమయినది. నిర్వికారము, నిరంజనము అని కూడా చెప్పుకోవచ్చు. అనగా సత్ అంటే పరబ్రహ్మము, దానిలో ఐక్యమగుటయే సంగమమ్. అది సత్సంగమము.

శ్రీసాయి సంప్రదాయంలో ఈ సాధనా విధానానికి ఉన్న మహత్తర శక్తిని పూజ్యశ్రీ ఆచార్యులవారు ''లీలామృతము''లో వివరించారు. ఈ సత్సంగ వేదికలు సాధనాలయాలుగా మారటమే గాకుండా అక్కడ శ్రీ సాయినాథుని దివ్యశక్తి ఉద్దీపమై ఒక ప్రగాఢ శాంతిని అనుభవింప చేస్తుంది. చాలామంది భక్తులు ఒంగోలు "షిర్డీసాయి మందిర్ మహారాజ్"లో గల ద్వారకామాయిలో ఏదో అనిర్వచనీయమైన శాంతి, ప్రశాంతత లభిస్తుందని అంటారు. దానికి కారణం అక్కడ జరిగిన సత్సంగాల ప్రభావమే! ఆ మందిరం ఆచార్యులవారి సత్సంగాలతో పునీతమయింది. విద్యానగర్‌లో వారు నిర్వహించిన సత్సంగాల ప్రభావం వలన మహాత్ములు విద్యానగర్ వచ్చి దర్శన, ఆశీస్సులు అనుగ్రహించారు. ఆంధ్రరాష్ట్రంలో అనేకచోట్ల సత్సంగాలు నిర్వహించిన చోటల్లా సాయి మందిరాలు రూపుదిద్దుకోవటం, ఆధ్యాత్మికతలో పురోగాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం మన మెరిగిన సత్యం. ఒంగోలులో చివరి శ్వాసవరకూ సత్సంగాలు నిర్వహించారు శ్రీ ఆచార్యులవారు. వారు పూర్ణ సిద్ధపురుషులయినా, ప్రతి శనివారం తమ వసతి గృహంలో సత్సంగము నిర్వహించారు. పైగా ఈ సత్సంగ సభ్యులను మహాత్ముల, దర్శన, ఆశీస్సుల కొరకు పంపటం వారు ఆ మహాత్ముల అనుగ్రహాన్ని పొందటం జరిగింది. ఇది ఒక సమిష్టి యజ్ఞముగా రూపకల్పన చేశారు పూజ్యశ్రీ ఆచార్యులవారు.

ఈ సత్సంగ వేదిక రాగ, ద్వేష, అసూయ, ప్రేమ, ప్రీతి, గౌరవం ఇలా అనేక భావాలు, మనఃప్రవృత్తులు గల వ్యక్తులందరితో కలిసి చేసే సాధన. అనగా ఒక విధంగా వర్క్‌షాపు లాంటిది. ఇక్కడ మనలోని బలహీనతలను తొలగించుకునే అవకాశం మరియు సదుపాయం కూడా వుంది. కారణం శ్రీసాయినాథుని దివ్యసన్నిధి ప్రభావం ఈసత్సంగ వేదికలలో నిక్షిప్తమై ఉంటుంది. అన్య భావాలు తలెత్తకుండా ఉంచే శక్తి మనం వివేచించుకొనే అవకాశం ఇక్కడ లభిస్తుంది. ఒకసారి పూజ్యశ్రీ ఆచార్యులవారు సత్సంగాన్ని గురించి ఇలా అన్నారు. "మనకి ఆకలి లేదు. ఎదురుగా స్వీటు ఉంది. తింటే బాగుండు అనిపిస్తుంది. అదే జిహ్వాచాపల్యం అనే వాసనాబలం. లేదు ఎందుకు తినటం ఆకలిలేనప్పుడు అని నిగ్రహించుకోవటం "రుచి"ని జయించటం. ఇది తినే వస్తువుల మీద వుండే భావం. అవతలి వ్యక్తుల మీద వుండే భావాలను కూడా సాయిని ఆలంబనగా తీసుకుని ఇలా నిర్మూలించుకోవచ్చు. ఇది హృదయ పరిశుద్ధతకు దారితీస్తుంది. పరిశుద్ధ హృదయంలో శ్రద్ధ, ఓరిములు దృఢంగా నిలదొక్కుకుంటాయి. పై వివరణకు శ్రీసాయి చెప్పినదే ప్రమాణం. భక్తుని వద్దనుండి, అతనిపైగల వైరభావము చేత, ప్రసాదం తీసుకోని భక్తుని మందలించి "ఇస్తున్నదేమిటి? అనే భావన కాకుండా ప్రసాదం నిరాకరించటం ఎంత తప్పో తెలియచేశారు".

అయితే ఇక్కడ ఒక్క విషయం తప్పక మననం చేసుకోవాలి. ఈ సత్సంగాలలో పాల్గొన్నవారికి పూర్వపుణ్యం వల్లనో లేదా చేసిన కొద్దిపాటి సాధన వల్లనో ఒక్కొక్కసారి మెరుపువలె తళుక్కున మెరిసినట్లు "దైవానుభూతి" కలుగుతుంది. ఆ చిరు మెరుపులకే తామేదో ''ఆత్మద్రష్టలు'' అయినట్లు భ్రమసి, సాటివారిని సదా విమర్శిస్తూ, తామే నిజమైన భక్తులమని అహంకరించి శ్రీసాయికి దగ్గరయ్యే బదులు దూరమై, జనావళికి దగ్గరవుతారు. పైగా ఈ ప్రతిపని "దైవాదేశం" అంటారు. ఇది అసలు ఎలా పొసగుతుంది. దైవ ప్రతినిధిగా రూపుదాల్చాలన్నా, ఆధ్యాత్మిక మార్గంలో ఇతరులకి త్రోవచూపేవానిగా మారాలన్నా, మన చేతిలో లేనివి ఎన్నో కలిసిరావాలి. గురువు యొక్క సంపూర్ణ అనుగ్రహాన్ని పొందాలి. వారి ద్వారా సమాజసేవ చెయ్యమని స్పష్టమైన ఆదేశం ఉండాలి. తన ప్రవర్తన నిజాయితీగా, ఇతరులు వేలు పెట్టిచూపలేని విధంగా వుండాలి. ఇన్ని నీవు పొందినప్పుడు జగత్ కళ్యాణంలో నీవంతు కర్తవ్యాన్ని నిర్వర్తింపచేస్తారు సాయి. ఇలా విపరీత ప్రవర్తనలు జరుగుతాయనే సాయి ప్రత్యక్ష అనుభవాలను ప్రసాదించారు. ఫకీరుకు పైకమివ్వమని "ఇర్రన్‌షా"ను ఆదేశించారు. శ్యామాకు బూటీకి ఒకేసారి స్వప్న సందేశమిచ్చారు. దీక్షిత్‌కు టాంగా వస్తుందని చెప్పారు. ఇంకొకరికి టాంగా తీసుకువెళ్ళమని చెప్పారు. డేంగలే వద్దకు వ్యాధిగ్రస్తుని పంపారు. అతనిని పంపుతున్నట్లు డేంగలేకు చెప్పారు. నానాకు "టీ" యివ్వమని పూజారికి చెప్పారు. ఇంకా నిదర్శన పూర్వకమైన అనుభవాలను ప్రసాదించారు. అలాగాకుండా ప్రతిదానికి ఆదేశమయిందని, బాబా చెప్పారు అని అంటే ఎలా విశ్వసించటము? దీనికి జోగ్ ప్రశ్న శ్రీసాయి సమాధానము సరైన నిర్వచనము. జోగ్ "సద్గురువు శిష్యుణ్ణి తనంతటి వాడుగా చేస్తానన్నారు గదా! సాయి నన్నింకా అలా చెయ్యలేదేమి?'' అనుకోగానే "వీడు నా స్థానం ఆక్రమించాలని చూస్తున్నాడు"అన్నారు సాయి. "నా సేవ పూర్తయినట్లు గుర్తు ఏమిటి?" అనుకోగానే, నావలె సర్వబంధాలను వీడి భిక్షమెత్తి నావలె జీవించ గలిగినప్పుడు అన్నారు సాయి. ఇది చాలు మన స్థితి ఏమిటో తెలియటానికి.

కనుక సత్సంగాన్ని మన సాధనకు ఉపయోగపడే విధంగా మలచుకోవాలి. సాయి అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందేలా అది రూపుదిద్దుకోవాలి. ఇది అందరూ పొందాలనే పూజ్యశ్రీ ఆచార్యులవారి ఆకాంక్ష. కనుకనే సాయి ఆరాధనలో సత్సంగానికి చాలా ప్రాధాన్యత నిచ్చారు. పైగా శౌనకాది మహామునులకే అవసరమైన ఈ సత్సంగము మనకెందుకు కాదు? అని వారి బోధ. కనుక సాయి భక్తులందరికీ ఆవశ్యకమైన సాధనా విధానం సత్సంగమము.

ఆచార్యులవారు తాను ఆచరించిన దానిని మనము ఆచరించి తరించటమే వారి జన్మదిన సందర్భముగా మనమిచ్చే దక్షిణ కావాలి

(అక్టోబరు 30వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి జయంతి సందర్భముగా సమర్పణ.)

రచన : **నామధారకుడు**

# ఏరిన ముత్యాలు

### జ్ఞానం

జ్ఞానమనేది సంపాదిస్తే వచ్చేది కాదు మనలో ఉన్న
అజ్ఞానాన్ని విడిచిపెడితే వచ్చేది

### ధీరుడు

ఎంత అరగదీసినా గంధంచెక్క సువాసన కోల్పోదు
అలానే ఎన్ని కష్టాలు వచ్చినా ధీరుడు
తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోడు

### ఆలోచన

పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద
ఆధారపడదు అది మనకు అందించే ఆలోచనమీద
ఆధారపడి ఉంటుంది

– మహాత్మాగాంధీ

### నిజాయితీ

నిజాయితీ అనేది ఇతరులు గమనిస్తున్నప్పుడు
నీవు కనబరిచే ప్రవర్తన కాదు అది నీలో ఉండే విధానం

### ఓటమి

గెలవకపోవటం ఓటమి కాదు మరల
ప్రయత్నించకపోవటం ఓటమి

### మేలు

అసత్యంతో సాధించిన విజయం కంటే సత్యంతో
సాధించిన పరాజయమే మేలు

– మహాత్మాగాంధీ

### గొప్పదనం

మనలోని గొప్పదనం మనకి వచ్చిన కష్టాన్ని
ఎదుర్కోనటంలోనే దాగి ఉంది

### కష్టాలు

మనిషికి కలిగేకష్టాలు రెండేరెండు. ఒకటి మనలను
బాధించేది, మరొకటి మనలను మార్చేది.

### శాశ్వతం

మనం మనకోసం చేసేది మనతోనే అంతరించిపోతుంది
ఇతరులకోసం చేసేది శాశ్వతంగా నిలచి ఉంటుంది

– మహాత్మాగాంధీ

### అపజయం

మన లక్ష్యాలు, ఆలోచనలు, విలువలు మర్చిపోయినప్పుడు
మాత్రమే అపజయం పాలవుతాము

– జవహర్‌లాల్ నెహ్రూ

### కొలమానం

సమయానికి కొలమానం సంవత్సరము గడిచిపోవటం
కాదు ఆ కాలంలో మనం ఏమి చేశాము, ఎలా ఉన్నాము,
ఏమి సాధించాము అన్నది ముఖ్యం

### ప్రేమ - భాధ్యత

ఈ లోకంలో మంచివాళ్ళు చెడ్డవాళ్ళు ఉంటారేమో గాని
ప్రేమ లేని అమ్మ, భాధ్యత లేని నాన్న ఉండరు.

### సత్యం

ప్రతి కదలిక ఈశ్వరునిదే జరిగేది జరుగుతుంది,
జరుగనిది జరుగదు, ఇది సత్యం.
కనుక మౌనంగా ఉండడం ఉత్తమము.

– రమణమహర్షి

### విజయం

నీ విజయాన్ని అడ్డుకునేది నీలోని ప్రతికూల
ఆలోచనలే, క్రింద పడ్డామని ప్రయత్నం ఆపితే
చేసే పనిలో ఎన్నటికీ విజయం సాధించలేము

– అబ్దుల్‌కలాం

### సంతోషం

జీవితమంటే ఎదుటివారిని సంతోషపెట్టటము
మాత్రమే కాదు, తన సంతోషాలను
ఎదుటివారితో పంచుకోవటం